- విపత్తు కాలాలు - తెలుగు సాహిత్యంలో ప్రతిస్పందనలు
- తారకరామ వైభవం
- చమత్కార నిధి - చేమకూరి వేంకటకవి
- భూతం ముత్యాలు 'దుగిలి' కవిత్వం-దళిత స్పృహ
- జ్ఞానపీఠంపై భరద్వాజ 'మహర్షి'
- 'అరచేతిలో బువ్వ పువ్వు' కావ్యంలో కర్షక జీవితం
- కథా సాగర్ కథలు - స్త్రీల సమస్యలు - పరిశీలన
- నీతి శాస్త్రము - తాళపత్ర గ్రంథము

మూసీ
MUSI

• Samputi : 28 • Sanchika : 09 • Pages : 64 • Rs. 20
• July 2025

Scanned with OKEN Scanner

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 9 3 హైదరాబాద్ జులై : 2025



మూసీ

సాహిత్య
సాంస్కృతిక
చారిత్రక

చదివి దాచుకోదగిన ఏకైక తెలుగు మాసపత్రిక

సంపుటి : 28 సంచిక : 9
జులై - 2025
'విశ్వావసు' ఆషాఢ మాసం

సంపాదకులు (EDITOR)
సాగి కమలాకర శర్మ
SAGI KAMALAKARA SHARMA

సహ సంపాదకులు (ASSOCIATE EDITOR)
డా. దత్తయ్య అట్టెం
Dr. DATTAIAH ATTEM

Printed and Published by
B. MANOHARI

Type Setting at :
Kavyasree Graphics
Ph: 934 797 1177

Printed at : Sri Sai Process
Ph. 27563075

విడిప్రతి : 20/-
సంవత్సర చందా : 200/-
శాశ్వత సభ్యత్వం : 2500/-
(పది సంవత్సరాలు మాత్రమే)

చెక్కులు, డి.డి.లు 'మూసీ తెలుగు మాసపత్రిక'
(MUSI Telugu Monthly Magazine)
పేరుపై మాత్రమే పంపాలి.

వివరాలకు : మేనేజర్, మూసీ మాసపత్రిక,
2-2-1109/బికె - ఎల్ఐజి-10,
బతుకమ్మకుంట, బాగ్ అంబర్‌పేట, హైదరాబాద్
- 500 013 .. ఫోన్ : 934 797 1177
email : editormusi@gmail.com
website : musimagazine.org

INTERNATIONAL STANDARD SERIAL NUMBER
ISSN 2457-0796

ఈ సంచికలో ...

విపత్తు కాలాలు - తెలుగు సాహిత్యంలో ప్రతిస్పందనలు ...
డా. నుగ్గు నూతుల యాకయ్య - 7
నల్లగొండ జిల్లా దళిత నాటకం - దళిత సమస్య చిత్రణ ... గరిగంటి కృపాకర్-11
తారకరామ వైభవం ... ఆచార్య ఎం. గోనానాయక్ - 15
చమత్కార నిధి - చేమకూర వేంకటకవి - డా. ఏలె విజయలక్ష్మి - 19
భూతం ముత్యాలు 'దుగిలి' కవిత్వం - దళిత స్పృహ, బహుజన దృక్కోణం - 24
సాహిత్య పరిశోధనలో ఊహా ప్రతిపాదన : అవగాహన, అనువర్తనం
... ఆచార్య గంపా వెంకటరామయ్య - 29
జ్ఞానపీఠంపై భరద్వాజ 'మహర్షి' ... డా. కొడోజు కృష్ణమూర్తి - 37
'అరచేతిలో బువ్వ పువ్వు' కావ్యంలో కర్షక జీవితం ... ఆచార్య ఎన్. ఈశ్వర్ రెడ్డి
కథా సాగర్ కథలు - స్త్రీల సమస్యలు - పరిశీలన ... ముప్కె మేఘమాల - 47
నీతి శాస్త్రము - తాళపత్ర గ్రంథము ... డా. గండ్ర లక్ష్మణరావు - 51

కవిత్వం

తొలకరి ... ఆచార్య శ్రీవత్స - 5; తుకారాం అభంగం - డా. మంత్రి శ్రీనివాస్ - 6; వారాహి నవరాత్రులు - పంచచామర మాలిక - జి. లింగేశ్వర శర్మ - 10; ఐతరేయోపనిషత్తు ... జక్కని వేంకటరాజం - 14; అనుమానం (కంద విన్యాసం) ... వల్లభాపురం జగార్దన - 53; కాగితం పేలిక ... డా. ఎన్. గోపి - 62.

సమీక్ష

నీరాజనం ... ఘట్టమరాజు 55; సోమరాజు ఇందుమతీ కవిత్వం - భావచిత్రాలు - డా. స్వప్న భువకర్ - 57; రహదారి దీపాలు ... డా. ఎం.. పురుషోత్తమా చార్య - 59.

ఈ పత్రికలోని వ్యాసాలు, కథలు, కవితలు, అభిప్రాయాలు ఆ యా రచయితల సొంతమే కాని పత్రికకు ఆ అభిప్రాయాలతో ఎటువంటి సంబంధం లేదు.

Printed, Published and Owned by :
B. MANOHARI, 2-2-1109/BK-LIG-10, Bathukamma Kunta, Bagh Amberpet, Hyderabad - 500 013. Telangana.
Office : 2-2-1109/BK-LIG 10, Bathukammakunta, Bagh Amberpet, Hyderabad -13.
Printed at Sri Sai Process, 3-4-612/1, Narayanguda, Hyderabad - 500 029. Telangana.
Editor : **Dr. Sagi Kamalakara Sharma. RNI No. 37723/80**

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 9 హైదరాబాద్ జూలై : 2025

సంపాదకీయం

వ్యక్తి శక్తి కావాలి

మనిషి మనీషి కావాలి

మానవుడు
మహనీయుడు కావాలి

ఉన్న స్థానం నుండి
ఉన్నత స్థానానికి చేరాలి

పరిమితుడు
అపరిమితుడు కావాలి

స్థాయి విస్తరించాలి

దైవత్వం మేల్కొనాలి

తనను తాను నిరంతరం
ఉద్ధరించుకోవాలి

అందరికీ ఆదర్శంగా
ఆమృతమూర్తిగా
మారాలి

**నీలో దీపం వెలిగించు
నీవే వెలుగై వ్యాపించు**



ప్రజ

జ శబ్దానికి పుట్టుక అని అర్థం. జాతుడు, జాతి, జన్మ, జాతకం మొదలైన పదాలు ఈ విషయాన్ని రూఢి చేస్తున్నాయి. ప్రకృష్టంగా జన్మించినవారు 'ప్రజలు' అని అర్థం. 'ప్రజా స్యాత్సంతతౌ జనే' అనే మాట ప్రకారం.. ప్రజా శబ్దం సంతానానికి, జనులకు పేరు. ప్రజాయత ఇతి ప్రజా, జనీ ప్రాదుర్భావే .. పుట్టునది. చంపూభారతం ప్రకారం 'ప్రజయా హి మనుష్య ఇత్యసా'.. ప్రజలు – మనుష్యులు అర్థంలో వినియోగించుకోవడం జరుగుతుంది. వైదిక సాహిత్యంలో కూడా వేరు వేరు ప్రదేశాల్లో ఈ శబ్ద ప్రయోగాలు కనిపిస్తున్నాయి.

ప్రపంచము, ప్రజ, ప్రకృతి మొదలైన పదాలన్నీ నిత్యజీవితంలో మనకు వ్యాపనంలోనికి వచ్చేసిన పదాలు. వీటి వెనుక ప్రత్యేకార్థాలు కనిపిస్తున్నాయి. పంచభూతాదుల పై దృష్టి ఉంటే ఈ విషయాలు మనకు అర్థం అవుతాయి. స్పష్టంగా రచించ బడిన ఈ పంచభూత వ్యవస్థలో ఇంకా ఉన్నతంగా తీర్చిదిద్దబడి పుట్టినవారు 'ప్రజలు'. శారీరక నిర్మాణంలో గానీ, బుద్ధి కుశలతలో గానీ మిగిలిన జీవజాతుల కన్నా ఉన్నతంగా విస్తరించి, ప్రకృతి రహస్యాలను ఛేదిస్తూ, తాను ఉన్నతంగా మారుతున్న జాతికి 'ప్రజలు' అని పేరు.

ఇంత మంచి అర్థంతో నిత్య జీవితంలో ప్రయోగించబడుతున్న మానవుడు తనకు తాను ఇంకా ఉన్నతంగా మారాల్సిన అవసరం ఉంది. కానీ శబ్దార్థం కూడా తెలియకపోవడం వల్ల స్థాయిని తగ్గించుకుంటూ, ఇబ్బందులకు గురి అవుతున్నాడు.

ఈ లోకంలోకి ప్రవేశించిన వ్యక్తి (వ్యక్తమైనవాడు) తాను జన్మించిన స్థాయి నుండి అన్ని రకాలుగా ఉత్తమ, ఉన్నత స్థాయిల్లోకి చేరి మరణిస్తే, తరువాతి జన్మ అటువంటి స్థాయినుండి మళ్ళీ ప్రారంభం అవుతుందని ఆధ్యాత్మిక శాస్త్రాలు చెబుతున్నాయి. ఒకవేళ తనకు తెలియకగానీ, అజ్ఞానంతోగానీ, అవివేకంతో గానీ ఏ విధంగా నయినా స్థాయి తగ్గించుకుంటే మళ్ళీ జన్మ అటువంటిదే అవుతుంది. లోకంలో అన్ని జీవులు కూడా వేరు వేరు ప్రదేశాల్లో, వేరు వేరు కులమతాల్లో, ఆర్థిక, సామాజిక వర్గాల్లో, రూపాల్లో, లింగాల్లో, వేరు వేరు బంధు వర్గాల్లో, మానసిక స్థాయిల్లో జన్మిస్తున్న కారణం ఇదే. జీవులన్నింటి వ్యత్యాసాలు తమకు తామే నిర్ణయించుకుంటున్నాయని ఆధ్యాత్మిక భావన. తన ఉన్నతి, పతనం తన జ్ఞానంపైన, తన చుట్టూ ఉన్న వాతావరణంపైన ఆధారపడి ఉంటుందని భారతీయ భావన. తన చుట్టూ ఉన్న పరిస్థితులు కూడా అవే ఎందుకు ఉండాలి అన్న ప్రశ్న వేసుకుంటే ఈ భావనకు మనకు సమాధానం లభిస్తుంది. చుట్టూ ఉన్న చుట్టాలు, బంధాన్ని పెంచే బంధువులంతా వారే ఎందుకు అయ్యారు.. అదేవిధంగా వేరు వేరు జీవిత సంఘటనలు, పరిచయాలు, వివాహాలు, సంతానం అంతా.. అంతా.. ఒకటికి రెండుసార్లు ఆలోచించిన భారతీయ భావన తన వ్యక్తీకరణకు తానే కారణంగా చెప్పింది.

ఇంత ఉన్నతంగా జన్మించిన మానవుడు ఇంతకన్నా ఉన్నతమైన పనులు చేయాల్సి ఉండగా, తనను తాను ఇబ్బంది పెట్టుకొని, ఇతర జీవులను, జీవజాతులను, అణువులను ఇబ్బంది పెడుతూ తనను తాను కోల్పోతున్నాడు. అదేవిధంగా జ్ఞానంతో ఎదుటివానికి మేలు చేయడం, పశు పక్ష్యాదులకు ఆహారాన్ని ఇవ్వడం, దానం చేయడం, సేవ చేయడం, ప్రకృతిని పరిరక్షించడం వంటి పనుల వల్ల లోకహితం జరిగి, స్థాయి పెంచుకునే అవకాశం కలుగుతుంది. జీవన మార్గంలో అడ్డంకులను తొలగించుకోవాలంటే తగినంత శక్తి కావాలి. శక్తి హీనుడైన వాడు సమస్యను ఎదుర్కోలేక వెనక్కి తిరుగుతాడు. మళ్ళీ పుట్టుకలే ఉంటే ప్రస్తుత స్థాయికన్నా తగ్గిపోతున్నాడు. శ్రమతో అధిగమించిన ప్రజలు ఉన్నతులు, ఉత్తములుగా మారుతున్నారు.

తొలకరి

తొలకరి వానజల్లు విరితోటలపై కురియంగ ప్రేముడిన్
వలపుల పైరగాలి పరువమ్మున మైమరపింపజేసె మ
త్తిలిన సుమమ్ములున్ విరిసె తియ్యని తేనెలు జాలువార్చి; వె
న్నెల జిలుగుల్ స్రవించెను వినీల రసాన్విత రాగబంధమై.

జలదాగమనమ్ములు మీ
రలాంగములింక భువిని రాపిడి వెట్టన్
జలధిరశనమ్ము మైమర
పుల వలపులు నొంది నవ్య పురుటాలయ్యెన్

తులకరించి తనరు తొలకరి మబ్బులు
పరిధవిల్లి కురిసె నురవణించి
వాగు వంకలన్ని పరవళ్ళు త్రొక్కంగ
పుడమి తల్లి విరిసి పులకరించె

పైరగాలి తోడ పరవశించిన పల్లె
పూల సొగసులందు వోహళించె
మలయ మారుతాలు మైఖ కురిపించగ
అవని తల్లి కాంచి అవఘళించె!

అరక పట్టి రైతు మెరక పొలము దున్నె
మొలక నవ్వు తోడ – ముమ్మరింప
విశ్వగంధమందు – వెదజల్లె విత్తన
ములను – శ్రమను మరచె – మోదమలర!
ఏటి గాలి సోకె – నేరువాకలు సాగె
ఎద్దు రంకె వేసె – హితము కోరి
జగతి తాపమణగి శైత్యమ్ములాయెను
చేలలందు తృణము చివురు లెత్తె

కల్మషమ్ము లేని కర్షకావళి చేత
అరక పట్టి దున్నె – నాశ తోడ
దుక్కిటెద్లు కూడ తోషమ్ము నింపుగ
సహకరించి మురిసె – శ్రాంతి లేక

పసిడి భూములందు – పంటలు పండిన
ప్రగతి లేదు రైతు జగతి కెపుడు
గిట్టుబాటు ధరల కెపుడు గిట్టక శ్రమ
నిష్ప్రయోజనమ్ము – నెగడు కొనెను.

ఆచార్య శ్రీవత్స
ఫోన్ : 90003 24024

మూసీ 'వ్యాస' రచయితలకు సూచనలు

మీ వ్యాసాన్ని వర్డ్ (యునికోడ్), పేజిమేకర్ (అను.7)లో టైప్ చేసి editormusi@gmail.com కు మెయిల్ చేయగలరు.

వ్యాససంగ్రహం – (Abstract) : (200 పదాలకు మించకుండా)

1. వ్యాససంగ్రహం : 1) రెండు–మూడు వాక్యాల పరిచయం, 2) వ్యాసరచన ముఖ్యోద్దేశం, 3) పరిశోధన ఊహా ప్రణాళిక, 4) అనుసరించిన పరిశోధన పద్ధతులు, 5) ఆశించే ఫలితాలతో కూడిన ముగింపు
2. Keywords : (కనీసం 5 పదాలు) (ఉదా: భాష, సాహిత్యం, ప్రకియలు, శతకం, నీతులు, విశ్లేషణ, అనువాదం, కవిపేరు, పాత్రచిత్రణ.)

పూర్తి పరిశోధనవ్యాసం (పేజిమేకర్ ఎ4 సైజ్ లో 4–5 పేజీలకు తగ్గకుండా)

1. **ఉపోద్ఘాతం :** ఒకటి లేదా రెండు పేరాలలో పరిశోధన వ్యాస ముఖ్య ఉద్దేశాన్ని ఉపోద్ఘాతంగా పేర్కొనాలి. కవి/రచయిత పరిచయం, పరిశోధనాంశానికి సంబంధించిన పరిచయవాక్యాలను వ్రాయవచ్చును. పూర్వపరిశోధనలకు సంబంధించిన అంశాలను సంక్షిప్తంగా చర్చించవచ్చును.
2. **విషయం :** పరిశోధనవిలువలుండాలి. సొంతంగా రాసినదై ఉండాలి. యధాతథంగా పుస్తకాలు, ఇంటర్నెట్ నుండి గ్రహించకూడదు. కొన్ని విభాగాలుగా విభజించుకుని, ఆయా విభాగాలకు అనుగుణమైన ఉపశీర్షికలు (సైడ్ హెడ్డింగ్స్) పొందుపరచాలి. ఎంచుకున్న పరిశోధన సామగ్రి (పుస్తకాల) నుండి పద్యం, కవిత, గేయం, కీర్తన, కథ, నవల, నాటకభాగాలు మొదలైన ఉల్లేఖాలను (references) అనుకరణ చిహ్నాల (" ") తో తప్పక ఉటంకించాలి. ఈ ఉటంకింపుల ప్రక్కనే బ్రాకెట్లో తప్పకుండా వాటికి తగిన సూచికలను సంక్షిప్తాక్షరాలలో పొందుపరచాలి. (ఉదా. ఆం.మ. భార. ఆది, ఆశ్వా. 5ప. 235) పేర్కొన్న ప్రతి పద్యం, కవిత, గేయ, వచన భాగాలను చక్కగా, పరిశోధన ధ్యేయం దృష్ట్యా విశ్లేషించాలి.
3. **ముగింపు :** పరిశోధనలో వెలువడిన ఫలితాలను విశ్లేషణాత్మకంగా 'ముగింపు' అన్న శీర్షిక క్రింద పేర్కొనాలి. కవి ఆత్మీయత, శైలి, ఆకర్షణీయాంశాలు, వెలువడిన క్రొత్త విషయాలు, రచన సామాజిక ప్రయోజనం, భాషాసాహిత్యాలకు పరిపుష్టిని చేకూర్చే కావ్య, వ్యాకరణ, అలంకారాది అంశాలు, ప్రత్యేకతలు మొదలైనవి రెండు–మూడు పేరాలుగా ముగింపులో పేర్కొనవచ్చు.
4. **ఉపయుక్త గ్రంథసూచి :** ముగింపు తరువాత ఆధారగ్రంథాలన్నింటికీ ఉపయుక్తగ్రంథసూచిని తప్పక పొందుపరచాలి. (రచయితపేరు, ఇంటిపేరు. గ్రంథం పేరు, ప్రచురణ సంవత్సరం, ప్రచురణ స్థలం, ప్రచురణసంస్థ) సంకలనగ్రంథాలకు సంపాదకుడి పేరు పేర్కొనాలి. పత్రికావ్యాసాలు, బ్లాగ్, వెబ్సైట్లకు పూర్తివివరాలు తెలపాలి. ఉదా :

1. కమలాకర శర్మ, సాగి. సంపా. **'కదంబం'** (తెలుగు సాహిత్య ప్రక్రియలు – రూపాలు). 2014. హైదరాబాద్ : మూసీ ప్రచురణలు.
2. రఘునాథ శర్మ, శలాక. '**భారత ధ్వని దర్శనము**'. 2000. అనంతపురం : ఆనందవల్లీ గ్రంథమాల.

(సూచనలు పాటించని / పరిశోధనవిలువలు లేని/ పుస్తకాలు, ఇంటర్నెట్ నుండి యధాతథంగా రాసే వ్యాసాలు తిరస్కరించబడతాయి)

తుకారాం అభంగం

చిత్తమా తతతస్థిర చిత్తమవ్వవే
చిగురించు కోరికల దాస్య మాపవే
పరమానందము పీఠమెక్కి నిలబడె
పదములతో ప్రస్తుతించ కదలవే

అదే చంద్రభాగ అదే పండరీ పురి
అదే భక్త సందోహము అదే ఆనందము
చిత్తమా నీ చచిలిపి పనులు మానవే
చిగురించు కోరికల దాస్య మానవే

జయ జయ ధ్వాన బృంద మేళాలు
ఏకతార నాదాలు ప్రభుకీర్తి గానాలు
చిత్తమా పరుగున ఆడిపాడవే
పరమాత్మ విరలు కూడా చూడవే

తుకా పలుకు సత్యము మరిగి చూడవే
హరినామ జపము మహదానందమే
చిత్తమా శ్రీధరుని చేతుబట్టవే
చిగురించు కోరికల దాస్యమాపవే

అనువాదం
డా॥ మంత్రి శ్రీనివాస్
ఫోన్ : 83283 33720

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 9 హైదరాబాద్ జూలై : 2025

విపత్తు కాలాలు – తెలుగు సాహిత్యంలో ప్రతిస్పందనలు

✍ డా. నుగ్గునూతుల యాకయ్య, ఫోన్ : 891 991 3723

మనుషులు ఉనికిలోకి వచ్చినప్పటి నుంచి ప్రకృతి విపత్తులతో పాటు మానవ ప్రమేయపూర్వక విపత్తులను ఎన్నింటినో ఎదుర్కొంటున్నారు. ప్రపంచ చరిత్రలో అనేక విపత్తులు మానవ సమాజాన్ని అతలాకుతలం చేశాయి. జన జీవనాన్ని ఛిన్నాభిన్నం చేశాయి. మన దేశంలో తుఫాన్లు, వరదలు, కరువు, కొండ చరియలు విరిగిపడడం, సునామీ, భూకంపాలు,అత్యధిక ఉష్ణోగ్రతల నమోదులాంటి సహజ విపత్తులు, రసాయన, అణుధార్మికత, జీవ రసాయనాల్లాంటి మానవ కారక విపత్తులు ఎన్నో జన సమూహాలను సమాధి చేశాయి. విపత్తును ఇంగ్లీష్ లో డిజాస్టర్ (Disaster) అంటారు. ఈ పదం Disastre అనే ఫ్రెంచి పదం నుంచి వచ్చింది. ప్రజా జీవనానికి తీవ్ర ధన, ప్రాణ నష్టాన్ని కలుగజేసి, వారిని నిరాశ్రయులు చేసే ప్రకృతిపరమైన, మానవ తప్పిదాలవల్ల జరిగే ఆకస్మిక సంఘటనలే విపత్తులు.

“విపత్తు' అంటే ఏదైనా ప్రాంతంలో సహజంగా లేదా మానవ నిర్మిత కారణాలతో ప్రమాదవశాత్తూ లేదా నిర్లక్ష్యం వల్ల సంభవించే ఆపద / ప్రమాదం / ఘోరమైన ఘటన. విపత్తు మనుషులు పూర్తి స్థాయిలో అడ్డుకోలేనంత ఎక్కువ విస్తీర్ణంలో గణనీయమైన ఆస్తి, ప్రాణ నష్టం, పర్యావరణ విధ్వంసం కలిగిస్తుంది.” అని భారత ప్రభుత్వం రూపొందించిన విపత్తు నిర్వహణ చట్టం-2005 నిర్వచించింది.

నాటి ప్లేగు, తుఫాన్, కరువుల కాలం నుంచి ప్రస్తుత కరోనా కాలం వరకు దేశవ్యాప్తంగా తలెత్తిన విపత్తుల ప్రభావం తెలుగు నేలపై కూడా ఉంది. హృదయాలను కదిలించిన ఇలాంటి విపత్తులను చూసి ప్రాచీన కాలం నుంచి ఇక్కడి కవులు, రచయితలు స్పందించారు. ఇలాంటి ఘటనలపై కవిత్వం, కథలు, నవలలు రాశారు. విపత్తులు విలయ తాండవం చేస్తున్న సమయంలో అధికార యంత్రాంగం, వైద్యులు, తోటి సమాజం ఒకరినొకరు కాపాడుకునే ప్రయత్నం చేస్తే ఆ హృదయ విదారక ఘటనలకు సాహిత్యకారులు అక్షరరూపమిచ్చారు. భయాందోళనతో ఉన్న ప్రజలకు సాహిత్యం మానసిక స్థైర్యానిచ్చిచ్చారు. నినాదాలు, గేయాలు రూపంలో ప్రజలను ఐక్యం చేశారు. అనేక భయాలు, గందరగోళంలో ఉన్న ప్రజలను చైతన్యపరిచి విపత్తు నుంచి బయటపడేసే అవగాహన కలిగించారు.

విపత్తు కాలపు సాహిత్య నేపథ్యం

తుఫాన్లు, వరదలు, కరువు, అత్యధిక ఉష్ణోగ్రతల నమోదులాంటి ప్రకృతి విపత్తులు, ప్లేగు, కలరా(గత్తర), స్పానిష్ ఫ్లూ, కరోనా వైరస్

లాంటి విపత్తులు తెలుగు రాష్ట్రాలను తీవ్రంగా ప్రభావితం చేశాయి. ఆధునిక కాలంలో మనిషి మనుగడపైనే యుద్ధం ప్రకటించిన విపత్తుల్లో కరోనా వైరస్ మొదటిదీ కాదు.. చివరిదీ కాబోదు. వందేళ్లకో విపత్తు మానవ సమాజాన్ని భయపెట్టి వెళ్తోంది. వైద్య శాస్త్రానికి, మనిషి మేధస్సుకు సవాల్ విసురుతూనే ఉంది. 1918 –1920 మధ్యలో స్పానిష్‌ఫ్లూ ప్రపంచవ్యాప్తంగా రెండు కోట్లమందికి పైగా ప్రజలని హతమార్చితే.. అంతకంటే ముందే 1911లో కలరా (గత్తర), ప్లేగు మహమ్మారి హైదరాబాద్ నగర ప్రజలను వణికించింది. స్పానిష్ ఫ్లూతో తెలుగు రాష్ట్రాల్లో 1919లో ఫ్లూతో కొన్ని వేలమంది మంచం పట్టారు. వ్యాధులు సోకినప్పుడల్లా ప్రభుత్వం అప్పటి వైద్య విధానంతో వైద్యం చేసి వందల మంది ప్రాణాలను కాపాడింది. ఆ రోజుల్లో తాగునీరు కోసం హైదరాబాద్ నగర ప్రజలంతా చేదబావుల మీదే ఆధారపడాల్సి వచ్చేది. దీంతో కలరా, ప్లేగులాంటి అంటువ్యాధులు సులువుగా ఒకరి నుంచి మరొకరికి సులువుగా ప్రబలేవని ‘రయ్యత్' పత్రిక నిర్వాహకుడు మందుమల నరసింహారావు రచనల ద్వారా తెలుస్తోంది. తెన్నేటి హేమలత రాసిన రక్తపంకం నవలలో హైదరాబాద్ లో కలరా వ్యాపించటం గురించిన ప్రస్తావన ఉంది. నేడు కరోనాతో చనిపోయినవారి మృతదేహాలను సొంత కుటుంబ సభ్యులే చూసేందుకు భయపడినట్లే.. 1911 –13 వరకు ప్లేగుతో చనిపోయిన వ్యక్తి శవాన్ని తాకేందుకు అప్పట్లో జనం భయపడ్డారు. అలాంటి పరిస్థితుల్లో నాటి దళిత నేత భాగ్యరెడ్డి వర్మ ‘స్వస్తి దళ్' పేరుతో యువకులను పోగు చేసి, అనాథ శవాలకు దహన సంస్కారాలు నిర్వహించారు. అలాగే తొలి తెలుగు కథా రచయిత్రి బండారు అచ్చమాంబ ప్లేగు వ్యాధి గ్రస్తులకు సేవలందించారు. సాటి మనిషికి సాయం చేయడమే మనిషితత్వం అని విశ్వసించిన అచ్చమాంబ ప్లేగుతో 30 ఏళ్ల వయస్సులోనే కన్ను మూశారు. ఇలాంటి మానవతామూర్తులు కరోనా, లాక్ డౌన్ కాలంలోనూ అనేక మంది మనకు కనిపిస్తారు.

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 9 8 హైదరాబాద్ జులై : 2025

తెలుగు సాహిత్యంలో ప్రకృతి విపత్తుల ప్రస్తావన

తెలుగు సాహిత్యంలోనూ విపత్తుల గురించిన ప్రస్తావన ఉంది. ప్రాచీన సాహిత్యాన్ని పరిశీలిస్తే.. బమ్మెర పోతన రాసిన ఆంధ్ర మహాభాగవతంలో ఉరుములు, మెరుపులతో ఇంద్రుడు కురిపించిన జడివాన నుంచి గోవులను, గోపాలకులను రక్షించేందుకు శ్రీకృష్ణుడు గోవర్ధనగిరిని ఎత్తిన ఘట్టం తెలుగు సాహిత్యంలో మొదటి విపత్తు వర్ణనగా చెప్పవచ్చు. మహాకవి ధూర్జటి రాసిన 'శ్రీకాళహస్తి మాహాత్మ్యం' లోని 'నత్కీరుడి కథ'లో ధాత కరువు అనే క్షామం ప్రస్తావన ఉంది. వర్షాలు లేక, తిండిలేక ఒక గ్రామంలోని ప్రజలంతా వలస పోతుంటే, స్థానిక శివాలయ పూజారి కూడా దేవుడికి నమస్కరించి **'స్వామీ! నీ సంగతి నువ్వు చూసుకో. కరువు తీరాక మళ్లీ వచ్చి నీ సేవ చేసుకుంటాను'** అంటాడు. దీంతో ప్రత్యక్షమైన శివుడికి, పూజారికి, రాజాస్థానంలోని పండితుడు నత్కీరుడికి మధ్య జరిగిన సంభాషణే ఈ కథ. ప్రాచీన సాహిత్యంలో ఇలాంటి గాథలు అనేకం ఉన్నాయి.

కోస్తాంధ్ర ప్రాంతంలో తుఫాన్లు, రాయలసీమ ప్రాంతంలో కరువులాంటి ప్రకృతి విపత్తులు ప్రజా జీవనాన్ని అనేకసార్లు ఛిన్నాభిన్నం చేశాయి. 1977 నవంబర్ 19న దివిసీమలో పోటెత్తిన ఉప్పెన నుంచి 2014లో విశాఖపట్నాన్ని అతలాకుతలం చేసిన హుదూద్ వరకు తుఫాన్లు ధన, ప్రాణ నష్టాన్ని మిగిల్చాయి. దివిసీమ ఉప్పెన వందలాది మందిని బలిగొంది. తుఫాన్ ధాటికి కోట్లాది రూపాయల ఆస్తి సముద్రంలో కరిగిపోయింది. ఈ విపత్తు దేశమంతా స్పందించింది. ఉమ్మడి ఏపీలోని ప్రజలంతా బాధితులకు బాసటగా నిలిచారు. ఇదంతా ప్రముఖ కవి నగ్నముని 'కొయ్యగుర్రం'లాంటి కావ్యం రాయడానికి కవితా వస్తువైంది.

"మనిషి ఊపిరి కొయ్యడానికి కత్తే కానక్కర్లేదు..
జీవితాల్ని చెరచడానికి
మరుక్షణం మృతకళేబరం చెయ్యడానికి
తుపాకులూ యుద్ధాలే రానక్కర్లేదు
నూరేళ్ల నవ్వుతూ తుళ్లుతూ వేయిరేకలతో
వెలుగులు వెదజల్లుతూ పుష్పించవలసిన బతుకుల్ని
భగ్గున మండించెయ్యడానికి పెట్రోలే అక్కర్లేదు
ఉప్పు నీళ్లు చాలు
దాహం తీర్చి ప్రాణం నిలబెట్టవలసిన నీరే
గొంతు పిసగ్గలదు." అని నగ్నముని సముద్రపు ఉప్పెన తీవ్రతను చెప్పుకొచ్చారు.

తెలుగు కథలు, కవితల్లో కరువు ప్రస్తావన..

ప్రజలను ఆకలిబాధకు గురి చేసిన కరువు కూడా తెలుగు సాహిత్యంలో కథా వస్తువైంది. ముఖ్యంగా రాయలసీమ రచయితల కథలకు కరువు, రైతు జీవిత విషాదం వస్తువైనట్లు మరేదీ కాలేదు. కొలకలూరి ఇనాక్ రాసిన విముక్తి , దొంగ, కొలిమి వంటి కథల్లో ఆ జాడలు కనిపిస్తాయి. రైతు ఆత్మహత్యలు పెరిగిన తొంబయ్యవ దశకపు ఆర్థిక సంక్షోభ పరిణామాలను విముక్తి కథలో చెప్పగా, ఆకలికి అలమటించిన రైతు దొంగగా మారడం 'దొంగ' కథలో ఉంది. వ్యవసాయ రంగ సంక్షోభం రైతుకు, అతని మీద ఆధారపడిన కమ్మరి మొదలైన వృత్తి పనివాళ్లకు మధ్య సంబంధాల్లో తీసుకొచ్చిన వైరుధ్యాలను, వాటిని అధిగమించిన తీరు కొలిమి కథలో చూపాయి.

రాయలసీమలో పుట్టి, పెరిగిన కేతు విశ్వనాథరెడ్డి కూడా ఆ ప్రాంత సామాజిక, కుటుంబ, ఆర్థిక, రైతు, రాజకీయ పరిస్థితులను కథా వస్తువుగా తీసుకొని రచనలు చేశారు. 'గడ్డి' అనే కథ రాయలసీమలో రైతులు కరువుతో ఇబ్బందులు పడడం, గ్రామాల్లోని ప్రజలను రాజకీయ నాయకులు జలగల్లాగా పట్టిపీడిస్తున్న విధానం ప్రధానంగా కనిపిస్తుంది.

రాయలసీమలో 1951–53 మధ్య భయంకరమైన మరొక కరువు సంభవించింది. ఇది 1944 కరువు కంటే చాలా దారుణమైనది. ప్రతి రోజు 2.04 లక్షల మంది 448 గంజి కేంద్రాల్లో గంజి తాగి తమ ప్రాణాలను నిలుపుకున్నారు. **'వినిపింతునింక రాయలసీమ కన్నీటి పాట.. కోటి గొంతుల కిన్నెర మీటుకొనుచు, కోటి గుండెల కంజెరి కొట్టుకొనుచు'** అంటూ విద్వాన్ విశ్వం గానం చేసిన 'పెన్నేటి పాట' రాయలసీమ కరువు నేపథ్యంగా(1954లో) వచ్చిన తొలి కావ్యం. అలాగే ఈ కరువు గురించి అనంతపురం జిల్లా పద్యకవి బెళ్లూరి శ్రీనివాసమూర్తి 1954లో ప్రచురించిన 'తపోవనము' అనే పద్యకవితా సంకలనంలో 'గంజి కేంద్రం' ఖండికతో ఐదు పద్యాలు రాశారు.

పుట్టపర్తి నారాయణాచార్యులు రాసిన 'మేఘదూతం'లో కరువు ప్రస్తావన కలిగిన కొన్ని వాక్యాలున్నాయి. **'క్షామపీడిత గ్రామములు వణకాద/ నీ మొగము వీక్షింతుర నీరందక తెలుగుప్రజ...'** అని వర్షం కోసం ఆకాశం వైపు ఆశగా చూసే రాయలసీమ జీవన చిత్రం కనిపిస్తుంది. భైరపురెడ్డి నారాయణరెడ్డి అనే రైతు 1950

'రాయలసీమ రైతు' అనే ఒక పద్యకావ్యాన్ని రాశారు. నండూరి రామకృష్ణమాచార్యులు పద్య కవిత్వం, ఏఎన్‌నాగేశ్వర్‌రావు వచన కవిత్వం రాశారు. 1941–44 మధ్య వచ్చిన బెంగాల్‌కరువు కరాళ నృత్యాన్ని కవి బాలగంగాధర తిలక్‌పత్రికల్లో చదివి 'అమృతం కురిసిన రాత్రి'లో 'భూలోకం' పేరుతో ఒక కవిత రాశారు.

రాయలసీమ నుంచి కరువుపై స్త్రీలు కూడా ఎన్నదగిన సంఖ్యలో కథలు రాశారు. స్త్రీలు, పిల్లలపైన ముఖ్యంగా ఆడపిల్లలపైన కరువు చూపుతున్న ప్రభావాలను విశ్లేషిస్తూ ఆర్.శశికళ 'డ్రాపవుట్' అనే కథ రాశారు. మహిళపై కరువు ప్రభావం, దాని వలన ఎలాంటి కొత్త సమస్యలను రాయలసీమ స్త్రీలు ఎదుర్కోవాల్సి వచ్చిందో సమగ్రంగా చిత్రించిన కథ ఇది. కరువు కాలంలో మంచి భోజనం కోసం తాపత్రయపడే వృద్ధురాలి ఆవేదనను బండి నారాయణ స్వామి 'సావు కూడు' కథలో వ్యక్తీకరించారు. ఆయనతోపాటు సింగమనేని నారాయణ, శాంతి నారాయణ , దేవపుత్ర, జి.ఆర్.మహర్షి, సడ్లపల్లి చిదంబర రెడ్డి, ఎస్.వి.ప్రసాద్, దీవెన కూడా రాయలసీమ కరువుపై కథలు రాశారు.

పాలమూరు కరువును మడుమనుకల నారాయణ తన కథల్లో ఆవిష్కరించారు. బాల్యం నుంచి తనతోపాటు పెరిగి, ఆటపాటల్లో భాగమైన ఎద్దును కరువు బాధలతో అమ్ముకొన్న పాలమూరు రైతు గాధే 'బొల్లెద్దు' కథ. కరువు కాటకాల్లో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రథమ పురుషలో చిత్రించారు రచయిత.

సమాజం వెలివేసిన మాలమాదిగల ఇండ్లకు మరింత దూరంగా బుడగ జంగాల కులానికి చెందిన యక్షగాన కళాకారుడి మీద రాజద్రోహం ముద్రపడిన బర్లుకాసే 'సోమయ్య' గాథ. గ్రామంలో ఓ షావుకారి దుకాణం మీద కరువుదాడిలో జనం తిండిగింజలు, సరుకులు పంచితే తెచ్చుకున్నందుకు సోమయ్య మీద పోలీసులు దేశద్రోహం కేసు నమోదు చేస్తారు. జైలు జీవితం సోమయ్యను మరింత ప్రజలకు చేరువగా చేస్తుంది. నల్లమల పరిసర గ్రామీణుల నిత్య నిర్బంధ జీవితాలను చిత్రించిన కథ ఇది.

కరోనా కాలపు సాహిత్యం

కరోనా వైరస్ మిగిల్చిన విషాదం, లాక్ డౌన్ సృష్టించిన సంక్షోభం నుంచి ప్రపంచం ఇంకా పూర్తిగా తేరుకోలేదు. కరోనా మొదటి, రెండో వేవ్ లో లక్షలాది మంది ఆత్మీయుల కడసారి చూపుకు కూడా నోచుకోకుండా కాటికి చేరారు. వీళ్లలో చాలామంది కరోనా సోకిందనే భయంతోనే మానసిక ఆందోళనకు గురై హఠాన్మరణం చెందారు. కరోనా మరణాలు, హాస్పిటల్ ట్రీట్మెంట్ కోసం అప్పులు, లాక్ డౌన్‌తో వలసకూలీలు, నిరుపేదలు, చిరువ్యాపారులు పడిన కష్టాలు, మహిళలపై పెరిగిన వేధింపులపై కవులు, రచయితలు స్పందించారు. కవిత్వం, కథలు, నవలలు, పాటలు రాశారు.

కరోనా కవిత్వం

తెలంగాణ రాష్ట్రంలోని కరీంనగర్ జిల్లా జమ్మికుంటకు చెందిన ఆదేశ్ రవి **'పూట పూట జేసుకుని బతికేటోళ్లం.. పూట గడవా ఇంతదూరం వచ్చినోళ్లం.. ఇంటికాడ పిల్లజెల్ల ఎట్ల ఉన్రో.. నా ముసలి తల్లి ఏమి బెట్టి సాదుతుందో.. బస్సులొద్దు, బండ్లువొద్దు అయ్య సారూ.. ఇడిసిపెడితే నడిసి నేను బోత సారూ'** అని పాడిన పాట వలస జీవులను వెతలను, లాక్ డౌన్ కష్టాలను కళ్లకు కట్టింది. హైదరాబాద్ ఆకాశవాణి ఉద్యోగి అయినంపూడి శ్రీలక్ష్మి 'రిటన్‌గిఫ్ట్‌టు కరోనా' పేరుతో రాసిన కవిత సీఎం కేసీఆర్ దృష్టిని ఆకర్షించింది. కవిత్వ ప్రక్రియలైన వచన కవిత, గేయం, పద్యం వంటి అన్ని ప్రక్రియల్లోనూ రచనలు తామరతంపరగా వెలువడ్డాయి. సినిమా సెలబ్రిటీలు పాటల రూపంలో సందేశాలిచ్చారు. ఖమ్మం నుంచి తోట సుభాషిణి సంపాదకత్వంలో 'క్రిమి సంహారం', బిల్ల మహేందర్ సంపాదకత్వంలో 'వలస దుఃఖం' కరోనా కవితా సంకలనాలు వెలువడ్డాయి.

కరోనా కథలు, నవలలు..

కరోనా, లాక్ డౌన్, వలస కార్మికులు, ఇంటి పనివాళ్లు, మహిళలపై గృహహింసను వస్తువుగా చేసుకుని సుమారు 100కు పైగా కథలు వెలువడ్డాయి. ఇందులో ప్రధానంగా చెప్పుకోదగినది 'కరోనా కాలం కథలు' కథా సంపుటి. అనిశెట్టి రజిత, కొమర్రాజు రామలక్ష్మి, బండారి సుజాత సంపాదకత్వంలో తిరునగరి దేవకీదేవి గౌరవ సంపాదకులుగా, డాక్టర్ మురాడి శ్యామల, తమ్మెర రాధిక సహ సంపాదకులుగా ఈ సంపుటి వెలువడింది. ఇందులో 86 కథలు, 24 కథనాలు ఉన్నాయి. మెజార్టీ కథల్లో వలస కార్మికులు, పని మనుషుల ఇబ్బందులే కథా వస్తువుగా ఉన్నాయి. పాలకుల అనాలోచిత నిర్ణయాలు, విధానాల్లో లోపాల వల్ల లక్షలాది మంది వలస కార్మికుల బతుకులు ఏ విధంగా రోడ్డున పడ్డాయో ఈ కథల్లో ఆవిష్కరించారు. అలాగే వివిధ సంస్థలు, వ్యక్తులు వలసకార్మికులకు అన్నం పెట్టి, గమ్యస్థానాలకు చేర్చిన తీరును కథల్లో వ్యక్తీకరించారు.

ఫ్రంట్‌లైన్‌వారియర్స్‌గా తమ జీవితాలను పణంగా పెట్టి సేవలందించిన వారి గురించి కొన్ని కథలు స్పృశించాయి.

అఫ్సర్ రాసిన చూపుడు వేలు; స్కైబాబా – ఐసోలేషన్; డాక్టర్ శాంతి నారాయణ – అసలు స్వరూపాలు; డాక్టర్ కోటకొండ మనోహర్ – అద్వైతం; ఎంవీ రామిరెడ్డి – అభావం; డాక్టర్ అప్పిరెడ్డి హరినాథరెడ్డి – రాలిన గెలలు, అందనంత దూరం; సుంకోజు దేవేంద్రాచారి – క్షమించండి; వెల్దండి శ్రీధర్ – కాసెపుల్ల; కథలు కూడా కరోనా నేపథ్యంలో వచ్చినవే. కరోనా, లాక్ డౌన్, వలస కార్మికులు వస్తువుగా 'వలస' శీర్షికతో ప్రొఫెసర్ కొలకలూరి ఇనాక్, 'కరోనా శాపమా– వరమా' అనే శీర్షికతో ముప్పాల సూర్య కుమారి నవలలు కూడా రాశారు.

వేల ఏళ్ల మానవ చరిత్ర పరిణామ క్రమంలో ఇలా సమాజం అనేక విపత్తులను అధిగమించి ముందుకు సాగుతోంది. విపత్తులు మనిషి దైనందిన జీవితం, పని విధానం, ఆహారపు అలవాట్లు, సంస్కృతి, సంప్రదాయాలతోపాటు తెలుగు కవులు, రచయితలను కూడా తీవ్రంగా ప్రభావితం చేశాయి. ఆ ప్రభావం వారి రచనల్లో కనిపించింది. విపత్తు కాలాల్లోని విజయగాథలు ప్రజలకు ఎప్పుడూ స్ఫూర్తిని, ధైర్యాన్ని కలిగిస్తూనే ఉంటాయి.అలాగే నాటి చేదు ఘటనలు, మానవ వైఫల్యాలు... భవిష్యత్ లో ఎలా వ్యవహరించ కూడదనే సోయినిస్తాయి.

ఉపయుక్త గ్రంథ సూచిక

అనిశెట్టి రజిత, కొమర్రాజు రామలక్ష్మి కరోనా కాలం కథలు, 2021

బండారి సుజాత (సంపాదకులు)

తిరునగరి దేవకీదేవి (గౌరవ సంపాదలు)

ధూర్జటి శ్రీకాళహస్తీశ్వర మహత్యం (పరిష్కర్త: బులుసు వెంకటరమణయ్య) వావిళ్ల రామస్వామి శాస్త్రులు అండ్ సన్స్, చెన్నపురి, 1966

బండి నారాయణ స్వామి రాయలసీమ సమాజం – సాహిత్యం, పర్ స్పెక్టివ్స్ ప్రచురణలు, 2019

డాక్టర్ బీఆర్ రాసాని, కరోనా నేపథ్యం – కథలు, సంచిక (తెలుగు సాహిత్య వేదిక), ఆన్ లైన్ మ్యాగజైన్, 2020

బిల్లా మహేందర్ (సంపాదకుడు) వలస దుఃఖం, అఆ ప్రచురణలు, 2020

డాక్టర్ ఎం.హరికిషన్ (సంపాదకుడు) రాయలసీమ కరువు కథలు, దీప్తి పబ్లికేషన్స్,

నగ్నముని కొయ్యగుర్రం, ప్రజాస్వామ్య ప్రచురణలు, 2008

ఎస్.ఆర్. పృథ్వీ, కరోనా (దీర్ఘ కవిత), 2020

వారాహి నవరాత్రులు - పంచ చామర మాలిక

వరాహ దంష్ట్ర వక్త్ర రూప బద్ధ శత్రు నాశనీ
కరాళ దుష్ట రాక్షసాంతకాంత ఘోర రూపిణీ
విరాజమాన దివ్యరూప విశ్వశాంతి కారిణీ
వరాలికాసురేశ్వరీ శివార్ధదేహ ధారిణీ
సురార్చితాంఘ్రి యుగ్మ పుణ్య సూక్ష్మ దివ్య రూపిణీ
వరప్రదాయినీ భవాని వాంఛితార్థదాయినీ
వరాంబికే వరాత్మికే భవాని భక్త పోషిణీ
చరాచరా జగత్తుకంత సర్వశక్తి మాతృకా

– జి. లింగేశ్వర శర్మ

నల్గొండ జిల్లా దళిత నాటకం – దళితుల సమస్య చిత్రణ

గరిగంటి కృపాకర్, పరిశోధక విద్యార్థి, ఉస్మానియా విశ్వవిద్యాలయం. ఫోన్ : 6301597912

దళిత నాటకం– నేపథ్యం :

1930 ప్రాంతం నుండి దళితులను ప్రస్తావిస్తూ కొన్ని నాటికలు, నాటకాలు వచ్చాయి. వాటిని దళితులపై సానుభూతి చూపుతూ వచ్చిన నాటకాలుగానే చెప్పవచ్చు. **ధర్మవరం గోపాలచార్యుల 'అస్పృశ్య విజయం', మునిమాణిక్యం నరసింహారావు 'తిరుగుబాటు', దర్భ భాస్కరమ్మ 'దేవాలయాల ప్రవేశం', ఓరుగంటి కృష్ణ కౌండిన్య 'కృష్ణ చరితం', బందారు మృత్యుంజయ 'సమాజం మారాలి', ఆచార్య ఎన్.జి రంగా 'హరిజన నాయకుడు', ఉన్నవ లక్ష్మీనారాయణ 'హరిజన నాటకం'** వంటి నాటకాలలో ఆయా రచయితలకు దళితుల పట్ల ఉన్న సానుభూతి కనిపిస్తుంది. దళిత జీవితాన్ని పౌరాణిక, చారిత్రక, సాంఘిక ఇతివృత్తాలతో రాసిన నాటకాలు కూడా కొన్ని కనిపిస్తున్నాయి. దళితులపై సానుభూతి చూపిస్తూనే వారి ప్రతిభను వివరించే ప్రయత్నం చేసిన నాటకాలు ఉన్నాయి. పుట్టుక, కలిసిమెలిసి తిరగటం, ప్రేమవివాహాలు, దేవాలయాల ప్రవేశం తిరుగుబాటు భావాలతో కొన్ని నాటకాలు వచ్చాయి.

1959లో బోయ భీమన్న రాసిన **'రాగవాశిష్టం'** నాటకాన్ని తొలి దళిత నాటకంగా భావిస్తున్నారు. దళితుల పుట్టుక కూడా ఉన్నతమైందేనని, దళితులు హిందువులలో భాగమని వాదించే నాటకం రాగవాశిష్టం. ఈ రచయిత రాసిన **'ఆదికవి వాల్మీకి', 'పాలేరు'** నాటకం దళితులను ఆలోచింపజేసినవి. కొలకలూరి ఇనాక్ రాసిన **'మునివాహనుడు'** నాటకం దళితులు దేవాలయాల ప్రవేశాన్ని, వారి భక్తిని శక్తివంతంగా వర్ణించిన నాటకం.

నల్గొండ జిల్లా దళిత నాటకం– దళితుల సమస్యల చిత్రణ :

వేముల ఎల్లయ్య రాసిన **"బహువిధ"** నాటకం వస్తువు కుల వివక్షత. సమాజంలో దళితులు నిమ్నస్థాయిలో జీవిస్తూ సమాజానికి దూరంగా వెలివేయబడుతూ అంటరానితనానికి గురవుతూ వుంటారు. ఈ నాటకంలో రచయిత దళితుల శ్రమను సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా దోచుకుంటున్న ఆధిపత్య వర్గ విధానాన్ని వివరించారు. అలాగే కులం వ్యవస్థ కింద దళితులను బానిసలుగా చేస్తున్నటువంటి వైన్యాన్ని నిరూపించారు. ఈ నాటకాన్ని పరిశీలిస్తే దళితుల జీవనానికి ప్రతీకగా నిలుస్తుంది.

సామాజిక అంశాలు :

'బహువిధ' నాటకంలో ప్రధాన పాత్ర లందయ్య. ఇతని భార్య పేరు పాపమ్మ. వీరిద్దరి సంతానం జంబయ్య. లందయ్య కుసుమారెడ్డి దగ్గర జీతం ఉంటాడు. లందయ్య వ్యవసాయపు పనులు అలాగే ఇంటి పనులు కూడా చేస్తాడు. పాపమ్మ కూడా కుసుమారెడ్డి పొలంలో పనిచేస్తుంటుంది. భార్యాభర్తలు అన్యోన్యంగా ఉంటారు.

జంబయ్యను చదివించాలని ఎంతో శ్రమపడుతూ ఉంటారు. దళితులు వాడలకే పరిమితం కాకుండా అక్షర జ్ఞానం కలగాలని లందయ్య ఎంతో ప్రయత్నం చేస్తాడు. తాను పనిచేసే కుసుమారెడ్డి బిడ్డకు ఇంట్లోనే బడిపంతులు చదువు చెబుతాడు. దానిని గ్రహించిన లందయ్య తన కుమారుడు జంబయ్య కూడా చదువు నేర్పిస్తే ప్రయోజకుడు అవుతాడని ఆశిస్తాడు. జయశీలుడు అనే పంతులు జంబయ్యను దగ్గరకు చేర్చి చదువుతో పాటు కుస్తీ పోటీలు కూడా నేర్పిస్తాడు. కుస్తీ పోటీల్లో జంబయ్య తన ప్రతిభను కనబరుస్తాడు. జిల్లాస్థాయి పోటీలలో మొదటి బహుమతి పొందుతాడు. కొడుకు కృషిని చూసి లందయ్య దంపతులు ఆనందిస్తారు. కొడుకుని ఉన్నతంగా చదివించాలని పట్నం తీసుకెళ్లాలని ప్రయత్నం చేస్తారు. లందయ్య జీతం ఉంటున్న కుసుమారెడ్డి దగ్గర తన బాకీ చెల్లించాలని అని అన్నప్పుడు లందయ్య చెయ్యిని అప్పులకు భారం వేస్తారు. తను చేసే కౌలు భూమి మీద అక్రమంగా వసూలు చేయడానికి సిద్ధపడతారు. లందయ్య దంపతులకు ఏమి చేయాలో తోచదు.

జంబయ్యను ఉన్నతంగా చదివించాలని ఎంతో తపన పడుతున్న తల్లిదండ్రులు దిక్కుతోచని పరిస్థితుల్లో జంగయ్యని చదువు మాన్పించాలని అనుకుంటారు. కానీ పంతులు జయశీలుడు సహకారంతో జంబయ్య సమయస్ఫూర్తితో శ్రద్ధగా చదువుకుంటాడు. చదువులోనూ ఆటల్లోనూ మెరుగ్గా ఉండేవాడు. జంబయ్యను చూసి ఉన్నత వర్గం వాళ్లు సహించేవాళ్లు కాదు. దళితులు పై స్థాయికి ఎదగడానికి వాళ్లకి ఇష్టం ఉండేది కాదు. అంటరానివారిగా చిత్రించి వివక్షతకు గురి చేస్తుంటారు. జంబయ్య కుస్తీ పోటీలలో బహుమతి పొందిన తర్వాత జయశీలుడు పంతులు జంబయ్య ప్రతిభకు సన్మానం జరగాలని

పాఠశాలలో అన్నప్పుడు, ఆధిపత్య వర్గం టీచర్లు దానికి నిరాకరిస్తారు. ఒక దళితుడిని సన్మానం చేస్తే ఆ ఊరిలో సమస్యలు తలెత్తుతాయని హెచ్చరిస్తారు.

ఈ నాటకంలో జంబయ్య పాత్ర చాలా విశిష్టమైనది. అంటరాని కులానికి చెందిన జంబయ్య చదువు మీద ఆసక్తితో చదువులోనూ, ఆటల్లోనూ తన ప్రతిభను కనబరుస్తూ ఉంటాడు. దానిని గుర్తించిన జయశీలుడు పంతులు జంబయ్యను ఉన్నతంగా తీర్చిదిద్దాలని ఊరిలో విద్యార్థుల మీద ఆసక్తిని పెంచుకొని మంచిగా బోధించేవాడు. ఊరిలో పిల్లల కంటే జంబయ్య మెరుగ్గా తన ప్రతిభను కనబరిచి బహుమతి పొందినప్పుడు ఆధిపత్య వర్గం సన్మానానికి దానికి నిరాకరిస్తారు. దళిత కుటుంబంలో పుట్టిన జంబయ్య సన్మానం చేస్తే ఆధిపత్య వర్గం పాఠశాలకు వారి పిల్లల్ని పంపించలేరని అలాగే ఉపాధ్యాయులకు జీతాలు ఉండవని తోటి అధ్యాపకులు హెచ్చరిస్తారు. ఈ సన్నివేశాన్ని పరిశీలిస్తే జంగయ్య కేవలం దళిత కుటుంబానికి చెందిన వ్యక్తి కాబట్టి కులవివక్షతో అతని సన్మానాన్ని నిరాకరిస్తారు. కులం అనే భావన వారిలో అంటుకుపోవడం వల్ల దళితులను సమాజం నుంచి వెలివేయడం జరిగింది. దాని ద్వారా తరతరాలుగా దళితుల అస్తిత్వం లేకుండా పోయిందని చెప్పవచ్చు. సామాజికంగా దళితుల జీవనం అస్తవ్యస్తంగా ఉండడానికి కారణం అధిపత్య వర్గమేనని చెప్పవచ్చు.

అలాగే భూతం ముత్యాలు రాసిన నాటకం **'కులాట్కం'.** ఈ నాటకంలో వస్తువు కుల వివక్షత. మనిషి పుట్టుక నుంచి మరణం వరకు సమాజంలో కుల వ్యవస్థ ఊబిలో పడి ఉన్నాడు అనడంలో సందేహం లేదు. ఈరోజు మనిషి తిండి లేకుండా ఉంటాడేమో గాని కులం అనే భావన లేకుండా ఉండలేకపోతున్నాడు. దానికి కారణం సమాజంలో పెరిగిపోతున్న కుల వివక్షత. ఉన్నత వర్గం కిందివర్గాలను అంటరానితనంతో సమాజానికి దూరంగా వెలివేస్తున్న పరిస్థితి కనిపిస్తుంది. ఒక మనిషిని ఇంకో మనిషిగా చూడని సమాజంలో మనిషి అహంతో కులమనే రంగుని పూసుకొని మనిషిని అంటరానివాన్నిగా చేస్తున్న పరిస్థితి కనిపిస్తుంది.

సమాజంలో ఎవరి కులానికి వారు బలోపేతం చేసుకున్నటు వంటి పరిస్థితి కనిపిస్తుంది. ఆధిపత్య కులాల వారు ఆచారాలు, కులగోత్రాలు పాటించడం, కులం వెనక ముందు తోకలు తగిలించుకుని చలామణి అవడం వల్ల ఈ సమాజంలో కుల నిర్మూలన ఎట్లా జరుగుతుంది? కులం ఎట్లా నశిస్తుంది? నాటకంలో కవిగారి పాత్ర ద్వారా చెప్పడం జరిగింది. కవిగారి మాటలకు చెన్నయ్య కూడా కొంత ఆలోచించి సమాజంలో కులం లేకుండానే ఉండాలి అప్పుడే అందరూ సమానత్వంతో ఉంటారని అంటాడు. కులనిర్మూలన అనేది **"నీతోనాతో అయ్యే పని కాదు అంబేద్కర్ అన్నట్టు రాజ్యాధికారం దళితుల చేతిలోకి రావాలి? కులాంతర వివాహాలు జరగాలి? దళితుల సామాజిక స్థితి మారాలి? దళితులు ఇంటికి ఒక ఉద్యోగం పొందాలి? దళిత కుటుంబాలలో ఆడ, మగ తేడా లేకుండా అందరూ చదువుకుంటూ సమానత్వం ఉండాలి అప్పుడే కుల నిర్మూలన చేయవచ్చుని?"** కవి గారు అంటారు. ఆధిపత్య వర్గం దళిత కులాల మధ్య చిచ్చుబెట్టి కుల విభజన చేస్తారు. మళ్లీ దళితులకు ఐక్యత లేదని రాజ్యాధికారాన్ని వాళ్ళు పొందుతారు. దళితులు ఐక్యత లేకుండా చేసి వారు సమాజంలో పెద్దమనుషుల లాగా చలామణి అవుతున్నారని చెప్పడంలో ఎటువంటి సందేహం లేదు చెప్పవచ్చు.

సమాజంలో నిత్యం దళితుల మీద జరుగుతున్న దాడులు, వివక్షత, అంటరానితనం దళితులను సమాజంలో తమ అస్తిత్వం లేకుండా చేస్తున్నాయి. ఊరికి దూరంగా వెలివేయడం, అంటరానివారిగా చూడడం నేటికీ దళితులు అక్కడక్కడ కనిపిస్తూనే ఉంటారు. ఆధిపత్య వర్గం కింద దళితులు బానిస బతుకులు బతుకుతున్నారు. విద్యా, ఉద్యోగ, రాజకీయ అనేక అంశాలలో సామాజికంగా వెనుకబడి ఉన్నారని చెప్పడంలో ఎటువంటి సందేహం లేదు.

రాజకీయ అంశాలు :

ఆధిపత్య వర్గం దళిత స్త్రీల మీద చేసినటువంటి దాష్టీకాన్ని ఈ నాటకంలో వివరించారు. ఆధిపత్య వర్గంలో కొందరు దళిత స్త్రీల మీద చేసిన అన్యాయాలను పరిశీలిస్తే ఈ నాటకంలో లందయ్య పెద్దమ్మ కథ దర్శనమిస్తుంది. లందయ్య పెద్దమ్మకి ఆర్థిక భారం కావడంతో వయసు వచ్చినప్పటికీ పెళ్లి చేయకుండా ఉండడం, అంతలోనే లందయ్య తాత చనిపోవడం, ఇంట్లో ముగ్గురు ఆడవాళ్లు ఉండడం, లందయ్య అమ్మమ్మ కూలీనాలి చేయడం, మిగిలిన ఇద్దరు ఆడవాళ్లు గొల్లల బర్లకాడ జీతం ఉండడం, లందయ్య పెద్దమ్మ దొరల ఇంట్లో పనిచేస్తూ ఉండేది. లందయ్య పెద్దమ్మకు మానసికంగా ఆరోగ్యం బాగుండేది కాదు. దానితో దొర ఇంటి దగ్గరే పని చేస్తూ అక్కడే చెట్టు కింద పడుకునేది.

ఆ దొర ఇంట్లో పెళ్లి కానీ ఒక అతను కామంతో రగిలిపోయే వాడు. అతని ప్రవర్తనను చూసి ఎవరు పిల్లని ఇచ్చే వాళ్ళు కాదు. అతను ఊరికి ఆ భూస్వామిగా ఉండేవాడు. ఆ దొర లందయ్య పెద్దమ్మను మానభంగం చేస్తాడు. ఆమెకు తెలియకుండానే గర్భవతి అవుతుంది. లందయ్య పెద్దమ్మ మాదిగ కులానికి చెందింది కాబట్టి దొరకు ఊరి ప్రజలు కూడా ఎవరు వ్యతిరేకంగా ప్రశ్నించరు. పెద్దమ్మకు తొమ్మిది నెలలు తర్వాత ఆ చెట్టు కిందనే మంగలి నీలమ్మ కాన్పు చేస్తుంది. ఆమెను చూడడానికి ఎవరు వచ్చేవాళ్ళు కాదు. మరుసటి రోజు మంగలి నీలమ్మ మరణిస్తుంది. బాలింత రోగమని ఊరంతా ప్రచారం జరుగుతుంది. పుట్టిన బిడ్డను దొరలు ఇంటికి తీసుకెళ్లారు. దొరలు చేసిన దాష్టీకానికి ఊరి ప్రజలు కూడా ప్రశ్నించరు. దొరలు అమాయకురాలైన లందయ్య పెద్దమ్మను హత్య

చేసి ఎవరికి తెలియకుండా రోగం వచ్చిందని చెప్తారు. ఆమె హత్యను రాజకీయ అధికారంతో ఆధిపత్య భావజాలాన్ని ప్రదర్శిస్తూ ఊరి ప్రజలను తమ ఆధీనంలో తీసుకుంటారు. దళిత స్త్రీ మీద జరిగిన అన్యాయాన్ని ఎవరు స్పందించరు. అమాయకురాలైన మంగలి లింగమ్మ హత్య కాలంతో పాటు అందరూ మర్చిపోతారు.

ఈ నాటకంలో మరొక విశిష్టమైన పాత్ర పట్వారి. ఇతను మాల కుటుంబానికి చెందిన వ్యక్తి. రిజర్వేషన్ల పుణ్యమంటూ పట్వారి నౌకరి వస్తుంది. అవే రిజర్వేషన్ లేకపోతే ఆధిపత్య వర్గం ఆ పదవులను వారి ఆధీనంలో ఉంచుకుంటాయి. అందుకే అంబేద్కర్ దళితుల రిజర్వేషన్ల కోసం పోరాటం చేసి సాధించిన తీరు ఈ పాత్ర ద్వారా తెలుస్తుంది. మాలగూడెంలో పట్వారి నిజాయితీగా విధులు నిర్వర్తిస్తుంటాడు. అదే గ్రామానికి చెందిన పటేల్ పెద్ద భూస్వామి. పలుకుబడి ఉన్న వ్యక్తి. ఆ గ్రామంలో ఉన్నత వర్గం అంత ఒకవైపు కింది వర్గం అంతా ఒకవైపు. పట్వారి ఉన్నత వర్గానికి సపోర్టుగా ఉండడు. వారు చెప్పినట్టుగా వినడు. దానికి కొంతమంది ఉన్నత వర్గం వారు భిక్షం, ఎంకులు లాంటివారు పటేల్ కి చాడీలు చెబుతారు. పటేలు కూడా పట్వారి మీద కోపంతో రగిలిపోతాడు. కొలువుకెక్కిన ఈ మాల ముండాకొడుకు మనకు వ్యతిరేకంగా ఉంటాడాని పటేల్ కోపంతో అంటాడు. **'వాళ్లు ఎంత పెద్ద ఉద్యోగం చేసినప్పటికీ ఆధిపత్య వర్గం కింద బానిసలే. ఉన్నత వర్గం నిమ్న కులాల వర్గం ఎప్పుడూ ఒకటి కాదు. రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్ పుణ్యమా అంటూ ఉద్యోగాలు చేస్తున్నారుగాని లేకుంటే వీళ్ళ బతుకులు వేరే రకంగా ఉండేవి. పట్వారి ఉద్యోగంలో ఉన్నాడు కాబట్టి కుర్చీకి మర్యాద ఇస్తున్నాం తప్ప ఆ మాలవాడికి కాదని'** పటేలు మాట్లాడుతాడు.

భూతం ముత్యాలు రాసిన కులాట్కం నాటకంలో దళితుల మీద ఆధిపత్య వర్గ రాజకీయకోణాన్ని పరిశీలిస్తే అధికారం, డబ్బు, కులం దళితులను సమాజంలో దూరంగా చేస్తున్న పరిస్థితి ఈ నాటకంలో కన్పిస్తుంది. పటేల్ లాంటి మనుషులు సమాజంలో పెద్ద మనుషులు లాగా చలామణి అవుతూ అధికారులను తమ ఆధీనంలో పెట్టుకొని అమాయక దళిత ప్రజల మీద పెత్తనాలు చలాయిస్తున్నటువంటి దుస్థితి భూతం ముత్యాలు రాసిన 'కులాట్కం' నాటకంలో దళితుల జీవన చిత్రణ కనిపిస్తుంది.

ఆర్థికాంశాలు :

ఈ నాటకంలో ఆర్థిక అంశాలను పరిశీలిస్తే జంబయ్య తండ్రి లందయ్య కుటుంబ జీవనం కోసం దొరల ఇంటి జీతం ఉంటాడు. శ్రమకు తగ్గ ఫలితం అందక పోయినప్పటికీ చేసిన పనిని నమ్మకంగా చేస్తాడు. అందుకే కుసుమారెడ్డి లందయ్యను వ్యవసాయపు పనుల్లో అతని మీదనే వదిలేస్తాడు. కూలీవాళ్ళందరికీ అతని చేతితోనే డబ్బులు ఇప్పిస్తాడు. తెల్లారేప్పటి నుంచి పొద్దుగూకే వరకు కష్టపడి రెడ్డికి నమ్మిన బంటుగా ఉంటాడు. లందయ్య భార్య కూడా పాపమ్మ భర్తతో పాటు తాను కూడా శ్రమిస్తుంది. కొడుకు చదువుల కోసం నిరంతరం భార్యాభర్తలు కష్టపడుతూ ఉంటారు. ఆర్థిక స్థితి మెరుగుపడితే కొడుకుని ఉన్నతంగా చదివించుకోవచ్చని వాళ్లు పోరాడుతారు.

జంబయ్య కూడా చదువు పూర్తయిన తర్వాత ఉద్యోగం కోసం అన్వేషిస్తున్నటువంటి క్రమంలో ఆర్థికంగా చాలా బాధపడుతూ ఉంటాడు. తర్వాత జంబయ్య చెప్పులు కుట్టడం చేస్తాడు. ఆర్థికసహాయం మాత్రం లక్కలు చేస్తుండేవాడు. చెప్పులు కుట్టడానికి కావలసిన సామాగ్రిని లక్కులే కొనిచ్చేవాడు. ఒకరోజు జంబయ్య భూమ్మీద పుట్టుడు సచ్చుడు తప్ప ఏం మిగిలింది మన వారసులకు కష్టాల బతుక్కి మన అందరి జీవితాలు గిట్లనే తగలబడే గని తతిమ్మ జాతులు గిట్లనే ఉన్నాయా? వాళ్లకు భూములు ఉండే బంగ్లాలు ఉండే బస్తీలు ఉండే నేను రోడ్డు మీద చెప్పులు కొట్టుకుంటున్న పరిస్థితి ఇదేనా మిగిలింది? ఎవరన్నా చూస్తే ఊర్లో తెలిస్తే పరువు ఏముంటుంది? డిగ్రీ చదివి చెప్పులు కుట్టుకునే పరిస్థితి వచ్చిందని బాధపడతాడు. కులం పరంగా వాళ్ళు వివక్షత ఎదుర్కొంటూనే ఆర్థికంగా నిరుద్యోగ సమస్య వారి స్థితిగతులకు, వారి జీవనానికి కష్టంగా మారిపోతున్న పరిస్థితి ఈ నాటకంలో దళితుల ఆర్థిక అంశాలను చెప్పడం జరిగింది.

వేముల ఎల్లయ్య రాసిన **'బహువిధ'** నాటకంలో దళితులు సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా సమాజంలో వారు ఎదుర్కొంటున్న సమస్యలు ఏ విధంగా ఉన్నాయో వాస్తవ జీవన చిత్రణ చేశారని చెప్పవచ్చు. లందయ్య లాంటి పాత్రలు నిత్యం శ్రమ జీవనానికి ప్రతీకగా నిలుస్తారు. జంబయ్య కూడా ఆదర్శమైన దళిత విద్యార్థిగా చదువు తెలివితేటలు ఉన్నప్పటికీ కూడా కులం అనే భావన సమాజంలో పేరుకుపోయి ఉండడం వల్ల నిరుద్యోగ సమస్యతో బాధపడుతూ చివరికి చెప్పులు కుట్టుకునే పరిస్థితి వస్తుంది. ఎంతోమంది విద్యార్థులు నిరుద్యోగం వల్ల వారి ఆశయాలకు దూరం అవుతున్నారని భావించవచ్చు. ఈ నాటకంలో లందయ్య, జంబయ్య పాత్ర విశిష్టమైనదిగా చెప్పవచ్చు.

'బహువిధ, కులాట్కం' అనే రెండు నాటకాలు దళితుల జీవనాన్ని వివరించబడింది. దళితులపై అధిపత్య వర్గం చేస్తున్న కుల వివక్షత, అంటరానితనం దళితులను సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా ఎదుర్కొంటున్న పరిస్థితులను చెప్పడం జరిగింది.

ఉపయుక్త గ్రంథాలు :

1. ఎల్లయ్య, వేముల. 2016. బహువిధ నాటకం. మట్టి ముద్రణలు. నల్గొండ

2. ముత్యాలు, భూతం. 2017. కులాట్కం నాటకం. గుంపు సాహితీ సంస్థ. నల్గొండ

3. నాగభూషణం, మొదలి. 2012. నాటక శిల్పం. తెలుగు విశ్వ విద్యాలయం. హైదరాబాద్

❖ ❖ ❖ ❖ ❖

ISSN 2457-0796

ఐతరేయోపనిషత్తు (ముత్యాల సరాలలో...)

జక్కని వేంకటరాజం

ప్రథమాధ్యాయం

సృష్టి కంటెను ముందు బ్రహ్మం
బొక్కడే వెలుగొందు చుండెను
ఒక్కడగు బ్రహ్మమ్ము లోకము
లన్నిటిని సృష్టింప దలచెను.

తలచినంతనె నాల్గులోకము
లొకటి అంభస్సు, మరి మరీచి
మరము నొక్కటి; దాని క్రిందుగ
జలముగల లోకమ్ము గలిగెను

మొదటిదంభోలోకముట సూ
ర్యాది జ్యోతిర్మయము లున్నవి
దాని కాశ్రయమగు ద్యులోకము
చెప్పబడెను మరీచి పదమున

అంతరిక్షంబనగ నదియే
రవి కిరణములు వ్యాప్తి జెందును;
మరము భూలోకమ్ము దానికి
క్రిందుగల దాపస్సు లోకము

లోకములు సృష్టించి పరమే
శ్వరుడు లోకము లొప్పుచుండగ
పాలకుల సృష్టించియు, జలము
నుండి పురుషుని రచన జేసెను

ఆ విరాట్పురుషుని ముఖమ్మటు
అండమును వలె పగిలి, వాగిం
ద్రియము కలుగగ నట్టి యింద్రియ
మందు కలిగెను అగ్నిదేవత

పిదప నాసిక, యందు ఘ్రాణేం
ద్రియము కలిగెను; అట్టి ఇంద్రియ
మందు కలిగెను వాయు దేవత;
నేత్రములే కలిగియు నేత్రేం -

ద్రియము నేర్పడ, సూర్యదేవత
ఉద్భవించెను; చెవులు కలిగెను
అందు శ్రోత్రేంద్రియము కలిగెను
దిక్కులన్నియు జనన మొందెను

స్పర్శకాశ్రయమైన చర్మము
దానిపై రోమములు కలిగెను
అందు ఓషధులును, వనస్పతు
లు కలిగెను, ఆ పిదప హృదయము-

హృదయమందున మనసు కలిగెను
మనసు నుండియె చంద్ర దేవత
ఉద్భవించెను; నాభి కలిగెను
అందు అపాన మేర్పడి విస -

ర్జేంద్రియమ్ములు కలుగ మరలను
అందు మృత్యువు జనన మొందెను
పిదప జననేంద్రియము, రేత
స్సందు నుండియు జలము పుట్టెను

ద్వితీయ ఖండము

ఆ విరాట్ పురుషుండు ఆకలి
దప్పికలతో గూర్చబడియెను
అగ్ని మొదలగు దేవతలు సం
సార సాగరమందు నిలిచిరి

దేవతలు ఆకొన్నవారై
దేనియందు ప్రతిష్ఠితమ్మై
మేము ఆకలి తీర్చుకొనగల
మనుచు పరమేశ్వరుని అడిగిరి

అందులకు పరమేశ్వరుండొక
గోవునే సృజియించి చూపెను
దాని యందున నిలిచి ఆకలి
తీర్చుకొమ్మని చెప్పియుండెను

దేవతుల 'మాకిదియె తగినది
కాదు' యని పలుకంగ మరలను
గుఱ్ఱమును సృష్టించి చూపెను
'అదియు తగద'ని వారు పలికిరి

పిదపనొక మానవ శరీరము
చూపగా అంగీకరించిరి
తగిన స్థానములందు జేరగ
పరమ పురుషుడు ఆజ్ఞనొసగెను

అగ్ని వాగ్రూపమున ముఖమ్ము
నందు, వాయువు ఘ్రాణము గాను
ముక్కు లందున, సూర్యుడు చక్షు
రింద్రియముగా నేత్రములందు -

దిక్కులే శ్రోత్రేంద్రియములుగ
చెవుల యందును, ఓషధులు స్ప
ర్శేంద్రియములుగ చర్మమందున
చేరి యుండగ; చంద్రుడు మన-

స్సుగ హృదయమ్ము నందున, మృత్యు
వే అపానము గాను నాభిని
చేరియుండిరి; జలము రేత
స్సై ఉపస్థము నందు చేరెను

క్షుత్తు దప్పికలంత ఈశుని
స్థానమడిగిరి; "ఇట్టిదేవత
లందు మీకును స్థానమిచ్చితి
వారు తిను ఆహారమందున -

మీకు భాగము కలుగు; నే దే
వతలు హవిస్సు పొందిన మీకు
అందు భాగము చెందుచుండును"
అనుచు పరమేశ్వరుడు చెప్పెను.

(సశేషం)

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 9 (15) హైదరాబాద్ జులై : 2025

తారకరామ వైభవం

ఆచార్య ఎం. గోనానాయక్ తెలుగు శాఖ, హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం. ఫోన్ : 9849093300



"కవిగాయక నట వైతాళిక సంస్తూర్యమాన విభవాభరణ" అన్న సింగిరెడ్డి నారాయణరెడ్డి గారి భావజాలం కేవలం దానవీరశూరకర్ణకే పరిమితం కాదు. నటరత్న తారక రామునికి అనువర్తించుకోవచ్చు. తాను చేసే వృత్తి మీద శ్రద్ధ సమయపాలన ఏ విషయమైనా అంత తేలికగా విడిచి పెట్టకుండా లోతులకెళ్ళి పరిశీలించడం, పరిశోధించడం చలన చిత్రాల్లో నందమూరి గారిని హిమాలయమంత ఉన్నతిని చేశాయి.

అలుపు సొలుపు లేని నిరంతర శ్రమవారి సొంతం. అంతేకాకుండా పాత్రల్లో ఒదిగిపోవడం వారికి ప్రజా హృదయాలలో శాశ్వత స్థానాన్ని సంపాదించుకునేలా చేసింది. నిమ్మకూరులో పుట్టిన రామారావుగారి జీవితం ఖండ ఖండంతరాల యశస్సుకు పాదు చేసింది. విశ్వనాథ సత్యనారాయణ గారి గురుత్వం రామారావు గారిని విశ్వ నటసార్వభౌముని స్థాయిని తీసుకెళ్ళింది.

పేదరికం నుండి వచ్చిన జీవితం వారిని పైస పైస జాగ్రత్తపరిచేలా చేసింది. రామారావు గారు చిన్ననాటి నుండి క్రమశిక్షణను తన కుటుంబానికి ఆసరాగా ఉండాలని గుణాలని ఏర్పరచుకున్నారు. పురాణాల పట్ల ఆసక్తిని ఏర్పరచుకున్నారు. ఆది గమనించిన విశ్వనాథవారు రామారావు గారిని మరింత ప్రోత్సహించారు. అలాగే నటనకు తొలి అవకాశం ఇచ్చారు. రామారావు గారు తొలిగా స్త్రీ పాత్రను ధరించారు. (ఆ నాటకం 'రాచమల్లుని దౌత్యం' వేసిన పాత్ర నాగమ్మ)

ఈ విధంగా రామారావు గారి నట జీవితం స్త్రీ పాత్రతో ప్రారంభమైంది. ఇది ఒక కోణం అయితే వారి జీవిత ప్రస్థానంలో వివాహం మరొక కోణం. బసవ తారకమ్మ గారితో మే 2,1942 వ సంవత్సరంలో వారికి వివాహం జరిగింది. ఈ వివాహం 'కొమరవోలు' గ్రామంలో జరిగింది. వివాహానంతరం చదువును విడిచిపెట్టకుండా పట్టుదలతో చదివి BA సాధించారు. ఇంటర్ లో వారు కుటుంబాన్ని గుర్తెరిగి బాధ్యతగా అనేక ఉద్యోగాలు చేశారు. ఒక సందర్భంలో పొగాకు వ్యాపారం కూడా చేశారు.

గుంటూరు ఆంధ్ర క్రిస్టియన్ కాలేజీలో BA చదివే రోజుల్లో కళాశాల కానీ, తన కుటుంబాన్ని కానీ నిర్లక్ష్యం చేయలేదు. రోజు రైలులో విజయవాడ నుంచి గుంటూరు వెళ్లడం జరిగింది. ఈ సందర్భంలోనే అదే కళాశాలలో BA చదువుతున్న కాశీనాథుని విశ్వనాథునితో స్నేహ సంబంధం కుదిరింది. తర్వాత కాలంలో అంటే రామారావు చలనచిత్ర రంగంలోకి ప్రవేశించిన తర్వాత విశ్వనాథుని డైరెక్షన్లో అనేక సినిమాలు చేశారనేది కాలం చెప్పిన సత్యం. సినిమాలలో అవకాశాలు వచ్చిన, ఎందరు ప్రేరణలు కలిగించిన తాను BA డిగ్రీ తీసుకున్న తరువాతనే సినిమా రంగంలోకి అడుగు పెడతాను అన్నమాటను పరిపూర్ణం చేసుకున్నాడు.

BA అనంతరం సినీరంగం వైపు ముగ్గు చూపించిన కొన్ని ఒడిదుడుకులు కులం కారణంగా ఆరంభం నుండి వైదొలకి తాను జీవిత లక్ష్యంగా పెట్టుకున్న పోలీసు ఇన్స్పెక్టర్ ఉద్యోగానికి అర్హత పరీక్ష రాసి ఉత్తీర్ణత సాధించారు. అయితే ఇంటర్వ్యూలో విఫల మయ్యారు. మరో విధంగా రెవెన్యూ శాఖలో రిజిస్ట్రార్ ఉద్యోగంలో చేరారు. ఈ విధంగా జీవితంలో స్థిరపడ్డాను అని ఊపిరి పీల్చుకుంటున్న తరుణంలో సినీ రగం నుంచి 'మనదేశం' అనే సినిమాకు పిలుపు రావడం జరిగింది. ఇంకా అంతే రామారావు గారు వెనక్కి తిరిగి చూసుకోలేదు.

వచ్చిన ప్రతి పాత్రను అంకిత భావంతో నిరంతర శ్రమతో పనిచేసి విజయాలు సాధించారు. 1951 మార్చి 15న విడుదలైన 'పాతాళ భైరవి' రామారావు గారికి స్టార్ స్టేటస్ తీసుకొచ్చింది. ఈ విషయాలన్నీ భగీరథ గారు రామారావు గారి బాహ్య, అంతర్ కోణాలు మదించి తెలియజేసిన సత్యాలుగా పేర్కొనవచ్చు. ఈ సందర్భంలో భగీరథగారి గురించి కొంత చెప్పవలసిందే. భగీరథ గారంటే రామారావు గారికి అపరిమితమైన గౌరవం. ఎన్ని పనులు ఉన్న తమ జీవితంలో అనేక పర్యాయాలు భగీరథ గారికి ఇంటర్వ్యూలు ఇవ్వడంలోనూ, వారితో మనసు విప్పి మాట్లాడడంలోనూ రామారావు గారికి భగీరథ గారికి ఉండే సాన్నిహిత్యాన్ని అంచనా వేయవచ్చు. వితౌట్ అపాయింట్మెంట్ రామారావు గారి జీవిత కాలమంతా నేరుగా కలిసిన వ్యక్తి అంటే ఏమాత్రం అతిశయోక్తి లేదు.

భగీరథగారు రామారావు గారి జీవితాన్ని అన్ని కోణాల్లో తరిచి చూసిన ప్రతిభామూర్తిగా అనేక సందర్భాలలో తెలియజేస్తూ వారి అభిప్రాయాన్ని ఇలా వివరించారు. **"మధురం, ఇది మధురం అన్నార్తుల కన్నీళ్లు తుడిచే జీవితమే సఫలం"** ఇదే మన జీవితం పరమార్థం. ఈ ప్రస్థానంలో ఆ సేతు హిమాచలం మానవ జాతే వారికి తోడు కులమతాలకు అతీతమైన సమాజ స్థాపనకు రామారావు గారు అంతకు ముందు పెద్దలు వేసిన పునాదులను బలిష్టం చేశారు.

రామారావు గారికి ప్రజలు అంటే ఎంత ఇష్టమో గురువులంటే అమితమైన అభిమానము, గౌరవము. విశ్వనాథ వారిని తన ఎదుగుదలకు పునాదులు వేసిన మహోన్నత వ్యక్తిగా రామారావు గారు ఎన్నో సందర్భాలలో వారి గురించి గర్వంగా చెప్పుకునేవారు. ఆర్థికంగా తన ఎదుగుదలకు కారకులైన నాగిరెడ్డిగారిని, బి.ఎ.సుబ్బారావు గారిని, కె.వి రెడ్డిగార్లను రామారావుగారు నిరంతరం స్మరించుకునేవారు. భగీరథ గారు రామారావు గారిని ప్రపంచానికి పౌరాణిక పాత్రలో విశిష్టతనందించిన మహోన్నత వ్యక్తిగా అభివర్ణించారు. 1981 మే 29న రామారావు గారితో జరిపిన ముఖాముఖిలో భగీరథగారు రామారావుగారి పౌరాణిక పాత్రల ఆది మూలాలను బహిర్గతం చేసే నేపథ్యంలో **"పౌరాణిక పాత్రలంటే ఎందుకు మీకు అంత ఇష్టం? మీరు చాలా పాత్రలు ధరించారు కదా! మీలో కదలాడే పాత్రలు ఏమైనా ఉన్నాయా?"** అన్న సూటి ప్రశ్నకు రామారావుగారు ఇచ్చిన సమాధానం వారేమిటో ఋజువు పరుచుకున్నాడని అనిపిస్తుంది. వారు భగీరథగారి ప్రశ్నను ఎంతో సున్నితంగా తీసుకున్న ఇచ్చిన సమాధానం క్లారిటీగా అనిపిస్తుంది. ఆ సమాధానం ఇలా ఉంది. **"పౌరాణికాలు అంటే మాకు అత్యంత అభిమానం, గౌరవం. బహుశా ఆ అభిమాన గౌరవమే ఆ పాత్రల రూపకల్పనను పటిష్టం చేసే నేపథ్యంలో మా జీవితాలని వెచ్చించాయని సగర్వంగా చెప్పగలను. దానికోసం ఆహోరాత్రులు కృషి చేశాం. అది ఊరికే పోలేదని ప్రేక్షకాదరణ కూడా తెలియజేసింది. ఇంతకంటే మాకు ఏం కావాలి"** ఈ మాటలు భగీరథ గారు ఏ ఉద్దేశంతో రామారావు గారిని ప్రశ్నించారో దానికి పదునైన సమాధానం బహిర్గతమయింది. బహుశా రామారావుగారి జీవితంలో పత్రికారంగం వారు కానీ, ఇతరులు కానీ ప్రశ్నించిన దాఖలాలు కనబడవు. భగీరథగారు కూడా రామారావుగారితో ఉన్న చనువును వినియోగించుకోకుండా తన వృత్తి ధర్మానికి ప్రాధాన్యతనిస్తూ అంకితభావంతో చేసిన పనిగా చెప్పవచ్చు. రామారావు గారికి వృత్తి దైవంతో సమానం. వారిని ఒక పరిపూర్ణ వ్యక్తిగా నిలబెట్టింది. అంతేకాకుండా సంఘములో గౌరవం, హోదా వీరితో పాటు జీవనోపాధి అన్ని కూడా వృత్తితో వచ్చాయి.

రామారావుగారి వృత్తి పవిత్రాత్మతో చేసే యజ్ఞంగా వారు ఆజన్మాంతం భావించారు. అందుకే శ్రమించారు. ఈ కారణంగా ఎన్నో విజయాలను తన సొంతం చేసుకున్నారని భగీరథగారు తెలియజేయడం రామారావుగారి పట్ల వారికి ఉన్న గౌరవాన్ని పెంపు చేసినట్లు భావించవచ్చు.

రామారావు గారి జీవితానుభావాన్ని అంచనా వేస్తూ వారి వ్యక్తిత్వం, ఔన్నత్యం, ఉత్తమత్వం, ఉన్నతత్వం మొదలైన అంశాలను నర్మగర్భంగా ప్రశ్న రూపంలో భగీరథగారు అడిగిన విషయం వారిని రెండో కోణాల్లో దర్శింపచేసింది. 1981 నాటికి రామారావుగారి జీవితంలో చలనచిత్ర కోణాన్ని వెలుగులోకి తెచ్చే ప్రయత్నం భగీరథగారు తమ ప్రశ్నలో వేశారు. ఇంతకీ ఆ ప్రశ్న ఏమిటంటే **"దాదాపు 35 సంవత్సరాల చిత్ర జీవితానుభవం సంపాదించిన మీరు నేర్చుకున్నదేమిటి నేర్చుకోవాల్సిందేమిటి?"**

పై ప్రశ్నకు రామారావు గారు ఇచ్చిన సమాధానం అంతే విశ్లేషణాత్మకంగా ఉంది. ఆ సమాధానం ఇలా ఉంది. **"లలిత కళలకు ఆది అంతం లేదు. అవి అనంతమైనది. వాటిలో కష్టాలు రావడం అనేది జరగదు. 35 సంవత్సరాల అనుభవంలో నేర్చుకున్నది అదే మేము. నేర్చుకోవాల్సింది ఎంతో ఉంది. కళా ప్రపంచంలో ఎల్లప్పుడూ మేము విద్యార్థిగానే భావిస్తాం. నేర్చుకోవడంలో నిరంతరం మా కృషి కొనసాగుతూనే ఉంటుంది. మా కృషి, పట్టుదల మా జీవితాన్ని క్రమబద్ధమైన రీతిలో దిద్దుకోవడానికి మనిషిగా పుట్టినందులకు కొన్ని పద్ధతులు అవలంబించాలని మా ఉద్దేశం. ఆత్మలో పవిత్రత ఉండాలి"** అన్న నందమూరివారి సమాధానం వారిని కళాకారుని కోణాన్ని, క్రమశిక్షణతో ఎదిగిన కోణాన్ని దర్శింపచేస్తాయి. దీనికి ప్రధాన కారణం భగీరథగారు రామారావు జీవితంలో సాత్త్విక కోణాన్ని బహిర్గతం చేయాలనే తపన ఈ ప్రశ్న అడగడానికి మూల కారణం అని చెప్పవచ్చు.

రామారావుగారిని గమనిస్తే అనేక వేల మంది మానవులలో ఎవడో ఒక్కడే జ్ఞాన సిద్ధినై ప్రయత్నిస్తాడు. భగవానుడు శ్రీకృష్ణుడు

భగవద్గీతలో చెప్పిన **"మనుష్యాణాం సహస్రేషు"** అన్న శ్లోకం చక్కగా సరిపోతుందనిపిస్తుంది. మరోవిధంగా చెప్పాలంటే అహార్యం ఏకాగ్రత, కష్టించే గుణం పాత్రలో ఇమిడిపోయే మనస్తత్వం ఇవన్నీ అందరికీ సూట్ అయ్యేవికావు. భగవద్గీతలో భగవానుడు చెప్పినట్లు రామారావుగారిని అంత సులభంగా అందుకోవడం ఎవరికి సాధ్యమయ్యే పనికాదు. ఆ గుణాలు ఆ దీక్ష రామారావుగారి కొక్కరికే సొంతమనే ఘంటాపథంగా చెప్పవచ్చు.

ప్రధానంగా రాముడున్నా, కృష్ణుడన్నా రామారావుగారినే అన్నది జగమెరిగిన సత్యం. ఆ విషయం భారత ప్రధాని మోడీగారు కూడా గుర్తు చేయడం విశేషం. వారు రామారావు గారిని శ్లాఘిస్తూ ఇలా అన్నారు.

"తెలుగు సినిమా రంగంలో రామారావుగారు మహానటుడు. శ్రీరాముడిగా, శ్రీకృష్ణునిగా ఆయన తెలుగువారి హృదయాలలో సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్నారు. రాముడు అనగానే మనకు నందమూరి వారే గుర్తుకు వస్తారు. శ్రీరామ పాత్రకు జీవం పోసి ప్రేక్షకుల మనసులో ఆరాధ్య దైవంగా నిలిచిపోయారు."

మోడీగారి పై భావాన్ని రామారావు శ్రీరామపాత్ర పరంగా పరిశీలిస్తే ఇది అక్షర సత్యాలనే విషయం బయల్పడుతుంది.

ఈ విధంగా 1949 నుండి 1983 దాకా చలనచిత్ర పరిశ్రమలో అనుంగు బిడ్డగా ముక్కోటి ఆంధ్రుల అభిమాన నటుడిగా ఉన్నత శిఖరాలను అధిరోహించారు. వారిలో అంతస్తు పెరిగిన అహం పెరగలేదు. అడ్డంకులు వచ్చిన అడ్డుదారి తొక్కలేదు. సినిమా రంగంలో ప్రవేశించిన నాడు ఎలా ఉన్నారో ముందు ముందుకు దూసుకుపోయిన నాళ్ళలో కూడా వారు అలాగే ఉన్నారు. మరొకపక్క కర్మలను, తమ వృత్తిపై కేంద్రీకరింపజేసి ప్రతిపాత్రను పరిశోధించి తన విజ్ఞానంతో కవిభావాన్ని మేళవించి పాత్రలో జీవించారు.

మనిషి జీవితంలో డబ్బు ప్రధాన పాత్ర వహిస్తుందని, ఎంత సంపాదించిన ఖర్చు పెట్టేటప్పుడు ప్రతి పైసలు విలువైనదిగా చూడాలనే నిశ్చిత అభిప్రాయంతో రామారావుగారు జీవితాంతం ప్రయాణం చేశారు.

ఈ విధంగా రామారావుగారి జీవితాన్ని ఒక ప్రత్యేక కోణంలో అధ్యయనం చేసినప్పుడు వారి ద్వారా అనుభూతి, అనుభవాలతో పరితృప్తులై లబ్ధప్రతిష్టుల అభిప్రాయాలను సేకరించి ఒకచోట సూది గుచ్చితే రామారావు గారి జీవిత అంతరంగము బహిర్గతమవుతుంది. నిజానికి ఒక వ్యక్తి యొక్క జీవితం ఆ జీవితంలోకి వృత్తి కోణము ఏ విధంగా రాబోయే తరాలను మార్గదర్శకం చేస్తోందో తెలుసుకోవా లంటే ఒక ప్రత్యేకమైన గ్రంథం ఆవశ్యకత ఎంతైనా ఉంది. ఆ కొరతను తారకరామం అన్నగారి అంతరంగం అనే గ్రంథం ఆ కొరత తీర్చింది అని ఘంటాపథంగా చెప్పవచ్చు.

ఒక మనిషి శ్రమిస్తే 'హిమాలయం' అంత ఎత్తుకు ఎలా ఎదుగుతాడో ఈ గ్రంథం తెలియజేసింది. నిజానికి ఇది ఒక ప్రయోగం దీని ప్రయోజనం కేవలం ప్రమోదం కాదు. వారు ఈనాడు మన మధ్య లేకపోయినా వారు మనతోనే ఉన్నారని సంతృప్తికి దగ్గర చేసింది ఈ గ్రంథం.

వర్తమాన సమాజంలో శ్రమించడం అనే విషయాన్ని పక్కకు పెట్టి వేగవంతమైన కాలంతో పోటీ పడుతూ మితిమీరిన కోరికలతో కేవలం మానవ విలువలకు కాకుండా ధనార్జనకే మొగ్గు చూపుతున్న ఆధునిక యువతకు ఈ గ్రంథం **"కృషి ఉంటే మనసులు ఋషు లవుతారు. మహా పురుషులవుతారు"** అన్న కవి వాక్కుకు ఒక దర్పణంగా రామారావుగారి జీవితం నిలుస్తుంది అనేది ఈ గ్రంథం అన్ని కోణాల్లో రామారావు గారి అంతరంగాన్ని పరిశీలించి, పరిశోధించి తృప్తికరమైన ఫలితాలను ఏర్పరిచింది.

ఇంతటి మహత్తర సాధనకు కృషి చేసిన, నిరంతరం శ్రమించిన ఈ గ్రంథం ప్రధాన సంపాదకులు టి.డి. జనార్దన్ గారి గురించి ప్రస్తావించకపోతే దీనికి అర్థమే లేదు. నిజానికి జనార్దన్ గారు తారక రామారావుగారి స్ఫూర్తిని పరిపూర్ణంగా జీర్ణించుకున్న వ్యక్తి కావడం అనేక విషయాలపై ప్రత్యేక శ్రద్ధ కనపరుస్తూ ఈ గ్రంథం పురుడు పోసుకోవడానికి కారకులయ్యారు. ఏదేమైనా వీరు నందమూరిగారి జీవితాన్ని భావితరాలకు స్ఫూర్తిదాయకం చేసే దృఢ సంకల్పముతో నిరంతరం శ్రమించడం గమనిస్తే వీరికి తెలుగుజాతి నిరంతరం ఋణపడి ఉంటుందని రూఢిగా చెప్పవచ్చు. ఏదేమైనా అందరినీ ఒకచోట చేర్చి ప్రధానంగా ఈ గ్రంథాన్ని రమారమి 499 పుటలతో 131 మంది అజరామర కృషితో ఆవిష్కృతం చేసిన ఘనత టి.డి. జనార్దన్ గారిదే.

ఈ గ్రంథానికి మరొక ఆయువుపట్టు సంపాదకులుగా వ్యవహరించిన భగీరథగారు వీరికి రామారావుగారితో దశాబ్దాలుగా ఉన్న అనుబంధం వారిని ఈ గ్రంథాన్ని చదవరుల జాతికి ఒక గొప్ప పరిశోధక కృషిగా అందించే యత్నానికి విజయం చేకూర్చింది. భగీరథగారు నిజానికి ఒకనాటి 'భగీరథుని' లాగా పట్టుదలతో ఈ గ్రంథానికి ఈ కళా సౌష్టవాన్ని భావపుష్టిని ఎక్కడ రాజీ పడకుండా నిరంతర శ్రమతో ఫలంగా, గొప్ప ఫలితంగా ఈ గ్రంథాన్ని ఆవిష్కృతం చేశారు.

ఏది ఏమైనా 'విశ్వవిఖ్యాత నటసార్వభౌముడికి' జనార్దన్, భగీరథ గార్ల ఈ శ్రమఫలితం ఆచంద్రార్కం. అజరామరమై వర్ధిల్లుతుందని మనస్ఫూర్తిగా తెలియజేస్తున్నాను.

❖ ❖ ❖ ❖ ❖

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 9 హైదరాబాద్ జులై : 2025

ఆదిత్య హృదయ మహిమ

**"ఆదిత్యః సవితా సూర్యః ఖగః పూషా గభస్తిమాన్
సువర్ణ సదృశో భాను ర్హిరణ్యరేతా దివాకరః"**

ఇందులో ఆదిత్యుడు, సవిత, సూర్యుడు, ఖగుడు, పూష, గభస్తిమంతుడు, సువర్ణసదృశుడు, భానువు, హిరణ్య రేతసుడు, దివాకరుడు అని పది నామాలు ఉన్నాయి.

(గత సంచిక తరువాయి)

17. మార్తాణ్డకః : ఆదిత్యునికి మార్తాండుడు అని ఒకపేరు. మార్తాండుడే మార్తాండకుడు. ఈ మార్తాండ జన్మ కర్మములను మార్కండేయ పురాణం వివరిస్తున్నది. యజ్ఞాలలో యజమానులు ఆయా దేవతలకు సమర్పిస్తున్న హవిస్సులను దైత్యులు అపహరిస్తున్నారు. దేవతలకు ఆహారం దక్కడం లేదు. వారిని కాపడటానికి అదితి సూర్యభగవానుని ఆరాధించింది. సూర్యుడు ప్రత్యక్షమయ్యాడు. ఆ దేవమాత నీ అంశంతో నాకొక పుత్రుణ్ణి ప్రసాదించుమని వేడుకొన్నది. సూర్యతేజస్సుతో అదితి గర్భంలో ఒక పుత్రుడు పుట్టాడు. అతడే మార్తాండుడు. అతని తేజస్సును భరించలేక దైత్యులు భస్మమై పోయారు. ఇది మార్కండేయపురాణం చెప్పిన కథలోని ముఖ్యాంశం.

ఆదిత్యుని అంశంతో పుట్టిన మార్తాండుడు "ఆత్మావై పుత్ర నామాసి" (తానే పుత్రుడనే పేరుగలవాడు) అనే వేదవాక్కు ననుసరించి ఆదిత్యుడే. 'మార్తాణ్డక' అన్నపదంలోని క ప్రత్యయం ఆదిత్యుని అంశను తెలియజేస్తుంది. దైత్యులను భస్మం చేయటం అంటే దైత్య భావాలను రూపుమాపటం. ఆదిత్యుడు విద్యాస్వరూపం అనుకున్నాం. అవిద్య దైత్య స్వరూపం. అది రూపుమాసిపోవటం అందువలోని తాత్త్వికార్థం.

18. అంశుమాన్ : అంశుమంతుడు. అత్యధికమైన శక్తి ప్రభావాలు గల కిరణాలు కలవాడు. స్థూలంగా గభస్తులు, కిరణాలు, అంశువులు అనేవి సమానార్థకాలే. కానీ సూక్ష్మ భావనతో దేని అర్థం దానిదే. అంశువు అంటే వ్యాపించేది. సూర్య మండలం నుండి బయలుదేరిన తేజస్సు అన్ని వైపులకు వ్యాపిస్తుంది. ఆ వ్యాపనంతో గాలి, అగ్ని, నీరు, భూమి వేడెక్కుతున్నాయి. ఆ వేడి ఆయా భూతాల శక్తులను వెలికి తీసి జీవకోటికి కావలసిన చైతన్యాన్ని అందిస్తూ ఉంటాయి. అటువంటి వ్యాపనశీలం కల అంశువులు అప్రమేయంగా ఉన్న అంశుమంతుడు ఆదిత్యుడు.

(సశేషం)(ఆచార్య శలాక రఘునాథ శర్మగారి 'ఆదిత్య హృదయం' నుండి)

సత్సంగం





మౌనం

మౌనం గురించి శ్రీ భగవాన్ "ఒకరి భావాలను ఇతరులకు చెప్పటానికి పనికి వచ్చే సాధనమే భాష, భావాలుదయించిన తరువాతనే దాని అవసరమేర్పడుతుంది. "నేను" అన్న ఆలోచన ఏర్పడిన తరువాతనే మిగిలిన భావాలు ఉదయిస్తాయి. అందుచేత సంభాషణకి మూలం "నేను" అన్న తలంపు. ఆలోచనలే లేకుండా ఉన్నప్పుడు ఒకరినొకరు అర్థం చేసుకోవడానికి ఉపయోగపడే భాషే – మౌనమంటే" అన్నారు.

"మౌనమెప్పుడూ పలుకుతూనే ఉంటుంది. మౌనం నిరంతర స్రవంతి. దానికి ఆటంకంగా ఏర్పడేదే వాక్కు. నేననే ఈ మాటలు ఆ మౌన భాషకు ఆటంకాలవుతున్నాయి. ఉదాహరణకి – తీగెలో విద్యుత్ ప్రవహిస్తుంది. ఆ ప్రవాహానికి అవరోధ మేర్పడితే అది దీపంగా వెలగవచ్చు. పంకాగా తిరగవచ్చు. తీగెలో మాత్రం విద్యుచ్ఛక్తిగానే ఉంటుంది. ఆ విధంగానే మౌనం నిర్విరామంగానే ప్రవహించే భాష, దానికి అవరోధం కలిగించేవే మాటలు."

"సంవత్సరాల తరబడి జరిగిన సంభాషణల వల్ల తెలియనిది మౌనంలోనో, మౌన సాన్నిధ్యంలోనో ఒక్క క్షణంలో తెలుస్తుంది. దీనికి దక్షిణామూర్తీ, వారి నలుగురు శిష్యులూ పరమోదాహరణ. ఈ భాషే అన్నిటికంటె ఉత్తమము. శక్తిమంతము."

మౌనం శూన్యం కాదు, మాంద్యం కాదు. విశ్వానికి ఆధారభూతమదే. భవనము ఎంత అందమైనదైనా దాంట్లో తలుపులూ, కిటికీలూ, గదులూ లేకపోతే మనమందులో ఉండలేం. తలుపులూ, కిటికీలూ, గదులూ ఖాళీ ప్రదేశాలు. ఈ ఖాళీ జాగాలే ఇంటిని వాసయోగ్యం చేస్తాయి. మోటారుకారు ఎంత పెద్దదైనా, ఎంత అందమైనదైనా అందులో స్పార్క్‌ప్లగ్ సరిగ్గా పని చేయపోతే కదలలేదు. స్పార్క్‌ప్లగ్ లో ముఖ్యమైనది, చిన్న ఖాళీ ప్రదేశం. ఆ అగ్నికణం రాజుకోవాలంటే ఆ ఖాళీస్థలం శుభ్రంగా ఉండాలి. ఆ ఖాళీస్థలమే లేకపోతే అగ్నికణమే లేదు. ఆ ఖాళీస్థలం దేనితోనైనా నిండిపోతే కారు నడవదు. అంటే, స్పార్క్ ప్లగ్ లోని ఆ ఖాళీయే కారు నడకకు మూలం. ఆ విధంగానే మౌనం – శబ్ద రాహిత్యమన్న వ్యతిరేక భావమే కాదు. విశ్వమంతటికీ మూలమదే.

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 9 హైదరాబాద్ జులై : 2025

చమత్కార నిధి – చేమకూర వేంకటకవి

డా. ఏలె విజయలక్ష్మి, సహాయ ఆచార్యులు, తెలుగు శాఖ, ఉస్మానియా విశ్వవిద్యాలయం.
ఫోన్ : 929 710 1543

ప్రతి పద్యమునందు జమ
తృతి గలుగ జెప్పనేర్తు; వెల్లడ బెళుకొ
కృతి వింటి మపారముగా;
క్షితిలో నీ మార్గ మెవరికిన్ రాదు సుమీ.

(విజయవిలాసం ప్రథమాశ్వాసం పద్యం-50)

అని తన ఏలిక రఘునాథ నాయకునిచే పొగిడించుకున్న కవి చేమకూర. సంగతి ఏదైనా చెప్పి తీరులో చమత్కారాన్ని వడ్డించి చదువరుల మదులకు మంచి విందు చెస్తాడీ కవి. అకుంఠిత దీక్షతో కూడ బెట్టిన వాఙ్మయ సంపద, అపారమైన లోకజ్ఞత ఉంటే తప్ప అందరికీ సాధ్యం కాదిది. ఇవే సాధనాలుగా చమత్కారపు నిధులను కొల్లగొట్టాడు వేంకటకవి.

తన సమకాలికులు వ్యవహరించే పదాలను, పలుకుబళ్లను, జాతీయాలను, లోకోక్తులను సంగ్రహించి విజయవిలాసం నిండా గుమ్మరించాడు కవి. మాటల కూర్పులో నేర్పు, పాత్ర చిత్రణలో ఔచిత్యం, కావ్య నిర్మాణంలో విలక్షణత మొదలైన గుణాలన్నీ ఒక ఎత్తు. కవి తనదైన ప్రతిభతో సాధించిన ప్రతి పద్యచమత్కృతి మరో ఎత్తు.

భావనలో ఎంత బలమున్నా, వర్ణనా నైపుణ్యం లేకుంటే పఠిత కళ్ల ముందు దృశ్యం సాక్షాత్కరించదు. వర్ణనకు ఆధారం భాష. చేమకూర భాషలో చేసిన గారడి విజయ విలాసమంతా కనిపిస్తుంది. ఏ పదాన్ని ఎక్కడ, ఎలా వాడాలో తెలిసి ప్రయోగించిన భాషావేత్త వేంకటకవి. పడతి అనే చోట 'నెలంత' అని, అర్జునుడు అనే చోట 'గుడాకేశుండు' అని, పార్వతి అనే చోట 'అపర్ణ' అని అనడంలో కవి భాషజ్ఞత తేటతెల్లమౌతుంది. పదాల వ్యుత్పత్తి అర్థాలతో చమత్కారాన్ని పండించడంలో ఈయన అనన్వయాలంకారం. **"ఇందుకే వాఙ్మయ రూఢీ నీయంత వాడికేడీ?"** అని రఘునాథ నాయకుడు ప్రశంసించాడు.

పద ప్రయోగంలో చమత్కారం:

చేమకూర వేంకటకవి తనకు జనించిన ఊహా చిత్రాలన్నీ పఠిత కళ్లముందు ఆవిష్కరించడానికి ఎన్నుకున్న పదసంపదా గీరా అనిపిస్తుంది. ఉదాహరణకు 'గుడాకేశుండు' అనే పదం పద ప్రయోగంతో తెల్లని గంగను నల్లని యమునగా చమత్కరించాడు కవి.

తమి నిగుడ గుడాకేశుం
దమరనదీ విమల నాడుచునుండ



యమునానది గూడిన తో
యమునా నది తనరె దత్కచామేచకమై. (ప్ర.ఆ.ప-121)

గుడాకేశములున్న (చూపుడువ్రేలి కొన బొటనవ్రేలితో కలిపినప్పుడు ఏర్పడే వలయానికి గుడా అని పేరు) అర్జునుడు తెల్లని గంగలో మునిగినప్పుడు ఎలాగైనా అతని నల్లని వెంట్రుకలు గంగమీద తేలి, గంగ యమునగా తలచిందట. సుందరమైన ఈ దృశ్యావిష్కరణకు కవికి తోడ్పడిన పదం గుడాకేశుండు. శివుడిని గుణాకేశుండంటాడు. అంత ఒత్తైన వెంట్రుకలున్నాయి. కాబట్టే తన తలమీద పడ్డ గంగను చుక్క జారకుండా కట్టడి చేశాడు.

ఇలాంటి మరో పద ప్రయోగం 'అపర్ణ' అన్నది.

తా సైరింప కపర్ణ యుండగ భవద్గర్భమ్మునం దాల్చి తే
జో సహ్యున్ శరజన్ము గాంచి యల నీహార క్షమాభృత్ కుమా
రీ సాపత్న్యము గన్న మోహపు బురంధ్రీ రత్నమౌ దీవ; కా
వే, సర్వజ్ఞుడు నిన్ను నేల తలపై నెక్కించుకో జాహ్నవీ?

(ప్ర.ఆ.ప-114)

ఆకులైనా తినకుండా తపస్సును చేయడం తపస్సుకి పరాకాష్ఠ. అంతటి తపోధని కాబట్టే పార్వతికి అపర్ణ అని పేరు. ఆ మహాతపస్వికీ సాధ్యం కాలేదు శరజన్మ. (కుమారస్వామి)ని గర్భంలో మోయడం. ఆ పనిని నీవు చేశావు. ఆ కృతజ్ఞత తోనే శివుడు నిన్ను తలమీద పెట్టుకున్నాడు అని గంగను పొగడ్తాడు అర్జునుడు. ఒక అపర్ణ అనే పదప్రయోగంతో గంగను పార్వతి కంటే గొప్పదని చమత్కారంగా చెప్పాడు చేమకూర.

మరొక పద్యంలో 'రేక మొనక' అనే పద ప్రయోగం.

కన్నె నగుమోము తోడం
బున్నను చందురుని సాటి బోలుప వచ్చున్
నెన్నుదురుతోడ మార్కొని
మున్నందరు జూడ రేకమోవక యున్నన్ (ప్ర.ఆ.ప-197)

ఈ పద్యం చిత్రాంగద సౌందర్యాన్ని పొగిడే సందర్భంలోనిది. ఇందుకే కదా వేంకటకవిని చమత్కారంలో ఘనాపాటి అని ప్రశంసించెడి అనిపించే ఉదాహరణ ఇది.

ఇంతకు ముందు ఒకసారి చిత్రాంగద అందమయిన నుదురుతో పోటీపడి ఓడిపోనట్లయితే, ఇప్పుడు ఆమె నగుమోముతో చంద్రుడిని పోల్చవచ్చు అంటున్నాడు కవి. చంద్రున్ని ఓడించే సౌందర్యం ఆమెదని చమత్కారంగా చెప్పాడు చేమకూర.

'రేకమోవక' అన్న పదానికి ఓడిపోవడం అని అర్థం. ఆ పదంలోని 'రేక' అన్నదానికి 'గంటు' అని అర్థం. ఊహలో పుట్టిందే అయినప్పటికీ చంద్రునిలో మచ్చుందనే విషయం అందరూ అంగీకరించినదే. ఇట్లా చూసినా చిత్రాంగద అందం ముందు చంద్రుడు దిగదుడుపే మరి.

మరో పద్యంలో స్త్రీకి పర్యాయ పదాలైన వెలంది, నెలంత అనే వాటిని తీసుకొని...

ఈ వెలంది యొడల్ పైడిలో వెలంది
యీ నెలంత లలాటంబు లే నెలంత
ఈ సుపాణి రదశ్రేణియే సుపాణి
ఈ బిదారు మృగీమద శ్రీ బిదారు (ప్ర.ఆ.ప-195)

ఆమె శరీరం బంగారం కంటే విలువైందని, ఆమె నుదురు నెలపొడుపు చంద్రునంత అందమయిదని చమత్కరించాడు కవి.

పలుకుబళ్ల నియోగంలో చమత్కారం :

భాష ఒక్కటే అయినా ప్రాంతాన్ని బట్టి పలుకుబళ్లు భిన్నంగా ఉంటాయి. పలుకుబళ్లు ఆయా ప్రాంతాల ఉనికి తెలియజెప్పుతాయి. పలుకుబళ్లు మాటలకు జిగిని పుడుతుంది. బిగిని చేకూర్చుతుంది. ఇది లోకజ్ఞత ఉంటేనే సొంతమవుతుంది. 'స్వామి కార్యం స్వ కార్యం' అనట్లు పలుకుబడిని భావ వ్యక్తీకరణకే కాదు. చమత్కారాన్ని పండించడంలో వేంకట కవికి మించినవాడు లేడని చెప్పవచ్చు.

'అయ్యారే! చెలు వెక్కడ
న య్యారే గెలువ జాలు నంగజు నారిన్
వెయ్యారులలో సరిలే
రయ్యా రుచి రాంగ రుచుల నయ్యంగనకున్' (ప్ర.ఆ.ప-103)

సుభద్ర సౌందర్యాన్ని పొగిడే పద్యం. ఇక్కడ 'అయ్యారే' అయ్యాబు అన్నవి ఒక ప్రాంతపు పలుకుబళ్లు. వీటిని ప్రయోగించి కథను జోడించి చమత్కారాన్ని కొల్లగొట్టాడు వేంకటకవి.

రెండవ పాదంలో 'అయ్యారే'లో ఆ+ఆరే ఉంది. ఇక్కడ ఆరు అంటే నూగారు నాభికి కింద కనిపించే వెంట్రుకల వరుస. (ఇది దట్టంగా ఉంటే స్త్రీ తొందరగా సంతానవతి అవుతుందంటారు సాముద్రికులు) అది మన్మథుని వింటినారిని (తుమ్మెదల వరుస) గెలవగలదు. అన్నది చమత్కారం. వేయ్యారు పదానికి ఆరు వేలు. ఆమె అందం ముందు ఆరువేల అంగనలైనా ఓడి పోతారన్నది కవి భావన.

అలుకలు నీలము లధరం
బల పగడము గోళ్ళు ముత్తియంబు లటంచున్
దెలుప మును విందు జిలుకల
కొలికి తెరంగెల్ల బూన గ్రుచ్చిన రీతిన్ (ద్వి.ఆ.ప-79)

ఆ పద్యంలో 'చిలుకల కొలికి' 'పూసగ్రుచ్చినట్లు' అన్నవి పలుకుబళ్లు. పై పద్యంలో మరొక చమత్కారం కూడా ఉంది. సాధారణంగా ముత్తెములతో పొలుస్తారు కానీ, కవి ఇక్కడ గోళ్లను పొల్చాడు. మరో పద్యంలో 'పసలేదు' పలుకుబడితో...

కదు హెచ్చు కొప్పు దానిన్
గదవన్ జనుదోయి హెచ్చు, కటి యన్నిటికిన్
కదు హెచ్చు, హెచ్చు లన్నియు
నదుమే పసలేదు గాని నారీమణికిన్ (ప్ర.ఆ.ప-104)

సుభద్ర సౌందర్యాన్ని పరిచయం చేస్తూ.. ఆమెది శిల్ప సౌందర్యమని తెలిసిన ఉపమానాలతో ప్రశంసించాడు. 'పసలేదు' అనే పలుకుబడిని నడుముకు ఆరోపించి చమత్కారాన్ని సాధించాడు.

పద్యంలో అలంకారం అతిశయోక్తి, శ్లేష, యమకం మొదలైన ఏమయినా ఉండవచ్చు. కవి లక్ష్యం చమత్కారపు మెరుపులతో పఠితలను సంభ్రమాశ్చర్యలతో ముంచెత్తడమే!

విజయవిలాసంలోని కొన్ని పలుకుబళ్లు-చిదిమిపెట్టు (1-75) తడపము (1-68) సన్నగిల్లు (1-72) నిక్కడం, నీల్గడం, విర్రవీగడం (1-99) అమ్మకచెల్ల (1-135) తబ్బిబ్బు (2-191) చేదు వగలు (3-65), తలమున్కలు(3-15), ఆగడు(3-28), బుజ్జగించు (1-198), కోట (1-74).

జాతీయాలతో చమత్కరించి మురిపించడం:

అక్కర జూడ వేటికల యచ్చిక బుచ్చిక సేయు సంచలం?
జెక్కిలి గొట్టె దేమిటికి జేరంగ వచ్చిన ముద్దు జిల్కలన్
ముక్కు మొగంబు జూడ కటు ముట్టను బొమ్మనె దేల బోట్ల?నో
చక్కెర బొమ్మ నీ వెగటు జాదలు సూచిన వింతలయ్యేడల్.
(తృ.ఆ.ప-30)

పై పద్యంలో సుభద్రను ఆమె వదినలైన రుక్మిణి, సత్యభామాదులు సరసంగా ఏడిపించడం కనిపిస్తుంది. మనస్సులో ప్రియుడిని దోచుకున్న నీవు, చెలికత్తెలను ముక్కు మొహం చూడక పొమ్మంటావు.

అలవాటుగా దగ్గర కొచ్చిన చిలుకల చెంపల మీద కొడ్తున్నావు. హంసలను అచ్చిక బుచ్చికలాడుతూ గారవించవు. ఏమిటి సంగతని తెలిసిన సంగతినే ఆరా తీస్తున్నారు.

ఇందులో 'అచ్చిక బుచ్చిక చేయు', 'ముక్కు మొగంబు చూడక' అలానే చక్కని జాతీయాలు. చక్కర బొమ్మ పలుకుబడి, పెండ్లి నడకలు (1-78)

రే లమృతాంశలో శశము రెమ్మిద మంచు దలంచి జాళువా
మేలి పసిండి సోయగపు మేడల గుజ్జెన గూళ్ల సందడిన్
బాలిక లుండి యావలం జనం గని, చింతిలి పంటయింటికుం
దే లిది యెందు బోగలదు? నేటికి నేమని యందు రందులన్
(ప్ర.ఆ.ప-71)

ఇంద్రప్రస్థపురంలోని మేడలు ఎంతో ఎత్తైనవని చమత్కారంగా వర్ణించడానికి ఓ అందమైన దృశ్యాన్ని ఆవిష్కరించాడు కవి. ఎత్తైన మేడల మీదకు చేరి వెన్నెల్లో ఆడుకుంటున్న ఆడపిల్లలు చంద్రుడిలోని కుందేటి కొమ్మును తీసుకరావాలకుంటారట. కానీ ఆటల సందడిలో ఆ విషయాన్ని మర్చిపోయి తిరిగి గుర్తొచ్చినప్పుడు చంద్రుడు తను వంట ఇంటి కుందేలే కదా! ఎక్కడికి వెళతాడు రేపు చూడ వచ్చులే అని సరిపెట్టుకున్నారడట. ఈ వర్ణన చదివినప్పుడు కవి ఊహా బలానికి జోహారు చెప్పాలనిపిస్తుంది.

పిలువని పేరంటం (1-78), నడమంత్రపు కల్మి (1-99), మొకమిచ్చకపు మెచ్చు (1-86), వాయుసుఖము సఖి (3-63) కడుపు చుమ్మలు (3-135) యొడలెల్ల గన్నులు (3-103) చనవిచ్చి చౌకచేయడం (1-86).

సామెతల ఆధారంగా చమత్కారాల్ని చెప్పుట :

ఇన్నాళ్లు సేవ చేయుచు
సున్నదయుం బోయె నే దయో! కౌగిలి యి
మ్మన్నంత 'జదువ బెట్టగ
నున్న మతియు బోయె' నను టహెూ! నిజ మయ్యెన్
(తృ.ఆ.ప-10)

సుభద్ర గురించి అర్జునుడు అనుకున్న మాట ఇది. నిన్నటి దాక నేనెవరో తెలియనప్పుడు యతిగా భావించి సేవలెన్నో చేసింది. నేడు నేనెవరినో తెలిసి కౌగిలిని అడగగానే సిగ్గుతో దూరంగా పారిపోయింది. 'చదివేస్తే ఉన్నమతి పోతుందని' జనులనే మాట నిజమే కదా! అని జనుల వ్యవహారంలో తరచూ వినే ఈ సామెతకు చమత్కారాన్ని అద్ది శృంగార భరితం చేశాడు కవి.

చేసె జప మతడు కదు వి
శ్వాసము చెలి చూపు బేడిసలపై నిగుడన్
జేసిన యది జపమున్ మరి
వేసిన యది గాల మనుట వృథ గాకుండన్ (ద్వి.ఆ.ప-135)

అర్జునుడు 'చేసినది జపము, వేసినది గాలము' అన్న సామెతను నిజం చేస్తూ సుభద్ర చూపులకే 'బేడిస' చాపల మీద తన చూపుల గాలాన్ని వేసి జపం చేశాడట. ఇదే కొంగ జపమని కూడ అంటారు కదా! చేపలలో ఒక రకానికి బేడిసలని పేరు. బహుశా అవి తళుకు లీనుతూ అందంగా ఉంటాయెమో కన్నె కన్నుల లాగా! ఇలా లోక ప్రసిద్ధమైన సామెతలను సందర్భానుసారంగా వాడి చమత్కారాన్ని పండించాడు చేమకూర వేంకటకవి.

ఇలాంటివే "అందుకున్న కాళ్లు అందిన సిగ" (3-51) గణింపరు జాణలు జారుపాటులన్ (1-172) "మోక్షమునకు బోన మొసలెత్తుక పోయే", "నాగవలి లోపల నిష్కరమేల" (3-171) "దనకెంత మక్కువున్న నాడు బుట్టువు పుట్టింటి కాసపడును" (3-133), నిత్యకల్యాణం పచ్చతోరణం (1-83).

ధ్వని మంతమయిన చమత్కారం :

పోక ప్రాకుల మహిమ, కప్పురపు టనటి
యాకు దోటల సౌభాగ్య మందె కలదు;
ప్రబలు మౌక్తిక సౌధసంపదల గరిమ,
వీటి రహి మెచ్చవలయు బో వేయునోళ్ళ. (ప్ర.ఆ.ప-82)

తంజావూరు నగరం మౌక్తిక సౌద సంపదతోనూ పోక తోపుల తోనూ, అరటి తోటల తోనూ, తమలపాకుల తీగలతోనూ ఎంతో అందంగా ఉందని చెప్పి, దాని సౌభాగ్యగరిమ సంపదను పొగడాలంటే తాంబులం వేసకున్న నోళ్లే కావాలి అంటున్నాడు. ఆకులు, పోకలు, కప్పురం, మౌక్తికముల సుధ కలిపినప్పుడి తాంబులానికి రుచి. దాని మహిమను పొగడాలంటే దానిని ఆస్వాదించే నోర్లే కావాలి. అవీ ఒక్కటి కావు వేలు. ధ్వనిని ఔచితీమంతం చేసిన చమత్కారమిది. ఆ నగర సౌందర్యాన్ని వర్ణించటానికి ఆదిశేషునికే సాధ్యం. అన్న ధ్వని ఉంది ఇందులో. 'వీటి' అనే పదానికి నగరం-తాంబూలమనే అర్థాలున్నాయి. 'రహి' అన్న పదానికి సౌందర్యం-రుచి అన్న అర్థాలున్నాయి. ఈ రెండు పదాలలోని శ్లేషతో పద్యమంతా ధ్వనిమంతమయ్యింది.

అలంకారాల చమత్కారం :

శ్లేష, అతిశయోక్తి, యమకము, అనుప్రాస మొదలైన అలంకారాలను సందర్భోచితముగా వాడి చమత్కారాన్ని సాధించి పఠితల మనస్సును మనోజ్ఞం చేశాడు. వాటన్నింటిలో ఈయనకు ఇష్టమైన అలంకారం శ్లేష. అందుకే **"చేమకూర కవి శ్లేషలు పూల మొగ్గల వలె తమంత తామే వీడును"** అని వేదం వేంకటరాయశాస్త్రి ప్రశంసించాడు.

వెండియు బైడియు దడబదు
చుండుం బురి నెందు జూద, సుగ్రాణములై
యుండంగా వలె నందలి

యిందుల గైలాస మేరు పృథ్వీధరముల్ (ప్ర.ఆ.ప-68)

ఇంద్రప్రస్థపురంలో ఎక్కడ చూసినా బంగారు, వెండి వస్తువులు తడబడుచు (ఒకదాని మీద ఒకటి పడ్తూ) కనిపిస్తాయి చూడబోతె కైలాస (వెండి) మేరు (బంగారు) పర్వతాలు ఆ నగరపు ఇళ్లల్లో (ఉగ్రాణములు) భండాగారాలలో సమృద్ధంగా ఉన్నాయని భావం.

అలంకారమేదైనా కావొచ్చు చమత్కరించడం మరువడు కవి. కొనసాగింపుగా **'పనికి రాకొకమూల బడియె నీతని వస్తువని కుబేరుని మెచ్చరార్య జనులు'** అంటాడు.

పున్నమ రేల, దత్పురము పొంతనె పో శిఖరాళి దాకి వి
చ్చిన్న గతిన్ సుధారసము చింది పయిం దిగవార నంతనుం
డి న్నెల సన్నగిల్లు; నది నిక్కము గాదనిరేని యా పదా
ర్వన్నె పసిండి మేడలకు రాబనియే మిట సౌధనామముల్?
(ప్ర.ఆ.ప-72)

ఇంద్రప్రస్థపురంలోని బంగారుమేడలను సౌధములని పిలవాడినికి కారణం. ఆకాశాన్ని తాకుతున్న ఏమోన్నంత ఎత్తైన మేడల శిఖరాలు చంద్రునికి గుచ్చుకొని ఆ చంద్రునిలోని సుధంతా వీటి మీద చింది బంగారం వెండిగా కనిపించి సౌధములు అనే పేరొచ్చిందేమో అంటాడు కవి. సుధ అనే పదానికి అమృతం, సున్నం అని అర్థాలున్నాయి. సున్నంతో చేసిన వాటికి సౌధములని పేరు. వర్ణనలో అతిశయోక్తితో బాటు, ఉత్ప్రేక్ష ఉంది.

నలిన లీల సంచు నలినలి గావించు,
నించుమించు లాడు నించు మించు
లేమ నగువుజూపు లేమన నగు, బాపు:
జగ మెరుంగు దాని జగ మెరుంగు. (ప్ర.ఆ.ప-101)

లేమ నవ్వు చూపులు పద్మాల సౌందర్యానికి నలినలి (నజ్జు నజ్జు) చేస్తాయి. అంతేకాదు మెరుపు తళుకును తిరస్కరిస్తుంది. ఆమె జగముల మెరుపు జగానికి తెలిసిందే! నలినలి ఇంచుమించు జగమెరుంగు బాపురే! వంటి పలుకుబళ్లతో యమకానికి సౌందర్యాన్ని పెంచాడు కవి.

అర చంద మామ నేలిన
దొరగా నెన్నుదురు నె న్నుదురు బిత్తరికిన్
బరువంపు మొల్ల మొగ్గల
దొరగా బల్కుదురు బ ల్కుదురు జవ్వనికిన్ (ద్వి.ఆ.ప--78)

సుభద్ర నెన్నుదురు (నెరి+నుదురు-అందమైన నుదురు) అర చందమామను గెలిచిన దొరగా ఉండుట. ఆమె అందమయిన పల్కుదురు (దంతముల పొందిక) మల్లె మొగ్గల లాగున్నందని పలుకుతారట. నెన్నుదురు, పల్కుదురు అనే మాటలల్లోని శ్లేషలో యమక సౌందర్యాన్ని రెట్టింపు చేశాడు వేంకటకవి.

ప్రాయపు నాయకుల్ వెల నెపాన నెగాదిగ జూడ, "నేర్పు లౌ
రా యివి దండ మీద గొసరం దొరకొంటిరి, మంచి సాములే
పో, యటులైనచో సరసముల్ గద మీకిపు" డంచు సప్పురిన్
కాయజు తూపు లమ్ముదురు కందువ మాటల బుష్పలావికల్
(ప్ర.ఆ.ప-79)

ఇంద్రప్రస్థపురంలో పుష్పలావికలు (పూలమ్మే అమ్మాయిలు) పూలు కొనే నెపంతో తమ దగ్గరకు వచ్చిన యువకులు పూల వంకతో తమని చూస్తూ తమ శరీరాలకు వెల కడ్తూ బేరమాడుతుంటే రెండర్థాల మాటలతో కాయజుతూపులన్ (పువ్వులను) అమ్ముతున్నారట.

పరిపరి మంచి దండలన్న తీసుకున్నారు పైగా ఇంకో దండను కొసరు అడుగుతున్నారు. మంచి వాళ్లేపో అన్నది పైకి కనిపించే అర్థం.

కౌగిలికి ఇవ్వాల్సిన పైకం గురించి కొసరి కొసరి బేరమాడు తున్నారు. మేమిచ్చే ఆనందం కూడ మీ సరసానికి తగ్గట్లే ఉంటుంది. నర్మగర్భంగా చెప్పుతున్నారు.

సరసము= చౌక, శృంగారం, కాయజుతూపు= మన్మథుని చూపు, పువ్వులు, నేర్పు= గడుసుదనం, ఏర్పు= ఎన్నిక మొదలైన పద శ్లేషతో పద్యంలో చమత్కారాన్ని సాధించాడు కవి. విజయవిలాసంలోని ఎన్నో పద్యాలు ఈ శ్లేషతో పఠితల హృదయాలను అలరిస్తాయి.

ఉదా : మామకాగమన వార్త (మామకున్ + ఆగమన వార్త- మామ+కాగ+మన+వార్త -మామకు+ఆ+గమనవార్త (ప్ర. ఆ.ప-217), మనసుభద్రమయ్యె=మన+సుభద్ర -మనసుభద్రం (తృ.ఆ. ప-88) జడ యందము జూప పాప జగతిం గలదే పాప అనే పదానికి వర్ణించడం. పాప జగతి అన్నప్పుడు పాముల జగతి అని అర్థం. జడకు సాటి పాము రాదు అని శ్లేషార్థం.

పురాణం ఆధారంగా చమత్కారం:

పెల్లు సెగ జల్లు విస మా
తెల్లని దొర కుతిక మోవ దిని బ్రతుకుట నీ
చల్లదమ్మున గాదే?
కల్లోలవతీ మతల్లి గంగమ తల్లీ. (ప్ర.ఆ.ప-115)

అర్జునుడు గంగను ఇలా ప్రశంసిస్తున్నాడు. శివుడు అగ్ని జ్వాలలు ఎగజిమ్మే విషం తిని కూడ బతికునాడంటే తల మీదున్న నీ చలువ వల్లె కదా! అని గంగను ప్రశంసిస్తున్నాడు.పురాణ ప్రసిద్ధమైన ఈ విషయాన్ని చమత్కరించడంలో కవి ప్రతిభ కొనియాడదగింది.

ఇతిహాసం ఆధారంగా చమత్కారం:

హరిపతి నడుమున కోడెన్
గరువపు నడకలకు నోడె గజపతి యిక నీ
నరపతి లోనగు టరుదే
వరవర్ణిని మెరుగు వాడి వాల్చూపులకున్ (ద్వి.ఆ.ప-17)

ఈ పద్యంలో చిత్రాంగద సౌందర్యాన్ని వర్ణించాడు కవి. బలానికి పరాక్రమానికి పేరుపొందిన ఏనుగూ, సింహాలే ఓడినప్పుడు (ఓడు అనే పదానికి పారిపోవడం అనే అర్థం ఉంది) మానవ పతియైన అర్జునుడెంత అంటూ చమత్కరించాడు కవి. నడుము సౌందర్యానికి సింహం, నడక ఠీవికి ఏనుగు ప్రసిద్ధం కదా! ఆమె వాల్చూపుల సోయగానికి అర్జునుడు ఓడటంలో ఆశ్చర్యమేముంది.

హరి అంటే అశ్వం –

అశ్వపతులంటే బహుమనీ రాజులు
గజపతులంటే ఉత్కళ దేశపు రాజులు
నరపతులంటే విజయనగర రాజులు

ఆమె సౌందర్యం ముందు ఓడిన సింహం, గజం అడవులకు పారిపోతే నడువరి దొరికిన నరపతిని ఆమె స్వాధీనం చేసుకుంది.

ఒక్కోసారి సన్నివేశానుగుణంగా చాల అలవోకగా చమత్కారాన్ని పండిస్తాడు చేమకూర.

వేయు గన్నుల వలయుబో వీరి జూడ
నని కవుల్ దంపతుల చెల్వు వినుతి చేయ;
గాదు పదివేల కన్నులు గావలె నని
చూచు చుండె సహస్రవిలోచనుండు. (తృ.ఆ.ప–108)

పెళ్లి పీటల మీద కూర్చున్న సుభద్రార్జునుల సౌందర్యాన్ని చూడటానికి అని కవులు పొగడ్తా ఉంటే అక్కడే ఉండి కొడుకు సింహాన్ని తన వేయి కన్నులలో చూస్తున్న ఇంద్రుడు కాదు పదివేల కన్నులు కావాలి అన్నట్లున్నాడట. రెండు కళ్లున్న వాళ్లకు వేయి కన్నులు అవసరం. వేయి కళ్లున్న వాళ్లకు పదివేల కన్నులు కావాలి అనడమే ఇక్కడి చమత్కారం.

చేమకూర వేంకటకవి 669 పద్యాలతో 'విజయవిలాసం' రచించాడు. ప్రతి పద్య చమత్కృతి తన కావ్య లక్షణమని గర్వంగా చెప్పుకున్నాడు. రేఖా మాత్రంగా ఎత్తి చూపడమే నా వ్యాసోద్దేశం.

'శక్తిర్నిపుణతా లోక శాస్త్ర కావ్యాద్యవేక్షణాత్' అని మమ్మటుడు చెప్పిన కవి లక్షణాలకు లక్ష్యమైన కవి చేమకూర. అపారమైన లోకజ్ఞతతో, ఔరా! అనిపించే భావనా బలంతో, అసాధారణమైన భాషా పటిమతో అపూర్వ రీతిలో చమత్కారాన్ని సాధించి, చదువరుల హృదయాలను రస ప్లావితం చేసిన విద్వత్కవి, చమత్కారనిధి చేమకూర వేంకట కవి.

కవి పరిచయం: చేమకూర వేంకటకవి 17వ శతాబ్దంలో తంజావూరును పాలించిన రఘునాథనాయకుని ఆస్థానకవి.

రచనలు: మొదటిది సారంధర చరిత్ర దీని ఆధారం గౌరన నవనాథ చరిత్ర. రెండవది విజయవిలాసం దీనికి ఆధారం మహాభారతం. విజయుడన్నది అర్జునుని దశ నామాలలో (అర్జున, ఫల్గుణ, పార్థ, కిరీటి, శ్వేతవాహన, భీభత్స, విజయ, కృష్ణ, సవ్యసాచి, ధనంజయ). విజయుని శృంగార విలాసమే విజయవిలాసం.

కథా నేపథ్యం: ఆపదలో ఉన్న తన గోవును రక్షించమని ఓ బ్రాహ్మణుడు కోరగా సరేనని అభయమిస్తాడు అర్జునుడు. కానీ ఆ సమయంలో అతని ఆయుధాలు ఆయుధాగారంలో ఉంటాయి. ఆయుధాగారం ద్రౌపది ధర్మరాజుల శయన మందిరాన్ని



అనుకొని ఉంటుంది. గత్యంతరం లేని పరిస్థితిలో నియమం తప్పి వారి ఏకాంతానికి భంగం కలిగించి ఆయుధాలను తెచ్చుకుంటాడు పార్థుడు. (ద్రౌపది ఒక భర్తతో ఉన్నప్పుడు మరొక భర్త చూడరాదన్నది నియమం. ఏ కారణం వల్లనైనా నియమ భంగం కలిగితే అందుకు కారణమైన వాళ్లు సంవత్సరం పాటు భూప్రదక్షిణ చేయాలి) కట్టడికి తలవంచి, ఆపద్ధర్మంలో తప్పులేదని ధర్మరాజదులు వారిస్తున్నా వినకుండా భూప్రదక్షిణకు బయలు దేరుతాడు కిరీటి. ఆ సమయంలో ఎన్నో తీర్థాలలో మునిగి పుణ్యాన్ని సంపాదించడంతో పురుషార్థంగా ముగ్గురు ముదితలను వివాహం చేసుకుంటాడు.

కావ్య పరిచయం: మూడు ఆశ్వాసాల ఈ ప్రబంధ కావ్యంలో నాయకుడు విజయుడు. ఈయన మూడు లోకాలకు (స్వర్గ మర్త్య, పాతాళ) చెందిన, మూడు యవ్వనావస్థలలో (ముగ్ధ, మధ్య, ప్రౌఢ) ఉన్న ముగ్గురు ముదితలు (చిత్రాంగద, సుభద్ర, ఉలూచి) మూడు వివాహ పద్ధతుల్లో పెండ్లాడి వారి ద్వారా బభ్రువాహన, అభిమన్యు, ఇలావంతులని పుత్రులను పొందుతాడు.

ఈ కావ్యంలో అంగిరసం శృంగారం. శృంగార కావ్యాలు తెలుగుకు కొత్తేమి కాదు. ప్రబంధ దక్షిణాంధ్ర యుగాలలో వీటి సంఖ్య మరింత పెరిగింది. అయితే వాటన్నింటిలో విశిష్టమూ, విలక్షణమూ అయిన శృంగార రసరాజ కావ్యం విజయవిలాసం.

❖ ❖ ❖ ❖ ❖

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 9 (24) హైదరాబాద్ జులై : 2025

భూతం ముత్యాలు 'దుగిలి' కవిత్వం – దళిత స్పృహ, బహుజన దృక్కోణం

రామా రత్నమాల, సహాయ ఆచార్యులు, తెలుగు విభాగం, పింగళి ప్రభుత్వ మహిళా కళాశాల, హన్మకొండ,
ఫోన్ : 9885700062

భారతీయ సమాజంలో 'దళిత' అనే పదం శతాబ్దాలుగా అణచివేయబడిన, సామాజికంగా వెనుకబడిన సముదాయాలను సూచించే ఒక ముఖ్యమైన భావన. ఈ పదం సంస్కృతంలోని "దల్" అనే మూల పదం నుండి వచ్చింది. దీనికి "అణచివేయబడిన" అని అర్థం ఉంది.

'దళితము' అనే పదానికి ఖండింపబడినది, భేదింపబడినది, వికసించినది అనే అర్థాలు నిఘంటువులో ఉన్నాయి. (శబ్ద రత్నాకరము, బి. సీతారామాచార్యులు, 2018 పుట: 762)

"కుల వ్యవస్థలో అస్పృశ్యతకు గురైన, అణచివేయబడిన లేదా సామాజికంగా వెనుకబడిన సమూహాలను సూచించు పదము. ఆధునిక సందర్భములో ఈ పదము సామాజిక న్యాయము కొరకు పోరాడే సముదాయాల స్వీయ-గుర్తింపును సూచిస్తుంది." (శ్రీ వెంకటేశ్వర తెలుగు నిఘంటువు. (2008). హైదరాబాద్: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, పేజీ 542)

సమాజములో కుల వ్యవస్థ ద్వారా అణగదొక్కబడిన, అస్పృశ్యులుగా పరిగణించబడిన సముదాయములను సూచించు పదము. దళిత ఉద్యమములలో ఈ పదము స్వాభిమానము మరియు సామాజిక సమానత్వము కొరకు పోరాటమును సూచిస్తుంది.

19వ శతాబ్దంలో జ్యోతిబా పూలే, డా. బి.ఆర్. అంబేద్కర్ వంటి సంఘసంస్కర్తలు ఈ పదాన్ని కుల వ్యవస్థలో అణగదొక్కబడిన సమూహాల స్వీయ-గుర్తింపును బలోపేతం చేయడానికి ఉపయోగించారు. దళితులు సాంప్రదాయకంగా "అస్పృశ్యులు"గా పరిగణించబడ్డారు, వీరు కుల వ్యవస్థలో అత్యంత దిగువ స్థాయిలో ఉండేవారు. అంబేద్కర్ రచనలలో, ఈ పదం కేవలం ఒక సామాజిక వర్గాన్ని సూచించడమే కాకుండా, వారి హక్కుల కోసం పోరాడటం మరియు సామాజిక న్యాయాన్ని కోరే ఆకాంక్షను కూడా ప్రతిబింబిస్తుంది. ఆధునిక సందర్భంలో, "దళిత" అనే పదం రాజకీయ, సామాజిక, సాహిత్య ఉద్యమాలలో విస్తృతంగా ఉపయోగించబడుతుంది, ఇది అణగారిన సముదాయాల గుర్తింపును స్థాపించడంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. 1970లలో దళిత పాంథర్ ఉద్యమం ఈ పదాన్ని ఒక రాజకీయ శక్తిగా మార్చింది, దీనిలో సామాజిక అసమానతలకు వ్యతిరేకంగా ఉద్యమించే సామర్థ్యం ఉంది. ఈ పదం ఇప్పటికీ కొంత వివాదాస్పదంగా ఉంది. ఎందుకంటే కొందరు దీనిని అవమానకరంగా భావిస్తారు, మరికొందరు దీనిని స్వాభిమానం మరియు పోరాటగుర్తుగా చూస్తారు. భారత రాజ్యాంగం దళితులను "షెడ్యూల్డ్ కులాలు"గా వర్గీకరించినప్పటికీ, "దళిత" అనే పదం వారి సామాజిక, సాంస్కృతిక గుర్తింపును మరింత లోతుగా సూచిస్తుంది. మొదట్లో దళితులు, బహుజనులు అని విడివిడిగా వాడేవారు. ఇప్పుడు బహుజనులు అనే పదం విస్తృతమైన అర్థంలో వాడుతున్నారు.

బహుజన దృక్కోణం అనేది సమాజంలోని అణగారిన, వెనుకబడిన, మరియు ఆర్థికంగా, సామాజికంగా బలహీన వర్గాల దృష్టికోణాన్ని ప్రతిబింబించే ఒక సామాజిక, రాజకీయ భావజాలం. ఈ దృక్కోణం ప్రధానంగా డా. బి.ఆర్. అంబేద్కర్, జ్యోతిరావు పూలే, లేదా కాన్షీరామ్ వంటి నాయకుల ఆలోచనల నుండి ఉద్భవించింది, ఇది దళితులు, ఆదివాసీలు, ఇతర వెనుకబడిన తరగతులు మరియు మైనారిటీల హక్కులు, సాధికారత, మరియు సమానత్వంపై దృష్టి సారిస్తుంది. ఈ దృక్కోణం కుల వ్యవస్థ, సామాజిక అసమానలకు వ్యతిరేకంగా పోరాటాన్ని ప్రోత్సహిస్తుంది. బహుజనుల సాంస్కృతిక, చారిత్రక గుర్తింపును పునరుద్ధరించడానికి కృషి చేస్తుంది. ఇది సమాజంలోని బహుసంఖ్యాక వర్గాల ఆకాంక్షలను, అవసరాలను కేంద్రీకరించి, వారి స్వరాన్ని బలోపేతం చేయడానికి ప్రయత్నిస్తుంది. ఈ దృక్కోణం రాజకీయ, విద్యా, మరియు సామాజిక రంగాలలో బహుజనులకు ప్రాతినిధ్యం మరియు అవకాశాలను కల్పించడంపై దృష్టి పెడుతుంది. బహుజన రాజకీయ ఉద్యమాలు ఈ భావజాలాన్ని రాజకీయ శక్తిగా మార్చి, అణగారిన వర్గాలకు అధికారం మరియు స్వాతంత్ర్యం సాధించేందుకు పనిచేస్తాయి. బహుజన దృక్కోణం సాహిత్యం, కళ, మరియు సాంస్కృతిక ఉత్పత్తుల ద్వారా కూడా వ్యక్తమవుతుంది, ఇది అణగారిన వర్గాల చరిత్రను, పోరాటాలను, మరియు విజయాలను ఉద్ఘాటిస్తుంది. ఈ దృక్కోణం సమాజంలో సమగ్రమైన మార్పును లక్ష్యంగా చేసుకుని, అసమానతలను తొలగించి, న్యాయభావనతో కూడిన సమాజాన్ని నిర్మించడానికి కృషి చేస్తుంది.

నేటి ఆధునిక కాలంలో దళిత స్పృహతో బహుజన తాత్వికతతో కవిత్వం, కథ, నవల, నాటకం, వ్యాసం, స్వీయచరిత్ర వంటి సృజనాత్మక ప్రక్రియల్లో తనదైన ప్రత్యేక ముద్ర వేసిన వారిలో 'భూతం ముత్యాలు' ఒకరు. నవలాకారునిగా ఎక్కువ గుర్తింపు పొందారు. భూతం ముత్యాలు నల్లగొండజిల్లా, నాంపల్లి మండలం, తిరుమలగిరి గ్రామంలో 10 జూన్ 1971 లో జన్మించారు. 'జాతిరత్నం'

అనే బాలల గేయంతో సాహితీ ప్రపంచానికి పరిచయం అయ్యారు. వీరి మొదటి కవితా సంపుటి 'దుగిలిలి. దీనిని 2003 లో ప్రచురించారు. ఈ కవితా సంపుటిలోని గొంతు, బర్రె కవితలు ఆంగ్లంలోకి అనువదించబడ్డాయి.

భూతం ముత్యాలు 'దుగిలి'– కవిత్వంలో ప్రధానంగా దళితులపై జరుగుతున్న దాడులు, ప్రజాస్వామ్యయుతంగా, రాజ్యాంగబద్ధంగా సాధించుకోవాల్సిన హక్కులు, బహుజనుల అండతో రాజ్యాధికారం దిశగా చేయాల్సిన కృషిని, బాధ్యతల్ని గురించి వివరించారు. ప్రస్తుతం 'భూతం ముత్యాలు కవిత్వం – దళిత స్పృహ, బహుజన దృక్కోణం' గురించి చెప్పటం ఈ వ్యాసం యొక్క ప్రధాన ఉద్దేశ్యం..

భూతం ముత్యాలు నిరుపేద దళిత కుటుంబంలో పుట్టిన వ్యక్తి. తన మూలాల్లోకి తొంగి చూసుకుంటూ తన దళిత అస్తిత్వాన్ని గుర్తుచేసుకుంటున్నారు. తాత ముత్తాతల వారసత్వపు కులవృత్తిని నెమరు వేసుకుంటూ తనకు, తనజాతికి జరిగిన అన్యాయాల్నీ తెలుసుకొని అందుకు కారకులైన వారిని, వారి శాస్త్రాల్ని తిరస్కరిస్తున్నారు.

"సచ్చిన జీవాల తోలు దీసి, రెక్కలల్వంగ
తంగెడ్సెక్క దెచ్చి, నర్కి, సర్సి, తాల్చి పోతంజేసి
తోల్కు, తంగడ్పురం, సున్నం కల్పి లందల నానేసి
ఊని, తోలు సెల్లగొట్టి పారనూకి ఆరబెట్టి
ఆరెగీసి, అచ్చోసి కోసి
నీ పాదాన్కి మాదిగ బత్కుని నైసుగ
కిర్రు చెప్పు జేశ్న ఆదిశాస్త్రజ్ఞులం మేమే కదూ
నీ పుక్కిటి శాస్త్రాల్ని తగలేస్తూ...

చరిత్ర పుటల్ని తిరగేస్తూ నిజాల్ని ప్రకటిస్తున్నా..." (పోతం, పుట. 14)

మాదిగ బతుకులు, వారి వృత్తి జీవితం ఎలా వుంటుందో తెలియజేస్తున్నారు. అందమైన కిర్రు చెప్పులు తయారు చేసిన ఆది శాస్త్రవేత్తలు మాదిగలే అని ప్రకటిస్తున్నారు. చెప్పులు తయారు చేయడానికి మాదిగలు ఏయే పనులు చేస్తారో వివరిస్తారు. చని పోయిన జీవాల్ని తీసుకొచ్చి వాటి తోలును ఒలువడం గురించి చెబుతారు. తంగేడు చెక్కను తీసుకురావడం దగ్గరనుండి వాటిని పోతం చేయడం గురించి, సున్నంతో కలిపి లందలో నానబెట్టడం గురించి, చివరికి చెప్పులకు సరైన అచ్చుగీయుడం గురించి యిలా చాలా వివరంగా తెలుపుతూనే వారి రెక్కల కష్టం గురించి విన్నవిస్తారు.

"దళిత జీవనానికి, వాస్తవికతకు దగ్గరగా, చైతన్యవంతంగా వర్ణించబడిన సాహిత్యం దళిత సాహిత్యం. అవుతుంది. దళితుల అభివృద్ధి, అభ్యున్నతి కొరకు ఎవరురాసినా అది దళిత 'ఉదారభావం' గా, దళితులే తమ సమస్యలకు స్పందించి రాస్తే అది 'ఆత్మానుభూతి 'కవిత్వం' అవుతుంది" (శిఖామణి కవిత్వం సమగ్ర పరిశీలన – డా. మంథని శంకరయ్య, పుట.283)

దొరల దగ్గర బానిస బతుకు బతికి, చతుర్వర్ణ వ్యవస్థను మోసీ మోసీ పంచములుగా మారినామని చెబుతారు. ఊరికి దూరంగా వెలి వేయడం వలన

అంటరానివారుగా చూసిన, చూస్తున్న విధానాన్ని వివరిస్తారు. నిచ్చెనమెట్ల కులవ్యవస్థలో ఉరిమి ఉరిమి చూసే, ఎరువు ఎక్కిన కనుగుడ్లకు, మెలేసిన కోరమీసాలకు జడుసుకున్న చరిత్రను విశ్లేషిస్తారు. తన జాతిని, కులాన్ని హీనంగా చూసిన వారిని మనువాదులుగానూ, నియంతల వారసులుగానూ సంభోదిస్తారు. వేదసారం తెలిపిన వ్యాసుడు, రామాయణం రాసిన వాల్మీకీ ఎవరు అని ప్రశ్నిస్తారు. చరిత్ర పుటల్లో దాగిన నిజాలను దాచలేరని హెచ్చరిస్తారు. చీకటి మనువాద సామ్రాజ్యాల్ని కూల్చి వేసి, వారు ఆక్రమించిన అధికార పీఠాల్ని కైవసం చేసుకుంటానికి వేకువ పొద్దుగా మారి మెల్లగా మొదలవుతూ వస్తున్నానని దళితుల రాజ్యాధికార భావనను గురించి మాట్లాడుతారు. దళితుడిగా పుట్టిన కవి తన సమస్యల్ని, అందుకు కారకులైన వారిని గురించి, తమపై రుద్దబడిన ఆంక్షల గురించి వివరంగా కవిత్వమై పలవరిస్తారు.

" .. నావొంటి సెప్టను
కుతితో కుతికెల్లాక తాగి కారుకూతలు కూసినా
నీ కెదురైప్పక మూత్కి సెయ్యడం పెట్కోని
నువ్వు జెప్పినట్టల్లా ముద్దాడిస్తూ
నీ ఎనకాల కుక్కోతె తిర్గితి
నీ కాలి కింది సెప్పై నలిగితి
నీ కాళ్ళు పట్టి, ఒళ్లు ఒత్తి నిమ్మలంగ నిద్రపుచ్చి
నీ ఇంటి పిండారబోస్న ఎన్నెలైతి
జున్నుగడ్డలు తినిపిచ్చి, ఒళ్ళు బలిపిస్తి
ఎన్న రవ్వ తాపి వొన్నెదెప్పిస్తే గిన్ని జేస్తే
నన్నింక అంటరానోడంటావ్

కంద కావురమెక్కి ఒళ్ళు కొవ్వెక్కి
నన్నింక బాంచన్, కాళ్ళకింద నల్వజుస్తావ్
నీ యవ్వరే... నా అంటు నీ కంటగద్తా..." (అంటుగద్తా, పుట 29)

ఆగ్రహం కట్టలు తెంచుకున్నప్పుడు – 'భాష' తన స్వభావాన్ని మార్చుకుంటున్న తీరును కవితలో గమనించవచ్చు. బానిస లెక్క పనులు చేయించుకొని అంటరానివాడంటున్నప్పుడు సహనం కోల్పోయిన తీరు కండ్లకు కట్టినట్టు చెప్పిన విధానం కనిపిస్తుంది. శ్రమదోపిడి, బానిసత్వం, దొరతనం గురించి మాట్లాడుతూనే కవి వాటిని ఎదిరించి పోరాడటం గురించి, ఆత్మాభిమానాన్ని కాపాడుకోవడం గురించి ధిక్కరించిన తీరును తేటతెల్లం చేసి చెబుతారు. కండకావరం, ఒళ్ళు కొవ్వెన్నడం నీ యవ్వరే, వంటి పదాలు ఆగ్రహ, ధిక్కార ప్రకటనలకు ప్రతీకలుగా కని వాడినట్లు తెలుస్తుంది. కాళ్లు పట్టడం, ఒళ్లు ఒత్తడం, నిద్రపుచ్చడం జున్నుగడ్డలు తినిపించడం, ఎన్న రవ్వ తాపించడం వంటివి బానిసత్వపు శ్రమదోపిడిని ప్రతిబింబించడంగా చూడవచ్చును. 'భాష' తిట్టుగా రూపాంతరం చెందే క్రమం పరిశీలించినపుడు అనైతిక చర్చలను తట్టుకోని తనం నుండి పుట్టినాయని అర్థం చేసుకోవచ్చు.

"ఆగ్రహాన్ని వ్యక్తీకరించే పద్ధతులెన్నో వుంటాయి. కోపాన్ని హింసాత్మకంగా వ్యక్తీకరించటం ఒకరూపం. కానీ అదేకోపాన్ని తిట్టు రూపంలో వ్యక్తీకరించటం మరో రూపం. ఒక మనిషికి కోపం ఎందుకొస్తుంది, తనకు అన్యాయం జరిగిందని ఎరుక కలిగినప్పుడు. ఆ ఎరుకలేని స్థితిలో కూడా కోపం వస్తుంది. అది సహజాతం. కాని తనకు లేదా తన సమాజానికి అన్యాయం జరిగిందని గ్రహించే చైతన్యం వ్యక్తిలో వచ్చినప్పుడు, ఆ చైతన్యాన్ని వ్యక్తం చేసే సమయం సందర్భం (స్థలకాలాలు) అనుసరించి ఆ కోపం యొక్క తీవ్రత ఆధారపడి వుంటుంది. ఆ తీవ్రత పెరిగినప్పుడు దాని వ్యక్తం చేసే పదాలను లేదా సంజ్ఞలను వక్త లేదా కవి వెతుక్కుంటాడు. ఆ ఆగ్రహ తీవ్రతను బరువును మోయగలిగే సంస్కారవంతమైన పదాలు లేదా సంజ్ఞలు సాధారణంగా దొరకవు. అలాంటి స్థితిలో తన సాంస్కృతిక నేపథ్యం నుండి బూతులను ఎంపికచేసుకుంటాడు" (జిలుకర శ్రీనివాస్, 'దళిత కవిత్వానికి తిట్టు అంతిమలక్ష్యం కాదు!', విరుద్ధ, పుట. 152)

కవి వాడిన భాషను ధర్మాగ్రహంగానే చూడాలి. తిట్టు పదాలుగా చూడవద్దు. సహజంగా, స్వభావసిద్ధంగా, అకారణంగా తిట్టు పదాలను వాడినట్లు అనిపించడం లేదు. తమ శ్రమను దోచుకొని, అంటరాని వారిగా చూస్తున్న అగ్రవర్ణాలపై దళితుల ఆగ్రహంగా, ఆక్రోశంగా వెల్లగక్కిన భావవ్యక్తీకరణగా మాత్రమే చూడాలి. బానిసలుగా చూడటం, శ్రమ దోపిడీ చేయడం, కులం ఆధారంగా అంటరానితనం అంటగట్టి అవమానించడం ఎంత అనైతికమో కవి చెబుతున్నట్టుగా భావించాలి. పీడితుల పక్షాన నిలబడి మాట్లాడటం న్యాయం . కాబట్టి కవి వాడిన భాష అనైతికం కాదని చెప్పవచ్చు. ఆగ్రహావేశాలు ఆకలి, అవమా నాల నుంచి పుట్టుకొని వస్తాయని, ఎదురించి పోరాడటం వల్ల బానిసత్వం నుంచి విముక్తం కాగలరని కవి సందేశం ఇస్తున్నారు.

"గీ నొష్టిన గా బెమ్మడు రాసెనో
గీ బాపడు గీసెనో గాని
నీలాగే నాకో అంటరాని కులవృత్తి అంటగట్టి
నానోట్లె మట్టి గొట్టె గదనే... నిజాలెన్నడు గుర్తిస్తవ్..
గీ కులం మాయి ఎన్నడిడుస్తవ్
ఇద్దరం గలిస్తామంటే గద్దె మనదే..." (గొంగడి, పుట: 36,37)

బి.సీ.లను అందులోనూ గొంగడి భుజాన వేసుకునిదిరిగే సూదరన్నా అని నిర్దిష్టంగా సంభోదిస్తూ ఎస్.సి లవలె నిచ్చెనమెట్ల చతుర్వర్ణం శూద్రులుగా చేసిన చరిత్రను కండ్ల ముందుంచుతారు. అగ్రవర్ణాలు ఇద్దరినీ (B-C, S·C) పాదాల నుంచే పుట్టించినారనే విషయాన్ని ప్రస్తావిస్తూ పుట్టు బ్రాహ్మణుల లెక్క 'అంటరాని వాడివని' ఎగతాళి చేస్తున్న తీరుకు, **"నన్ను సూత్తె అట్టావాకరిచ్చి కాంద్రిత్తవేందే'** అని సున్నితంగా మందలించడం ఈ కవితలో కనిపిస్తుంది.

"ఏ ఉద్యమానికైనా కొన్ని లక్ష్యాలు నిర్ధేశించబడి వుంటాయి. లక్ష్యనిర్దేశం లేకుండా ఏ ఉద్యమం మనుగడ సాగించలేదు. సాహిత్య ఉద్యమంలో కూడా ప్రతీ వాదానికి కొన్ని లక్ష్యాలు ఉంటాయి. అందులో భాగంగానే దళిత వాదానికి కూడా కొన్ని లక్ష్యాలున్నాయి. వాటిలో ప్రధానమైనవి– ఆత్మాభిమానాన్ని ప్రకటించుకోవడం, వర్ణాధిపత్యాన్ని ప్రశ్నించడం, ఆత్మ గౌరవాన్ని కాపాడుకోవ దం, సామాజిక అసమానతల్ని నిరసించడం, దళిత కళా తత్వాన్ని కాపాడుకోవడం, పశ్చాత్తాప నివేదన" (శిఖామణి కవిత్వం– తమ ఆలోచన, డా. నెమిలేటి కిట్టన్న, పుట. 206)

అగ్రవర్ణాలకూ లోకువై, తోటి వృత్తికులకారుల చేత కూడా తక్కువగా, నీచంగా చూడబడుతున్న సమాజ రీతిని ఈ కవిత ద్వారా కవి భూతం ముత్యాలు తెలియపరుస్తారు. వేదికల మీద దళితుడినేనని చెప్పి, ఊరిలో మాత్రం వితండవాదం చేస్తున్న బిసీల ద్వంద్వనీతిని గురించి కవి మాట్లాడుతారు. నిజం తెలుసుకోమని చెప్పటం కనిపిస్తుంది. కుల అడ్డుగోడలు కట్టి, కయ్యం బెట్టిన వారిని ముందుగా గుర్తించమని చెబుతారు. అగ్రవర్ణాల వారికి వంత పాడటం అంత మంచిది కాదని కవి హెచ్చరిస్తారు. కులం మాయిని విడిచి పెట్టమని అభ్యర్థించటం కనిపిస్తుంది. ఇద్దరి రాతలు బాహ్మణులు రాసినారో, బహ్మ రాసినాడో గానీ చెరో కులవృత్తిని అంటగట్టారనే విషయం తేటతెల్లం చేస్తారు. అంతిమంగా బి.సీ లు,

ఎస్. సి లు కలిస్తేనే అగ్రవర్ణాల నుంచి రాజకీయాధికార బదిలీ సాధ్య మవుతుందనే విషయాన్ని నిర్ధారిస్తారు. అందుకు 'కులం' విడిచి రమ్మనే సందేశాన్ని కవిత ద్వారా తెలియపరుస్తారు.

"కాటెక్కిన కులకుండను కపిష్కుతో దోకి దోకి
మందినంత పోగేసి మనువాదం తగలేసి
ఛోదించి, సమీకరించి పోరుబాటను సూపిన
కలియుగ దళిత ప్రవక్త అంబేద్కర్" (ఎల్లురేఖ, పుట. 10,11)

''ఎల్లురేఖ' కవితలో అంబేద్కర్ను పీడిత, తాడిత బడుగు జీవుల పెన్నిధిగా, కడు బీదల, నిరుపేదల కరుణానిధిగా వర్ణిస్తారు. కవికి బాబాసాహెబ్ మోదుగు పువ్వుగా, ఎలుగురేఖగా, కలియుగ దళిత ప్రవక్తగా, నిమ్నజాతి స్వేచ్ఛా పిపాసిగా, దళిత సూర్యుడిగా, చైతన్యామృత కలశంగా కనిపిస్తారు. తరం తంతెల అగ్రవర్ణ కులం మాయను వెల్లగక్కి వెలివేసిన వ్యక్తిగా, దాస్యం నుంచి మోదు బారిన బీడుబతుకులను విముక్తులను చేసిన వ్యక్తిగా బాబాసాహెబ్ అంబేద్కర్ను కీర్తిస్తారు. ఆదినుంచి అంటరానివారిగా, ఊరికి దూరంగా తరిమేసి, ఎదురు తిరుగాలంటే భయపడిన బానిస బతుకులతో అల్లాడినవారికిబీ దిక్కుదాపు లేక అల్లాడిన వారికి, విగతజీవుల చెదిరిన బతుకులలోంచి ఇగురించిన వెలుగురేఖనే మా భారతరత్న అంబేద్కర్ అని వేన్నోళ్ల కొనియాడుతారు.

"ఈ దేశంలో దళిత బహుజనులకు రోజువారి జీవితంలో ఎదురయ్యే సమస్యలను కుల వైరుధ్యాల వెలుగులో అర్థం చేసుకొని పోరాట పటిమతో ముందుకు నడవడమే అంబేద్కరిజం. ఈనాటి తెలుగు దళిత కవిత్వాన్ని అర్థం చేసుకోవడానికి అంబేద్కరిస్టు అవగాహన అనివార్యమైంది. కులమంటే అదొక సాంఘిక విషయంగా కాక రాజకీయ, ఆర్థిక, సాంఘీక, సాంస్కృతిక వ్యవస్థలను నియంత్రించే శక్తిగా దాన్ని చూస్తున్నారు. దళిత కవులు, ఈ నేపథ్యంలోనే నేటి దళిత కవిత్వాన్ని విశ్లేషించుకోవలసి ఉంది" (ఒక దశాబ్దాన్ని కుదిపేసిన దళిత కవిత్వం, డాక్టర్ ప్రసాదమూర్తి, పుట. 106)

అద్భుతమైన జ్ఞానాన్ని సొంతం చేసుకున్నారని, విశ్వాంతరాలను నెమరేసిన విదుషీమణి అని, 'వెట్టి' అనే దురాచారాన్ని నిర్మూలించ డానికి 'కులం' అనే తుట్టెను కూల్చివేసారని, నిమ్నజాతుల స్వేచ్ఛ కోసం అహర్నిశలు పరితపించారని, దళితుల అభ్యున్నతి కోసం తన జీవితాన్ని త్యాగం చేసారనే విషయాల్ని ఖండాంతరాలు దాటేలా, దిక్కులు పిక్కటిల్లేలా కవి తన గొంతును ప్రపంచానికి వినిపిస్తారు. అడుగంటిన వర్గాల్లో చైతన్య దీప్తిని రగిలించడం గురించి, మనువాదుల గుండెల్లో కంటకమై నిలువడం గురించి, కడ వరకూ కడజాతిని మేలుకోరిన అంబేద్కర్ను తలుచుకుంటూ, తన ఆశయాలను, తన గమ్యాన్ని సాధించడమే అంతిమ ధ్యేయమని తన సందేశాన్ని కవి వినిపిస్తారు. ఇప్పటి యువతరానికి అంబేద్కర్ మార్గమే సరైన దిశను, చైతన్యాన్ని కలిగిస్తుందని బలంగా కవి నమ్ముతారు. అంబేద్కరిస్టిక్ ఐడియాలజీని ఆదర్శంగా తీసుకోవాలని ఉద్బోధిస్తారు.

"సొతంత్ర భారతంలో
ఒక చుండూరు, కారంచేడు ఒక నీరుకొండ, పదిరికుప్పం, లక్షింపేట
ప్రగతికి మైలురాలై నిలిసె గదా...
అంత్రం గట్టి తంత్రం జేస్తివిగదా

నీ మాటల కనికట్టుతో గారడి జేస్తివి గదా
నిజం జెప్తి కల్వర పడి
మొకం సాటెస్త వెందుకు
నువు జేసిన గాయాల శేదెల్లగక్కి
అంటుమాయిడ్సిన ఆరాటం
వుసు కండ్లు దెర్సిన కచ్చురం కాందాన్
మేలుకొని దిగ్గున లేసి నిగ్గదీసి అడ్డుతుంది.
నీతి మాల్న సమాజాన్ని..." (ముచ్చిర్కం, పుట. 42,)

తరాలు మారుతున్నప్పటికీ తమ బతుకు తీరు మారని సంగతిని, ఊర్లు మారినా ఊరికి దూరంగా గూడెం మారలేదని, కవి ఆవేదన వ్యక్తం చేస్తారు. ఇంకా ఈ దేశంలో చింపిరిజుట్టు చినిగిన అంగీ, అతుకుల అంగీ, మాసిన గడ్డం, మైల పాణం, పెంటదిబ్బలు ఏరుకోవడం, బొందల గడ్డలపై నిద్రిస్తున్న వైనం మారనే లేదని కవి విచారం ప్రకటిస్తారు. ప్రజాస్వామ్య భారత దేశంలో ఎలక్షన్స్ వచ్చినప్పుడు మాత్రమే అణగారిన వర్గాలు, పేదవారు, నిమ్నజాతులు, ఆదివాసీలు, హరిజనులు, గిరిజనులు ఇలా అందరూ

గుర్తొస్తారని, అధికారం చేజిక్కిన తర్వాత అసలు స్వరూపం బైటపెడుతారనే సత్యాన్ని కవి వివరంగా చెబుతారు.

"చుండూరు మారణకాండ ఎందుకు జరిగింది అనేది ప్రభుత్వం ఆయనను పరిశీలించనున్న మొదటి ప్రశ్న. దీనికి ఆయన స్పష్టమయిన జవాబు ఇచ్చారు. దళిత (ప్రధానంగా మాల) కులానికి చెందిన యువకులు ఇతర కులాల మహిళలను వేధించటం వంటి రెచ్చగొట్టే చర్యలకు పాల్పడడం వల్ల అప్పటికే మాలలకూ ఇతర కులాలకూ మధ్యనున్న మనస్పర్థలు పెరిగి ఇతర కులాలు మాలలపైన దాడి చేసే పరిస్థితి ఏర్పడిందనేది ఈ ప్రశ్నకు వారిచ్చే జవాబు" (చుండూరు మారణకాండ జస్టిస్ గంగాధరరావు నివేదిక 'వ్యాసం, దళిత–కె. బాలగోపాల్, పుట. 51)

దళితుల మీద జరుగుతున్న హింసను గురించి, హత్యల గురించి, అవమానాల గురించి, ఛీత్కారాలు గురించి, న్యాయం దొరకని తీరును గురించి చెబుతూ కారంచేడు, చుండూరు, నీరుకొండ, పదిరికుప్పం, లక్షింపేటల పరిస్థితిని, నీచమైన అవస్థను వివరిస్తూ గతాన్ని, వర్తమానాన్ని, భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని కులం పునాదులను కూల్చడమే పరిష్కార మార్గమని, కాలం చెల్లిన మనువాదం కాలగర్భంలో కలిపివేయాలని, మడిగట్టుకొని కూర్చోకుండా మానవత్వాన్ని మేల్కొల్పాలని కవి బలంగా కోరుకుంటారు. ఎన్ని నివేదికలు, రిపోర్టులు చూసినప్పటికీ సుదీర్ఘ కాలపు కాలయాపన వల్ల దళితులకు దక్కాల్సిన న్యాయం అందని ద్రాక్ష అని చెప్పవచ్చు.

భూతం ముత్యాలు తన కవిత్వ సంపుటి 'దుగిలి' ద్వారా దళితులపై జరుగుతున్న దాడులను, హింసను తీవ్రంగా ఖండించడం కనిపిస్తుంది. దళితుల ఆత్మగౌరవం, ఆత్మాభిమానం గురించి నిర్దిష్టంగా మాట్లాడటం తెలుస్తుంది. అగ్రవర్ణాల చేతుల్లో శ్రమదోపిడికి గురైన విధానాన్ని, బానిసత్వాన్ని అనుభవించిన తీరును ఒక దళితునిగా అందుకు గల కారణాలను అన్వేషిస్తున్న క్రమంలో 'కులం' ప్రధానమైన పాత్ర పోషిస్తుందని చెబుతారు. కులం పునాదులు మనువాద భావజాలం నుంచి పుట్టకొచ్చాయని, చాతుర్వర్ణ వ్యవస్థను, పంచముడిగా బతుకీడుస్తున్న వైనాన్ని, శూద్రులుగా చెప్పబడిన బీసీల చేత సైతం అవమానాలకు గురవుతున్నామనే అంశాన్ని తీవ్రంగా కవి ప్రతిఘటిస్తారు. ప్రజాస్వామ్య భారత దేశంలో ఓటుహక్కు పొందిన తర్వాత కూడా నోటుకు, మత్తుకు ఆశపడి రాజకీయ నాయకులకు తొత్తులుగా మారుతున్న వ్యవస్థ గురించి, బడుగుబలహీన వర్గాలకు ముఖ్యంగా బహుజనులకు దక్కాల్సిన రాజ్యాధికారం గురించి ప్రస్తావించారు. రచనల్లో అనగా ఈ కవిత్వంలోని భాష దళిత నుడికారంతో, పలుకుబడులతో అలరారిందని చెప్పవచ్చు సులభ శైలిలో, ప్రత్యక్షంగా, సంభాషణాపూర్వకంగా పాఠకులతో నేరుగా మాట్లాడుతున్నట్టు వుంటుంది. ఇందులో ప్రధానంగా దళిత స్పృహతో కూడిన బహుజన తత్వం కవి ఆశయంగా కవిత్వమై ప్రజ్వరిల్లిందని ఘంటాపథంగా చెప్పవచ్చు. వైయక్తికంగా వ్యక్తపరిచినప్పటికీ కవి ఆశయమే సామూహికంగా బహుజన తాత్వికతను ప్రతిబింబిస్తుంది.

ఉపయుక్త గ్రంథాలు :

1. శబ్ద రత్నాకరము, బి. సీతారామాచార్యులు. (2018) ఎమెస్కో బుక్స్ ప్రైవేట్ లిమిటెడ్, హైదరాబాద్.

2. శ్రీ వెంకటేశ్వర తెలుగు నిఘంటువు. (2008). హైదరాబాద్: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్

3. శిఖామణి కవిత్వం సమగ్ర పరిశీలన – డా. మంథని శంకరయ్య ,(2015), శ్రీభగవాన్ పబ్లికేషన్స్, %ఎఎం

4. విరుద్ధ సాహిత్యప్రమేయాలు – డా. జిలుకర శ్రీనివాస్ (23) భూమి బుక్ ట్రస్ట్, హైదరాబాదు

5. శిఖామణి కవిత్వం – సమాలోచన, డా. నెమిలేటి కిట్టన్న (2016) బీ స్వీయప్రచురణ, తిరుపతి.

6. ఒక దశాబ్దాన్ని కుదిపేసిన దళిత కవిత్వం–డా, ప్రసాదమూర్తి –16, బహుజన కెరటాలు, పబ్లికేషన్ నెం–15, ప్రకాశం జిల్లా.

7. దళిత – కె. బాలగోపాల్ (2011), పర్స్ పెక్టివ్స్, హైదరాబాదు.

❖ ❖ ❖ ❖ ❖

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 9 (29) హైదరాబాద్ జులై : 2025

సాహిత్య పరిశోధనలో ఊహా ప్రతిపాదన : అవగాహన, అనువర్తనం

ఆచార్య వెంకటరామయ్య గంపా, భారతీయ భాషలు మరియు అధ్యయన శాఖ, ఢిల్లీవిశ్వవిద్యాలయం.
ఫోన్ : 9958607789

తెలుగు సాహిత్యంలో పరిశోధనల సంఖ్య ఎంత విస్తృతంగా పెరుగుతుందో, ప్రామాణికత అంతే స్థాయిలో తగ్గుతుంది. ఇందుకు కారణాలు చాలా ఉన్నాయి. అన్ని విశ్వవిద్యాలయాల వారికి అంగీకారయోగ్యమైన, కాలానుగుణమైన మార్పులతో కూడిన ఆమోద యోగ్యమైన 'తెలుగు పరిశోధన పద్ధతులు' పై పుస్తకాలు కొన్ని ఉన్నప్పటికీ, వాటిని విశ్వవిద్యాలయాల వారు పూర్తిస్థాయిలో అనుసరించడం లేదు. దానితో తెలుగు పరిశోధనల మధ్య అనేక వ్యత్యాసాలు కనిపిస్తున్నాయి. ఇతర భాషలలో మాత్రం ఎప్పటికప్పుడు పరిశోధన పద్ధతులలో మార్పులు జరుగుతున్నాయి. కొన్ని సంస్థల వారు చేస్తున్న చేర్పులను చాలావరకు ఇతర భాషలవారు అంగీకరిస్తున్నారు కాని తెలుగులో అది జరగడం లేదు. ఇదివరకు తెలుగులో వచ్చిన పుస్తకాలలో ఉన్న సమాచారంతో పాటు ఆంగ్లంలో వస్తున్న మార్పులను గమనిస్తూ మనం ఇప్పుడు కొత్తగా పరిశోధన పద్ధతులను నిర్మించుకోవాల్సిన అవసరం ఉన్నది. దానికోసం మూసీ మాసపత్రిక తనవంతు బాధ్యతగా ఒక ప్రయత్నాన్ని మొదలుపెట్టింది. ప్రతి వ్యాసాన్ని పాఠకులు చదివిన వెంటనే ఇంకేమైనా మార్పులు, చేర్పులు అవసరం అనుకుంటే మాకు తెలియజేయ మనవి. **చర్చను కూడా స్వాగతిస్తున్నాం.** – **సంపాదకులు.**

ఏదైనా పరిశోధన మొదలుపెట్టేటప్పుడు, పరిశోధకుడు ఒక తాత్కాలిక ఆలోచనతో మొదలుపెడతాడు. అంటే, ఏదో ఒకటి ఇలా జరగవచ్చు లేదా దీనికి కారణం 'ఒకానొకటి' ఉండవచ్చు అని అనుకుంటాడు. ఈ ఆలోచననే ఆంగ్లంలో 'హైపోథీసెస్' (Hypothesis) అంటారు. తెలుగు నిఘంటువులు 'హైపోథీసెస్' పదానికి అనేక అర్థాలను ఇచ్చాయి, అయినప్పటికీ వ్యాస పరిమితి కారణంగా ఇక్కడ వాటిని పేర్కొనడం లేదు. మనం ఏదైనా పరిశోధన చేసేటప్పుడు, సాహిత్యంలో దాగి ఉన్న లోతైన అర్థాల గురించి పరిశోధకుడికి ఒక స్పష్టమైన దిశానిర్దేశం కావాలి. ఈ దిశానిర్దేశానికి కేంద్ర బిందువు ఊహాప్రతిపాదన. ఈ ఊహాప్రతిపాదన అనేది ఒక ప్రాథమిక ఆలోచనగా లేదా అంచనాగా ఉంటుంది. ఇది పరిశోధకుడు చేసిన పరిశీలనలకు, అర్థం చేసుకోవాలనుకున్న వాటికి మధ్య వంతెన లాంటిది.

చాలామంది ఊహాప్రతిపాదన సామాన్య శాస్త్రాలకు, సాంఘిక శాస్త్రాలకు మాత్రమే పరిమితం అనుకుంటారు, కానీ ఇది సాహిత్య అధ్యయనాలలో కీలకమైనది. ఇక్కడ ఇది కొన్నిసార్లు స్పష్టంగా కనిపించకపోయినా, అంతర్లీనంగా ఉంటుంది. లోతైన విద్యా పరిశోధనలకు ఇది ఎంత ముఖ్యమో, అలాగే దీన్ని స్పష్టంగా, పటిష్ఠంగా రూపొందించడం ఎందుకు అవసరమో ఈ వ్యాసంలో తెలుసుకోవచ్చు. ఇది పరిశోధనలో కొత్త ఆలోచనలకు ఒక ఉత్ప్రేరకంలా పనిచేస్తుంది. ఊహాప్రతిపాదన పరిశోధనకు మార్గదర్శకంగా పనిచేస్తూ, దిశానిర్దేశ దృష్టిని కేంద్రీకరిస్తుంది. ఎలాంటి సమాచారం సేకరించాలి? ఎలా విశ్లేషించాలి? అనే దానిపై స్పష్టతనిస్తుంది.

తెలుగులో పరిశోధనా పద్ధతులపై వచ్చిన పుస్తకాలలో ఊహాప్రతిపాదన గురించి కొంత చర్చించారు. ముఖ్యంగా ఎస్. జయప్రకాష్ రచించిన 'పరిశోధనా విధానం' పుస్తకంలో, రాచపాళెం చంద్రశేఖర రెడ్డి, హెచ్.ఎస్. బ్రహ్మానంద రచించిన 'సాహిత్య పరిశోధనా సూత్రాలు' రచనలో ఊహాప్రతిపాదనకు సంబంధించిన ప్రాథమిక విషయాలు, ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు. తెలుగు పరిశోధకులు చర్చించిన అంశాలు, వివరించిన వివరాలు విలువైనప్పటికీ, ప్రస్తుత కాలంలో సాహిత్య పరిశోధనలో ఊహాప్రతిపాదన ఏ విధంగా రూపొందించాలో మరోసారి చర్చించాల్సిన అవసరం ఉంది. అలాంటి ప్రయత్నమే ఈ వ్యాసంలో జరిగింది.

సాహిత్యంలో ఊహాప్రతిపాదన

సాహిత్యంలో ఊహాప్రతిపాదన అనేది పరిశోధకుడు ఏదైనా అంశంపై చేసే తాత్కాలిక వివరణగా ఉంటుంది. ఇది పరిశోధకుడు చేసిన ప్రాథమిక పరిశీలనలు లేదా ఇప్పటికే పరిశోధకుడికి తెలిసిన విషయాలపై ఆధారపడి ఉంటుంది. గుర్తుంచుకోవలసిన ముఖ్య విషయం ఏమిటంటే, ఇది వాస్తవం కాదు, కేవలం పరిశోధన ద్వారా పరీక్షించబడటానికి సిద్ధంగా ఉన్న ఒక విద్యాపరమైన అంచనా మాత్రమే.

భాషావేత్త డేవిడ్ క్రిస్టల్ దాని తాత్కాలిక స్వభావాన్ని ఇలా నొక్కి చెప్పారు : **"ఒక ఊహాప్రతిపాదన అనేది రెండు లేదా అంతకంటే ఎక్కువ చరరాశుల (variables) మధ్య సంబంధం గురించి ఒక తాత్కాలిక ప్రకటన, దీనిని మరింత పరిశీలన లేదా ప్రయోగం ద్వారా పరీక్షించవచ్చు"** (Crystal, The Cambridge Encyclopedia of the English Language, p. 424). సాహిత్య అధ్యయనాలలో ఊహాప్రతిపాదన చాలా కీలకమైనది. ఉదాహరణకు, ఒక రచనలో పదేపదే కనిపించే ఒక నిర్దిష్ట చిహ్నాన్ని (symbol) లేదా కథ చెప్పే విధానంలో వచ్చిన గణనీయమైన మార్పును పరిశోధకుడు

గమనించవచ్చు. ఈ పరిశీలనల ఆధారంగా, ఆ చిహ్నం లోతైన ప్రాముఖ్యత లేదా ఆ మార్పు పాఠకుడిపై చూపించే ప్రభావం గురించి పరిశోధకుడు ఒక ఊహాప్రతిపాదనను రూపొందించవచ్చు. ఈ ఊహాప్రతిపాదనను పరిశోధకుడు మరింత విశ్లేషణ, పరిశోధన ద్వారా ధ్రువీకరించాలి. (ఉదాహరణకు ఒక వర్గం రచనలలో ఎరుపు రంగు గుర్తులు ఎక్కువగా కనిపిస్తుంటాయి)

సాహిత్యం పరిశోధనలో ఊహాప్రతిపాదన : ప్రయోజనాలు

ఊహాప్రతిపాదన లేకుండా, తెలుగు సాహిత్యంపై చేసే పరిశోధన నిష్ప్రయోజనమైన సమాచార సేకరణగా లేదా కేవలం వివరణగా మారే ప్రమాదం ఉంటుంది. ఇది పరిశోధన లక్ష్యాన్ని పరిమితం చేస్తుంది. ఊహాప్రతిపాదన ఒక దిక్సూచిలా పనిచేస్తుంది. పరిశోధకుడిని నిర్దిష్ట ప్రశ్నలు, సంబంధిత సమాచార వనరులు (అది ప్రాచీన కావ్యాల సంకలనం అయినా లేదా సమకాలీన కథల సమాహారం అయినా), తగిన విశ్లేషణా పద్ధతుల వైపు నడిపిస్తుంది. ఇది తెలుగు సాహిత్య చరిత్రలో ఒక విస్తృత ఆసక్తి ఉన్న మార్గంగా మారుస్తుంది. ఉదాహరణకు, **'శ్రీశ్రీ కవిత్వంలో విప్లవ భావాలు ఎలా పరిణామం చెందాయి? సంప్రదాయం నుంచి అభ్యుదయమా? లేక...'** అనే ఊహాప్రతిపాదన నిర్దిష్ట కవితలు, అతని జీవిత చరిత్ర, సమకాలీన సామాజిక పరిస్థితులను పరిశీలించే దిశగా పరిశోధకుడిని నడిపిస్తుంది.

భాషా పరిశోధనలో ప్రాముఖ్యత :

తెలుగు భాషా అధ్యయనాలలో ఊహా ప్రతిపాదన నూతన విచారణకు మార్గనిర్దేశం చేస్తుంది. భాషాశాస్త్రంలో వాక్య నిర్మాణాలు, సామాజిక భాషాశాస్త్ర వైవిధ్యం లేదా చారిత్రక మార్పు లాంటి వాటిపై పరిశోధనలను నడిపిస్తాయి. ఉదాహరణకు, **'తెలుగు మాండలికాల్లో స్త్రీల భాషా వినియోగం పురుషుల భాషా వినియోగం నుండి ఎలా భిన్నంగా ఉంటుంది?'** అనే ఊహాప్రతిపాదన సామాజిక భాషాశాస్త్ర అధ్యయనానికి మార్గం సుగమం చేస్తుంది.

తెలుగు సాహిత్య అధ్యయనంలో, ఊహాప్రతిపాదనలు పాఠ్యాల విశ్లేషణను రూపొందిస్తాయి, రూపం, అర్థం మధ్య సంబంధాలను ప్రతిపాదిస్తాయి లేదా చారిత్రక సందర్భం ప్రభావాన్ని అన్వేషిస్తాయి. అవి పాండిత్యాన్ని కేవలం ఆత్మాశ్రయ ముద్రల నుండి నిర్మాణాత్మక మైన, సాక్ష్యం-ఆధారిత వాదనల వైపు తీసుకువెళతాయి. ఉదాహరణకు, **'తెలుగు రామాయణాల్లో వీరత్వం, దైవత్వం మధ్య సంబంధం ఏమిటి?'** అనే ఊహాప్రతిపాదన కావ్య సమగ్ర విశ్లేషణకు పునాది వేస్తుంది.

ఊహాప్రతిపాదన - ప్రధాన లక్షణాలు:

ఇప్పటికే తెలుగులో పరిశోధకులు ఊహాప్రతిపాదన లక్షణాలు తెలిపారు. అయినప్పటికీ ప్రాథమిక నిర్వచనానికి మించి, అనేక లక్షణాలు ఆంగ్ల పుస్తకాలలో పేర్కొనబడ్డాయి.

మరికొన్ని ఊహా ప్రతిపాదన లక్షణాలు :

స్పష్టత : సూటిగా, సంక్షిప్త భాషలో వ్యక్తపరచబడింది. అస్పష్టత మంచి పరిశోధనకు శత్రువు వంటిది. ఊహాప్రతిపాదనను స్పష్టంగా, రంగంలో అర్థం చేసుకున్న ఖచ్చితమైన పదజాలంతో పేర్కొనాలి. అర్థాన్ని అస్పష్టం చేయడానికి కాకుండా, పదజాలం సముచితంగా ఉపయోగించాలి. ఒక క్లిష్టమైన ఊహాప్రతిపాదనను సమర్థవంతంగా పరీక్షించడం కష్టం, సాధ్యం కాకపోవచ్చు.

అనుభావిక ఆధారం : పరిశీలించదగిన దృగ్విషయాలు ఊహను కలిగి ఉన్నప్పటికీ, ఊహాప్రతిపాదన స్పష్టమైన సాక్ష్యానికి తిరిగి కనెక్ట్ అవ్వాలి - వాస్తవ భాషా ఉపయోగం (రికార్డ్ చేయబడిన ప్రసంగం, వ్రాతపూర్వక పాఠ్యాలు) లేదా సాహిత్య పాఠ్యం స్వయంగా ఉన్నప్పటికీ అధ్యయనం ఆధారం లేకుండా కేవలం భావజాలంపై ఆధారపడి ఉండదు.

తప్పుపట్టే సామర్థ్యం : సాక్ష్యం విరుద్ధంగా ఉంటే తప్పు అని నిరూపించబడే విధంగా రూపొందించబడాలి. పరీక్షించదగిన సామర్థ్యంతో దగ్గరి సంబంధం కలిగి ఉండి, తప్పుపట్టే సామర్థ్యం ఉంటే ఊహాప్రతిపాదన తప్పుగా ఉండటానికి అనుమతించే విధంగా రూపొందించబడాలి. ఇది సూత్రప్రాయంగా, సమాచారం ద్వారా ఖండించబడగల అంచనాలను చేయాలి. **"ప్రతి సాక్ష్యానికి నిరోధకతను కలిగి ఉండేలా రూపొందించబడిని ఊహాప్రతిపాదన శాస్త్రీయంగా లేదా పాండిత్యపరంగా చెల్లుబాటు కాదు."** (Popper, The Logic of Scientific Discovery, p. 40).

విస్తృత పాండిత్య చర్చలకు ఆహ్వానం : ఒక ఊహాప్రతిపాదన అది ఇప్పటికే ఉన్న పాండిత్యంతో నిమగ్నమైనప్పుడు ప్రాముఖ్యతను పొందుతుంది. అది జ్ఞానంలో ఒక అంతరాన్ని పరిష్కరించాలి, ఒక ప్రబలమైన అభిప్రాయాన్ని సవాలు చేయాలి, ఇప్పటికే ఉన్న సిద్ధాంతాన్ని మెరుగుపరచాలి లేదా ఒక సిద్ధాంతపరమైన చట్రాన్ని కొత్త సమాచారానికి వర్తింపజేయాలి. ఇది క్రమశిక్షణలో ఆమోదించ బడిన పద్ధతులను (ఉదాహరణకు, చర్చ, విశ్లేషణ, క్షుణ్ణంగా చదవడం, చారిత్రక పరిశోధన) ఉపయోగించి పరిశోధించడం సాధ్యం కావాలి.

అనుసరణీయత : సమాచార సేకరణ, విశ్లేషణ కొనసాగు తున్నప్పుడు, కొత్త అంతర్దృష్టులు ఉద్భవిస్తాయి. ఒక మంచి పరిశోధకుడు సాక్ష్యం సంక్లిష్టతను బాగా వివరించడానికి ప్రారంభ ఊహాప్రతిపాదనను సవరించుకోడానికి సిద్ధంగా ఉంటాడు. **"పరిశోధనలో మనం ఊహించిందే నిజం అని భ్రమలో పడకుండా**

వాస్తవిక అంశాలను నిరూపించగలగాలి. మనం చేసిన సన్నివేశాలకు, సంఘటనలకు అనుబంధింపబడి మనలో కొన్ని ఆలోచనలు, భావాలు ఏర్పడతాయి. అవి స్థిరంగా మనకు ఒక మూర్తిమత్వాన్ని ఇస్తాయి. వాటిపైన ఆధారపడే, మనలో ఊహాశక్తి ఏర్పడుతుంది. ఆ ఊహతో ప్రతిపాదిత అంశాలను నిర్ధారణ చేస్తాం. దానిని నిరూపించే సమయంలో స్పష్టత సాధించే క్రమంలో చేసే ప్రయత్నాలలో మూర్ఖత్వం, మొండితనం ఉండకూడదు. వాస్తవాన్ని వాస్తవంగా స్వీకరించే శక్తి ఉండాలి." (సూర్యనారాయణమూర్తి, కాకునూరి. పరిశోధన. పుట–34)

వివిధ రకాల ఊహాప్రతిపాదనలు

ఊహాప్రతిపాదనల సారాంశం ఏమిటంటే, ఊహాప్రతిపాదన పరిశోధకుడు ఎంచుకున్న పరిశోధన అంశం ఆధారంగా మారుతుంది. ఒకే రకమైన ఊహాప్రతిపాదన అన్ని రకాల పరిశోధనలకు సరిపోదు. ఉదాహరణకు, భావ కవిత్వంపై పరిశోధన చేస్తున్నప్పుడు రూపొందించే ఊహాప్రతిపాదన వేరుగా ఉంటుంది. భావ కవిత్వం ప్రధానంగా వ్యక్తిగత అనుభూతులు, భావోద్వేగాలు, ప్రకృతి వర్ణనలు, ప్రేమ లాంటి సున్నితమైన అంశాలపై దృష్టి సారిస్తుంది. కాబట్టి, ఇక్కడ ఊహాప్రతిపాదన **'భావ కవిత్వంలో ప్రకృతి వర్ణనలు కవి అంతరంగ భావాలకు అద్దం పడతాయి'** లేదా **'భావ కవిత్వంలో వ్యక్తిగత స్వేచ్ఛ, ఆత్మావిష్కరణ ప్రధాన లక్షణాలు'** లాంటివి ఉండవచ్చు. ఈ ఊహాప్రతిపాదన కవిత్వం సౌందర్య, భావోద్వేగ కోణాలను అన్వేషించడానికి వీలు కల్పిస్తుంది.

అదే విధంగా స్త్రీవాద సాహిత్యం విషయానికి వస్తే, ఊహాప్రతిపాదన స్త్రీల అణచివేత, పితృస్వామ్య వ్యవస్థ, స్త్రీల హక్కులు, గుర్తింపు, సమానత్వం లాంటి అంశాలపై దృష్టి సారిస్తుంది. **'స్త్రీవాద సాహిత్యం సమాజంలో స్త్రీల పాత్రను, వారిపై జరుగుతున్న అన్యాయాలను ప్రశ్నించింది'** లేదా **'స్త్రీవాద రచనలు స్త్రీలలో తమ హక్కుల పట్ల అవగాహనను పెంచి, స్వీయ నిర్ణయం తీసుకోవడానికి ప్రేరేపించాయి'** లాంటి ఊహాప్రతిపాదనలు ఇక్కడ రూపొందించబడతాయి. ఇవి స్త్రీల జీవన వాస్తవాలను, సమాజంలో వారి స్థానాన్ని విశ్లేషించడానికి దోహదపడతాయి.

ఆంగ్ల గ్రంథాలలో ఉన్న వివిధ రకాల ఊహాప్రతిపాదనలు :

శూన్య ఊహా ప్రతిపాదన (Null Hypothesis) : శూన్య ఊహా ప్రతిపాదన అంటే, ఒక విషయం లేదా ఇతివృత్తంలో ఎలాంటి పెద్ద మార్పు లేదా తేడా లేదు అని చెప్పడం. పుస్తకాలు సాధారణంగా ఉన్న కథా నియమాలను, నైతిక విలువలను పాటిస్తాయి అని ఇది భావిస్తుంది. కొత్త వ్యాఖ్యానాలతో పోల్చడానికి ఇది ఒక ప్రాథమిక ఆధారంలా ఉంటుంది. ఈ ఊహాప్రతిపాదన తప్పు అని తేలితే, అప్పుడు కొత్త మార్పుల గురించి మరింత లోతుగా పరిశోధించాల్సి

వస్తుంది. ఉదాహరణ :

పరిశోధనాంశం : 'తెలుగు జానపద కథాగేయాలలో స్త్రీ పాత్రలు – సారూప్యత.'

ఊహాప్రతిపాదన : 'తెలుగు జానపద కథాగేయాలలో స్త్రీ పాత్రలను చూపించడంలో, అవి ఏ ప్రాంతం నుండి వచ్చినా, ఏ కాలానికి చెందినవైనా, త్యాగం, కుటుంబ విలువలకు ప్రాధాన్యత ఇవ్వడం అనేది ఎప్పుడూ స్థిరంగానే ఉంటుంది.'

ప్రత్యామ్నాయ ఊహాప్రతిపాదన (Alternative Hypothesis): ప్రత్యామ్నాయ ఊహాప్రతిపాదన అనేది, ఒక రచనలో పెద్ద తేడాలు లేదా కొత్త ప్రభావాలు ఉన్నాయని చెప్పేది. ఇది సాధారణంగా అంగీకరించిన వ్యాఖ్యానాలను ప్రశ్నిస్తుంది, ఒక కొత్త ఆలోచనను ముందుకు తెస్తుంది. ఇది పుస్తకంలోని ఆధారాలను చాలా కచ్చితంగా పోల్చమని ప్రోత్సహిస్తుంది. ఈ విధానం వల్ల సాంప్రదాయ విషయాలను ఆధునిక దృష్టితో తిరిగి అర్థం చేసుకోవడానికి ఒక కొత్త చర్చ మొదలవుతుంది.

పరిశోధనాంశం: 'తెలుగు సినిమాలలో మహిళా పాత్రల చిత్రణ: సాహిత్యం నుండి సినిమా వరకు'.

ఊహాప్రతిపాదన : 'తెలుగు సినిమాలలో మహిళా పాత్రలను చూపించే విధానం, నవలలు లేదా నాటకాలలోని పాత పద్ధతుల నుండి భిన్నంగా, ఆధునిక కాలంలో మరింత శక్తివంతంగా, సవాళ్లను ఎదుర్కొనే విధంగా మారింది, వ్యాపార సంప్రదాయాలకు అనుగుణంగా స్త్రీ పాత్రలను చిత్రించిన విధానాన్ని ఇది వివరిస్తుంది.'

దిశాత్మక ఊహాప్రతిపాదన (Directional Hypothesis): దిశాత్మక ఊహాప్రతిపాదన అంటే, ఒక సాహిత్య రచనలో ఒక నిర్దిష్ట మార్పు లేదా ధోరణి ఎలా ఉంటుందో ముందే చెప్పడం. ఇది కొన్ని విషయాలు లేదా అంశాలు ఎలా పెరుగుతాయి లేదా తగ్గుతాయి అని స్పష్టంగా చెబుతుంది. ఇది పుస్తకాలను పోల్చడం ద్వారా నిజమని నిరూపించుకోవడానికి లేదా తప్పు అని చెప్పడానికి స్పష్టమైన

అంచనాలను ఇస్తుంది. కాలక్రమేణా కథలో ఎలాంటి మార్పులు వచ్చాయో వివరంగా పరిశోధించడానికి ఇది సహాయపడుతుంది.

పరిశోధనాంశం : 'ఆధునిక తెలుగు కవిత్వంలో గ్రామీణ జీవితం: సంప్రదాయం నుండి పట్టణీకరణ ప్రభావం వరకు.'

ఊహాప్రతిపాదన : 'ఆధునిక తెలుగు కవిత్వంలో గ్రామీణ జీవితాన్ని చూపించే విధానం, ఆధునికత, పట్టణాల ప్రభావం పెరిగిన కొద్దీ, కేవలం ఆదర్శంగా చూపించడం నుండి కనుమరుగవుతున్న లేదా కష్టాల్లో ఉన్న జీవితంగా రచనలలో కనిపిస్తుంది.'

పరిశోధనాంశం : 'తెలుగు నవలల్లో వర్గ సంబంధాల చిత్రణ: సామాజిక మార్పులు.'

ఊహాప్రతిపాదన : 'తెలుగు నవలల్లో వర్గ సంబంధాలను చూపించే విధానం, గత యాభై సంవత్సరాలుగా మరింత బహిరంగ చర్చకు, విమర్శనాత్మక దృక్పథానికి దారితీసింది. ఇది గతంలో పరోక్షంగా ఉండే చిత్రణకు భిన్నంగా ఉంది.'

దిశాత్మకం కాని ఊహాప్రతిపాదన (Non-Directional Hypothesis): దిశాత్మకం కాని ఊహాప్రతిపాదన అంటే, ఒక సంబంధం ఉందని మాత్రమే చెబుతుంది, కానీ ఆ సంబంధం ఏ దిశలో ఉంటుందో (ఎక్కువవుతుందా, తక్కువవుతుందా) చెప్పదు. ఇది అస్పష్టతను అంగీకరిస్తుంది, అంటే ఒకే విషయాన్ని చాలా రకాలుగా అర్థం చేసుకోవడానికి అవకాశం ఇస్తుంది. ఇది సాహిత్యంలోని అంశాల మధ్య ఉన్న సంక్లిష్ట సంబంధాలను చూపిస్తుంది. ఫలితాలను ముందే నిర్ణయించకుండా విస్తృతంగా, లోతుగా విశ్లేషించడానికి ప్రోత్సహిస్తుంది.

పరిశోధనాంశం : 'తెలుగు సాహిత్యంపై సామాజిక మాధ్యమాల ప్రభావం.'

ఊహాప్రతిపాదన : 'తెలుగు సాహిత్యం సృజన, ప్రచురణ, పాఠకుల స్పందనపై సామాజిక మాధ్యమాల ప్రభావం ఉంది.'

పోల్చదగిన ఊహాప్రతిపాదన (Comparative Hypothesis): ఈ ఊహాప్రతిపాదనలు వేర్వేరు రచనలు ఒకేరకమైన విషయాలను ఎలా చూపిస్తాయో పోల్చడంపై దృష్టి పెడతాయి. ఇది కథ చెప్పే విధానంలో, సాంస్కృతిక విషయాలను వ్యక్తం చేయడంలో ఉన్న తేడాలను కనుగొనడం దీని లక్ష్యం. కాలక్రమేణా వచ్చిన మార్పులను చూపించడానికి పక్కపక్కన పెట్టి రచనలను పోల్చడానికి ఇది ప్రోత్సహిస్తుంది. తెలుగు సాహిత్య సంప్రదాయాలలో ఏవి అలాగే ఉన్నాయో, ఏవి మారాయో అర్థం చేసుకోవడానికి ఇది సహాయ పడుతుంది.

పరిశోధనాంశం : 'తెలుగులో పురాణ సంబంధిత రచనలు: ధర్మం సిద్ధాంతం.'

ఊహాప్రతిపాదన : 'ప్రాచీన రచనల్లో పేర్కొన్న ధర్మానికి, ప్రాచీన రచనలను ఆధారంగా చేసుకొని వెలువడిన ఆధునిక తెలుగు రచనలలో దానిని తిరిగి చూపించే విధానం చాలా భిన్నంగా ఉంటుంది. ఆధునిక రచనలు వ్యక్తిగత నైతిక గందరగోళాలపై ఎక్కువ దృష్టి పెడతాయి.'

పరిశోధనాంశం : 'దక్షిణ భారతీయ భాషల్లోని సాహిత్యంలో దళిత రచనలు: తులనాత్మక పరిశీలన.'

ఊహాప్రతిపాదన : 'తెలుగులో వెలువడిన దళిత సాహిత్యం, ఇతర దక్షిణ భారతీయ భాషలలో నుండి తెలుగులోకి అనువాదమైన కొన్ని రచనల ఆధారంగా దళిత సాహిత్యంలో అణచివేత, గుర్తింపు, ప్రతిఘటన లాంటి విషయాలను చూపించడంలో చాలా పోలికలు ఉన్నప్పటికీ, వాటిని వ్యక్తం చేసే విధానం, స్థానిక సాంస్కృతిక అంశాలలో కొన్ని తేడాలు ఉన్నాయి.'

కారణార్థక ఊహాప్రతిపాదన (Causal Hypothesis) : ఈ ఊహాప్రతిపాదన, చారిత్రక లేదా సామాజిక పరిస్థితులు సాహిత్యాన్ని ఎలా ప్రభావితం చేస్తాయో పరిశీలిస్తుంది. ఇది బయటి సంఘటనలను కథలో వచ్చే మార్పులకు, ప్రధాన ఆలోచనలలో వచ్చే మార్పులకు కలుపుతుంది. ఇది సాహిత్యంలోని కొత్తదనాన్ని పెద్ద సామాజిక–రాజకీయ నేపథ్యానికి అనుసంధానిస్తుంది. చరిత్రలో వచ్చిన మార్పులను కథలో వచ్చిన మార్పులతో పోల్చడం ద్వారా ఇది నిజమని నిరూపించుకోవచ్చు.

పరిశోధనాంశం : 'తెలంగాణ రైతాంగ పోరాటం: తెలుగు నవలల్లో పల్లెటూరి జీవితం.'

ఊహాప్రతిపాదన : 'తెలంగాణ రైతాంగ పోరాట ఉద్యమం బలంగా ఉన్న కాలంలో తెలుగు నవలల్లో పల్లెటూరి పేదరికం, అణచివేత, ప్రతిఘటన లాంటి విషయాలు పెరిగాయి. ఇది ఉద్యమం వల్ల కలిగిన ప్రభావం కావచ్చు.'

పరిశోధనాంశం: '1990లలో ఆర్థిక మార్పులు: తెలుగు కథానికల్లో మధ్యతరగతి కోరికల చిత్రణ.'

ఊహాప్రతిపాదన : 'భారతదేశంలో 1990లలో వచ్చిన ఆర్థిక మార్పుల వల్ల, తెలుగు కథానికల్లో మధ్యతరగతి ప్రజల కోరికలు, ఆర్థిక భద్రత, విలువల్లో మార్పుల గురించి చూపించడం పెరిగింది.'

వివరణాత్మక ఊహాప్రతిపాదన (Descriptive Hypothesis): వివరణాత్మక ఊహాప్రతిపాదన అంటే, ఒక రచనలో మనం గమనించదగిన లక్షణాలు, తరచుగా కనిపించే శైలి పద్ధతులను జాబితా చేయడం. ఇది పదేపదే వచ్చే అంశాలు, కథ చెప్పే విధానాలపై

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 9 హైదరాబాద్ జూలై : 2025

దృష్టి పెడుతుంది. ఇది తదుపరి పరిశోధనకు ఆధారమయ్యే గమనికలను అందిస్తుంది. రచనలలోని ప్రధాన విషయాల లక్షణాల గురించి వివరంగా తెలియజేస్తుంది.

పరిశోధనాంశం : 'దిగంబర కవిత్వంలో సామాజిక సమస్యలు – అభివ్యక్తి.'

ఊహాప్రతిపాదన : 'దిగంబర కవుల కవిత్వంలో సామాజిక సమస్యలు ప్రధానమైన విషయంగా ఉండగా, వాటిని చెప్పడానికి కవులు కఠినమైన భాషను తరచుగా ఉపయోగించారు.'

పరిశోధనాంశం : 'ఆధునిక తెలుగు కథానికల్లో భార్యాభర్తల సంబంధాలు: సమకాలీన సమస్యలు.'

ఊహాప్రతిపాదన : 'ఆధునిక తెలుగు కథానికల్లో భార్యాభర్తల సంబంధాలు తరచుగా పట్టణాల ప్రభావాలు, ఆర్థిక కష్టాలు, వ్యక్తిగత స్వేచ్ఛ కోసం కోరిక లాంటి అంశాలతో ముడిపడి ఉన్న పద్ధతులను చూపిస్తాయి.'

అన్వేషణాత్మక ఊహాప్రతిపాదన (Exploratory Hypothesis): ఈ ఊహాప్రతిపాదన, సాహిత్యంలో తక్కువగా అధ్యయనం చేయబడిన లేదా అంతగా స్పష్టంగా లేని విషయాలను పరిశోధించడానికి అవకాశం ఇస్తుంది. కొత్త వ్యాఖ్యానాలను, సరికొత్త ప్రశ్నలను అడగడానికి ఇది ప్రోత్సహిస్తుంది. సాధారణంగా ఉండే వ్యాఖ్యానాలను ప్రశ్నించడానికి పరిశోధకులను ఉత్సాహపరుస్తుంది. తక్కువగా పరిశోధించిన సాహిత్య రంగాలలో కొత్త అధ్యయనాలకు పునాది వేస్తుంది.

పరిశోధనాంశం : 'తెలుగు కథా సాహిత్యంలో 'ఆహారం' ప్రాముఖ్యత.'

ఊహాప్రతిపాదన : 'తెలుగు కథా సాహిత్యంలో ఆహారం కేవలం తినడానికి సంబంధించినది కాకుండా, సామాజిక స్థితి, సంస్కృతి మార్పిడి లేదా అధికార సంబంధాలకు సంబంధించిన దాగి ఉన్న అర్థాలను తెలియజేయవచ్చు.'

పరిశోధనాంశం : 'తెలుగు సినిమా పాటల్లో 'విధి', 'కర్మ' భావనలు: ఒక సాహిత్య విశ్లేషణ.'

ఊహాప్రతిపాదన : '1950–1970ల మధ్య వచ్చిన తెలుగు సినిమా పాటల్లో 'విధి', 'కర్మ' అనే ఆలోచనలు కేవలం కథను ముందుకు నడపడానికి మాత్రమే కాకుండా, అప్పటి సమాజం తాత్విక ఆలోచనలు, జీవితం పట్ల వారి వైఖరిని చూపించే దాగి ఉన్న సందేశాలను కలిగి ఉండవచ్చు.'

సంభావిత ఊహాప్రతిపాదన (Conceptual Hypothesis): ఈ ఊహాప్రతిపాదన, అమూర్త భావనలు (abstract concepts)

సాహిత్య విశ్లేషణను ఎలా ప్రభావితం చేస్తాయో చూస్తుంది. అస్తిత్వవాదం, ఉత్తర–వలసవాదం లేదా స్త్రీవాదం లాంటి సిద్ధాంతాలను పరిశోధనలో కలుపుకుంటుంది. ఇది పెద్ద సైద్ధాంతిక ఆలోచనలను నిర్దిష్ట రచనలను పరిశీలించడంతో కలుపుతుంది. వివిధ రంగాల నుండి వచ్చే ఆలోచనలను కలపడం ద్వారా సాహిత్య విమర్శను మరింత లోతుగా చేస్తుంది.

పరిశోధనాంశం : 'తెలుగు దళిత సాహిత్యం: ఉత్తర–వలసవాద (Postcolonial) దృక్పథం.'

ఊహాప్రతిపాదన : 'తెలుగు దళిత సాహిత్యం ఉత్తర–వలసవాద సిద్ధాంతంలోని అట్టడుగు వర్గాల స్వరం, సాంస్కృతిక గుర్తింపు కోసం పోరాటం, అధికార సంబంధాలపై విమర్శ లాంటి భావనలను తమ రచనల ద్వారా స్పష్టంగా చూపించవచ్చు.'

గుణాత్మక ఊహాప్రతిపాదన (Qualitative Hypothesis) : ఈ ఊహాప్రతిపాదన, రచనలను వ్యక్తిగత, సూక్ష్మమైన వివరణల ద్వారా అర్థం చేసుకోవడంపై ఎక్కువ దృష్టి పెడుతుంది. ఇది చిహ్నాలు, కథ చెప్పే తీరు, పాఠకుల స్పందన లాంటి వాటిని పరిగణనలోకి తీసుకుంటుంది. లోతుగా చదవడం, ప్రధాన ఆలోచనలను విశ్లేషించడం లాంటి పద్ధతులను ఉపయోగిస్తుంది. కొలవగలిగే సమాచారం కంటే, కథలోని లోతైన అర్థాలకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తుంది.

పరిశోధనాంశం : 'సినిమా పాటల్లో 'ప్రేమ': వివిధ రకాల వ్యక్తీకరణలు (1980 వరకు).'

ఊహాప్రతిపాదన : 'సినిమా పాటల్లో ప్రేమ కేవలం ప్రేమికుల మధ్య అనుబంధం కాకుండా, ప్రకృతి పట్ల ప్రేమ, దేవుడి పట్ల భక్తి, మానవత్వం పట్ల దయ లాంటి వివిధ కోణాలలో లోతుగా చర్చించవచ్చు.'

పరిమాణాత్మక ఊహాప్రతిపాదన (Quantitative Hypothesis): ఈ ఊహాప్రతిపాదన సాహిత్య సిద్ధాంతాన్ని, కొలవగలిగే రచనల అంశాలతో కలుపుతుంది. ఇది పదాల సంఖ్య లేదా భావోద్వేగాల స్కోర్‌లు లాంటి కొలమానాలను ఉపయోగిస్తుంది. సాహిత్య అధ్యయనంలో డిజిటల్ టెక్నాలజీ ఎంత ఉపయోగపడుతుందో ఇది



చూపిస్తుంది. విశ్లేషణలో చెప్పిన విషయాలను డేటా ఆధారంగా నిర్ధారించడానికి ఇది సహాయపడుతుంది.

పరిశోధనాంశం : 'తెలుగు ఆధునిక కవిత్వంలో ఆంగ్ల పదాల వాడకం: తులనాత్మక పరిశీలన (1990 –2025) వరకు పోలిక.'

ఊహాప్రతిపాదన : '1990 నుండి 2025వ సంవత్సరం వరకు తెలుగు ఆధునిక కవిత్వంలో ఆంగ్ల పదాల వినియోగం ప్రతి పదేళ్లకూ క్రమంగా పెరుగుతుంది.'

గ్రంథ ఊహాప్రతిపాదన (Textual Hypothesis): ఈ ఊహాప్రతిపాదన, కథలలోని పాత్రలను ఎలా చూపించారు, అవి ఎలా మారాయి అనే దానిపై దృష్టి పెడుతుంది. ఇది కథాంశం, సంభాషణ నుండి వచ్చిన ఆధారాలపై ఆధారపడి ఉంటుంది. పాత కాలపు పాత్రలను ఆధునిక రచనల్లో ఎలా చూపారో పోల్చి చూస్తుంది. పాత్రల నిర్ణయాలు, కథపై వాటి ప్రభావం గురించి స్పష్టమైన విశ్లేషణలను అందిస్తుంది.

పరిశోధనాంశం: 'మహాభారతంలోని 'ద్రౌపది' పాత్ర: నన్నయ్య నుండి ఆధునిక సాహిత్యం వరకు.'

ఊహాప్రతిపాదన : 'మహాభారతంలోని ద్రౌపది పాత్ర చిత్రణ నన్నయ్య కాలం నుండి ఆధునిక సాహిత్యం (ఉదాహరణకు: ద్రౌపది ప్రధాన పాత్రగా చాలా నవలలు వెలువడ్డాయి) వరకు ఆమెను కేవలం బాధితురాలిగా కాకుండా, బలమైన, ప్రశ్నించే, స్వతంత్ర స్త్రీగా మారుతుందని భావించవచ్చు. ఇది లింగ వివక్ష పట్ల దృక్పథంలో వచ్చిన మార్పును చూపిస్తుంది.'

ప్రతీకాత్మక ఊహాప్రతిపాదన (Symbolic Hypothesis): ఈ ఊహాప్రతిపాదన, చిహ్నాలు ఒక రచనను ఎలా మరింత అందంగా చేస్తాయో పరిశీలిస్తుంది. సాధారణ చిత్రాలు, అంశాల వెనుక ఉన్న అనేక అర్థాలను అన్వేషిస్తుంది. ప్రతీకాత్మక భాషను సాంస్కృతిక, తాత్విక సంప్రదాయాలకు కలుపుతుంది. తెలుగు సాహిత్యంలో దాగి ఉన్న కథలను అర్థం చేసుకోవడానికి సహాయపడుతుంది.

పరిశోధనాంశం : 'తిక్కన భారతంలో ప్రతీకగా 'యుద్ధం' : నైతిక, ఆధ్యాత్మిక అర్థాలు.'

ఊహాప్రతిపాదన : 'తిక్కన భారతంలో 'యుద్ధం' కేవలం శారీరక పోరాటానికి కాకుండా, ధర్మాధర్మాల మధ్య అంతర్గత పోరాటం, నైతిక కష్టాలు, మానవ ఆత్మ ఆధ్యాత్మిక ప్రయాణానికి ఒక ప్రతీకగా పనిచేస్తుంది.'

అంతర్–గ్రంథ ఊహాప్రతిపాదన (Intertextual Hypothesis): ఈ ఊహాప్రతిపాదన, వేర్వేరు రచనల మధ్య కాలక్రమేణా జరిగే సంభాషణను అధ్యయనం చేస్తుంది. వివిధ రచనలలో ప్రధాన ఆలోచనలు, శైలులు ఎలా తిరిగి చెప్పబడ్డాయో చూస్తుంది. కొత్త సృజనాత్మకతకు అంతర్–గ్రంథత ఎలా సహాయపడుతుందో అన్వేషిస్తుంది. సాహిత్య ప్రేరణ, ఒకరి రచనల నుండి మరొకరు తీసుకోవడం లాంటి విషయాలను వెల్లడిస్తుంది.

పరిశోధనాంశం : 'బమ్మెర పోతన భాగవతంపై సంస్కృత భాగవత ప్రభావం: ఒక అంతర్–గ్రంథ అధ్యయనం.'

ఊహాప్రతిపాదన : 'బమ్మెర పోతన భాగవతం సంస్కృత భాగవతం నుండి కేవలం అనువాదంగా కాకుండా, తెలుగు సాహిత్య సంప్రదాయానికి, భక్తి ఉద్యమానికి అనుగుణంగా మూల గ్రంథంలోని కొన్ని విషయాలను, పాత్రలను, భక్తి భావాలను తిరిగి రాసి, విస్తరించింది.'

స్త్రీవాద ఊహాప్రతిపాదన (Feminist Hypothesis): ఈ ఊహాప్రతిపాదన, సాహిత్యం స్త్రీ, పురుష పాత్రలను ఎలా చూపిస్తుంది, వాటిని ఎలా ప్రశ్నిస్తుంది అని విశ్లేషిస్తుంది. పాతకాలపు చిత్రణలను విమర్శిస్తుంది, కొత్త ఆలోచనలను హైలైట్ చేస్తుంది. కాలక్రమేణా లింగ రాజకీయాలలో వచ్చిన మార్పులను చూడటానికి రచనలను ఉపయోగిస్తుంది. శక్తి పంపిణీ, పాతకాలపు పాత్రలను తిరిగి అర్థం చేసుకోవడంపై విమర్శనాత్మక చర్చను మొదలుపెడుతుంది.

పరిశోధనాంశం : 'ఆధునిక తెలుగు కథానికల్లో 'తల్లి' పాత్ర: పాతకాలం నుండి కొత్త ఆలోచనల వరకు.'

ఊహాప్రతిపాదన : 'ఆధునిక తెలుగు కథానికల్లో తల్లి పాత్రను చూపించే విధానం, కేవలం త్యాగం చేసేదిగా, ఇంట్లో ఉండేదిగా ఉన్న పాతకాలపు చిత్రం నుండి, సవాళ్లను ఎదుర్కొనే, పని చేసే, సొంత గుర్తింపును కోరుకునే బహుముఖ వ్యక్తిగా మారిందని భావించవచ్చు. ఇది స్త్రీవాద ఆలోచనలో ఒక ముఖ్యమైన మార్పు.'

పరిశోధనాంశం : 'తెలుగు దళిత స్త్రీల ఆత్మకథలలో జెండర్, కులం, అధికారం.'

ఊహాప్రతిపాదన : 'తెలుగు దళిత స్త్రీల ఆత్మకథలు (ఉదాహరణకు : నంబూరి పరిపూర్ణ, సదాలక్ష్మి, చిందుల ఎల్లమ్మ), కేవలం కుల వివక్షను మాత్రమే కాకుండా, పితృస్వామ్యం, జెండర్ వివక్ష, అధికార సంబంధాల సంక్లిష్టతలను స్పష్టంగా చూపిస్తాయి.'

ఉత్తర-వలసవాద ఊహాప్రతిపాదన (Postcolonial Hypothesis) : ఈ ఊహాప్రతిపాదన, వలస పాలన చరిత్ర కథ చెప్పే విధానాలను, ప్రధాన ఆలోచనలను ఎలా మార్చిందో అన్వేషిస్తుంది. ఆధునిక రచనలలో వలస పాలన ప్రభావాలు ఇంకా ఎలా ఉన్నాయో విశ్లేషిస్తుంది. సాహిత్యంలోని మార్పులను ఒక సంక్లిష్ట చారిత్రక సందర్భంలో ఉంచుతుంది. సాహిత్యాన్ని సామాజిక చరిత్రతో కలిపి అధ్యయనం చేయడానికి ప్రోత్సహిస్తుంది.

పరిశోధనాంశం : 'తెలుగు నవలల్లో 'పల్లెటూరు': వలస ప్రభావం, జాతీయవాద దృష్టికోణం.'

ఊహాప్రతిపాదన : 'బ్రిటిష్ వలస పాలన ప్రభావంతో, తెలుగు నవలల్లో పల్లెటూరును కేవలం ఆదర్శవంతమైన ప్రదేశంగా కాకుండా, వలస పాలన వల్ల దోపిడీకి గురైన, సామాజిక అసమానతలు ఉన్న ప్రదేశంగా చూపించడం పెరిగింది. అయితే, జాతీయవాద దృష్టికోణంలో అది మళ్ళీ ఒక సంస్కృతికి, నిరసనకు చిహ్నంగా మారింది.'

పౌరాణిక ఊహాప్రతిపాదన (Mythological Hypothesis) : ఈ ఊహాప్రతిపాదన, ఆధునిక రచనలలో పురాణాల ప్రభావం ఎలా కొనసాగుతుందో పరిశీలిస్తుంది. ఆధునిక సమస్యలను పరిష్కరించడానికి పౌరాణిక కథలను ఎలా తిరిగి ఉపయోగిస్తున్నారో విశ్లేషిస్తుంది. ప్రాచీన పురాణాలు ఎంత కాలం నిలబడతాయి? అవి ఎలా మారుతాయి? అని చూపిస్తుంది. పురాణాల శాశ్వత స్వభావాన్ని మారుతున్న కథన అవసరాలతో కలుపుతుంది.

పరిశోధనాంశం : 'తెలుగు సినిమాల్లో 'రావణుడు' పాత్రను తిరిగి చూపించడం: నైతిక గందరగోళాలు.'

ఊహాప్రతిపాదన : 'తెలుగు సినిమాల్లో రావణుడు పాత్ర కేవలం ఒక చెడ్డవాడిగా కాకుండా, అనేక లక్షణాలున్న వ్యక్తిగా, నైతిక గందరగోళాలతో, సమాజంలోని సంక్లిష్టతలను చూపించే విధంగా తిరిగి రాయబడింది. (ఉదాహరణకు: నందమూరి తారక రామారావు 'సీతారామ కళ్యాణం') అలాగే కర్ణుడి పాత్రను పరిశీలించవచ్చు.'

కథన ఊహాప్రతిపాదన (Narrative Hypothesis) : ఈ ఊహాప్రతిపాదన, కథ చెప్పే విధానాలు పాఠకులు కథను ఎలా అర్థం చేసుకుంటారో దానిపై దృష్టి పెడుతుంది. ఇది కథాంశం, కథ నడిచే వేగం, కథ చెప్పే వ్యక్తి దృక్కోణం లాంటి అంశాలను విశ్లేషిస్తుంది. కొత్త కథ చెప్పే పద్ధతులను అన్వేషించడానికి ప్రోత్సహిస్తుంది. కథలోని లోతు, పాఠకుడికి ఎంతవరకు చేరువ అవుతుంది అనే దానిపై నిర్మాణపరమైన ఎంపికలు ఎలా ప్రభావం చూపుతాయో అంచనా వేస్తుంది.

పరిశోధనాంశం : 'తెలుగు లఘు నాటికల్లో 'సంభాషణల వేగం', 'కథాభివృద్ధి' మధ్య సంబంధం.'

ఊహాప్రతిపాదన : 'తెలుగు లఘు నాటికల్లో (ఒక అంకపు నాటకాలు) సంభాషణలు నడిచే వేగం నాటకం ప్రధాన కథ అభివృద్ధిని, ముగింపును ప్రభావితం చేస్తుంది. వేగవంతమైన సంభాషణలు తరచుగా త్వరగా సంఘర్షణకు, పరిష్కారానికి దారితీస్తాయి.'

పరిశోధకుడు పరిశోధన అంశం ఆధారంగా ఊహాప్రతిపాదనను రూపొందించే విధానం – ఉదాహరణ

పరిశోధనాంశం : తెలుగు టీవీ సీరియల్స్‌లో ఆధునిక ఆడవాళ్ల పాత్రలు: ఉత్తర స్త్రీవాద దృక్పథం

ఊహాప్రతిపాదన : తెలుగు టీవీ సీరియల్స్‌లో ఆధునిక మహిళల పాత్రల చిత్రణ ఉత్తర స్త్రీవాద (Postfeminist) ఆలోచనలను స్పష్టంగా ప్రతిబింబిస్తుంది. ఈ సీరియల్స్ ఆడవాళ్ల సొంత నిర్ణయాలు, ఆర్థిక స్వేచ్ఛ, ఆధునిక జీవనశైలిని ఎక్కువ చేసి చూపిస్తాయని భావించవచ్చు. దీని ద్వారా, ఆడవాళ్లు తమ ఉద్యోగం, కుటుంబం, సమాజంలో 'అన్నింటినీ సాధించారు/ సాధించగలరు' అనే ఆలోచనను బలంగా చూపిస్తాయి. అయితే, ఈ పాత్రల చిత్రణ తరచుగా ఆడవాళ్ల బయటి అందం, ఆకర్షణపై ఎక్కువ దృష్టి పెడుతుంది. అంతేకాకుండా, పాతకాలపు ఆడ, మగ పాత్రల పద్ధతులకు భిన్నంగా కొనసాగే విధంగా ఆడవాళ్లపై ఒత్తిడిని పెంచుతాయి. ఈ సీరియల్స్ పైపైన ఆడవాళ్లకు అధికారం ఉన్నట్లు కనిపించినా, నిజానికి అవి మూడో తరం స్త్రీవాదానికి సంబంధించిన లోతైన సామాజిక, రాజకీయ సమస్యలను (ఉదాహరణకు: వ్యవస్థలో ఉన్న జెండర్ వివక్ష, ఇతర సమస్యలు) పట్టించుకోవు. దీని వల్ల ఉత్తర స్త్రీవాదం అనేది టీవీల్లో చూపించే ఒక ఆదర్శవంతమైనది కాదు. నిజ జీవితానికి దూరమైన ఆడవాళ్ల జీవితం, టీవీల్లో జీవితం భిన్నమని ఈ పరిశోధన చెప్పే ప్రయత్నం చేస్తుంది. ఇది ఆధునిక తెలుగు సమాజంలో ఆడవాళ్ల పాత్రలు, కోరికలు, సవాళ్లపై ఒక సంక్లిష్టమైన ప్రభావాన్ని చూపుతుంది.

ఊహాప్రతిపాదన ఆధారంగా అధ్యాయాల విభజన :

ఈ ఊహాప్రతిపాదనను నిజమో కాదో తెలుసుకోవడానికి ఈ అధ్యాయాలు సహాయపడతాయి :

పరిశోధన పరిచయం : ముఖ్యమైన సిద్ధాంతాల నేపథ్యం, పరిశోధన దేని గురించి : తెలుగు టీవీ సీరియల్స్ ఎలా మారాయి, సమస్య ఏమిటి : ఆధునిక ఆడవాళ్ల పాత్రలను చూపించడంలో ఉత్తర స్త్రీవాద ఆలోచనలు ఉన్నాయా లేదా.

పరిశోధనా ప్రశ్నలు : ఈ సీరియల్స్ ఉత్తర స్త్రీవాద ఆలోచనలను ఎలా చూపిస్తాయి? అవి ఆడవాళ్ల శక్తిని నిజంగా చూపిస్తున్నాయా?, పరిశోధన లక్ష్యాలు : ఉత్తర స్త్రీవాద ఆలోచనలను గుర్తించడం, వాటిని విశ్లేషించడం, సమాజంపై వాటి ప్రభావాలను తెలుసుకోవడం, ఊహాప్రతిపాదనను స్పష్టంగా చెప్పి, పరిశోధన దాని చుట్టూ ఎలా జరుగుతుందో వివరించడం , పరిశోధన పరిమితులు, ముఖ్యమైన పదాలకు అర్థాలు (స్త్రీవాదం, ఉత్తర స్త్రీవాదం, సాధికారత లాంటివి) మొదలైన అంశాలు..

అధ్యాయం 1 : స్త్రీవాదం, ఉత్తర స్త్రీవాదం: సిద్ధాంతాల పరిచయం

అధ్యాయం 2 : తెలుగు సీరియల్స్‌లో ఉత్తర స్త్రీవాద ఆలోచనల విశ్లేషణ

అధ్యాయం 3 : ఆర్థిక స్వేచ్ఛ, 'సూపర్ ఉమెన్' ఆలోచన

అధ్యాయం 4 : ఉత్తర స్త్రీవాదాన్ని చూపించడం – తెలుగు సమాజంపై, ముఖ్యంగా యువతపై ప్రభావం

ఉపసంహారం : ముగింపు, సూచనలు, భవిష్యత్ పరిశోధన

ముగింపు

సాహిత్య పరిశోధనలో ఊహాప్రతిపాదన అనేది ఏదో ఒక అంచనాతో మొదలవ్వడం మాత్రమే కాదు, పరిశోధకుడు చేసే పరిశోధనకు దారి చూపే ఒక ముఖ్యమైన విషయం. దీనివల్ల పరిశోధకుడు దేనిపై దృష్టి పెట్టాలో స్పష్టంగా తెలుస్తుంది, లోతుగా విశ్లేషించడానికి మంచి పునాది దొరుకుతుంది. ఊహాప్రతిపాదన సైన్స్, సోషల్ సైన్స్‌లకు మాత్రమే కాకుండా సాహిత్య అధ్యయనాల్లో ఇది చాలా అవసరం. సాహిత్యంపై పరిశోధన చేసేటప్పుడు, ఏ సమాచారం సేకరించాలి? ఎలా విశ్లేషించాలి? అని ఊహాప్రతిపాదన నిర్ణయిస్తుంది. దీనివల్ల అనవసరమైన విషయాలు పోగేసుకోవడం తగ్గిపోతుంది. సాహిత్య పరిశోధనలో ఊహాప్రతిపాదన ఒక గైడ్‌గా పనిచేస్తూ, పరిశోధనను ఒక క్రమ పద్ధతిలో, లక్ష్యంతో ముందుకు తీసుకెళ్తుంది. ఇది పరిశోధనను మొదలుపెట్టడానికే కాదు, దానికి ఒక మంచి నిర్మాణం కల్పించి, జ్ఞానం పెరగడానికి, లోతైన విశ్లేషణలకు సహాయపడుతుంది.

ఉపయోగించుకున్న పుస్తకాలు

తెలుగు

చంద్రశేఖర రెడ్డి, ఆర్., మరియు హెచ్.ఎస్. బ్రహ్మానంద. సాహిత్య పరిశోధనా సూత్రాలు. హైదరాబాద్: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, 1997.

జయప్రకాష్, ఎస్. పరిశోధన విధానం. హైదరాబాద్: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, 1992.

సూర్యనారాయణమూర్తి, కాకునూరి. పరిశోధన. హైదరాబాద్: అక్కెనపల్లి వెంకట్రాంరెడ్డి, 2022.

English

Crystal, David. The Cambridge Encyclopedia of the English Language. Cambridge: Cambridge University Press, 1995.

Popper, Karl. The Logic of Scientific Discovery. Routledge, 2002.

శిలాక్షరం

(బి.ఎన్.శాస్త్రి సాహిత్యం – సమాలోచన)

ప్రముఖ శాసన, చారిత్రక పరిశోధకులు, మూసీ పత్రిక వ్యవస్థాపకులు కీ.శే. బి.ఎన్.శాస్త్రిగారి రచనలన్నింటిపైనా సాధికారికమైన విశ్లేషణా వ్యాసాల సమాహారం 'శిలాక్షరం'.

సంపాదకులు : డా. భిన్నూరి మనోహరి

సహ సంపాదకులు : అట్టెం దత్తయ్య

వెల : 300/-



సంప్రదించండి.
మూసీ మాసపత్రిక
ఫోన్ : 934 7971177

మూసీ

సాహిత్య సాంస్కృతిక చారిత్రక మాసపత్రిక

మూసీ మాస పత్రిక సభ్యులుగా చేరండి

వెంటనే శాశ్వత చందాదారులు కండి.

సాహిత్య రంగంలో వెలువడుతున్న ఒకే ఒక పరిశోధనాత్మక వ్యాసాల మాస పత్రిక

యూజీసీ కేర్ లిస్ట్‌లో చేరిన తెలుగు పరిశోధనా పత్రిక

శాశ్వత సభ్యత్వం (10 సం॥లు)... 2500/-

సంప్రదించండి. మూసీ మాసపత్రిక... ఫోన్ : 934 7971177

జ్ఞానపీఠంపై భరద్వాజ 'మహర్షి'

✍ **డా. కొడోజు కృష్ణమూర్తి,** తెలుగు అధ్యాపకులు, ఎం.వి.ఎస్. ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మహబూబ్‌నగర్.
ఫోన్ : 85001 67845



"ఒక చిరునవ్వు ముందు, ఒక దయామయమైన చూపుముందు, ఒక అద్భుతమైన ఆత్మీయ కరచాలనము ముందు ఏ పురస్కారాలు ప్రశంసలు సరిపోవు" అన్న నిష్కామయోగి రావూరి భరద్వాజ. అశేష సాహితీమూర్తుల ప్రశంసలు పొందిన నిరాడంబర మూర్తి. కీర్తి విశేషణాలకు అందనివారు. పురస్కారాల కొరకు సత్కారాల కొరకు నమస్కారాలు చేయని సంస్కారవంతమైన ప్రతిభాశాలి. వైవిధ్య భరితమైన జీవితాన్ని అనుభవాలను కలిగి ఉండడమే జీవితం యొక్క అంతఃసూత్రం అని గ్రహించినవారు. వినయ విధేయతల అవతార మూర్తి. సమాజమే విద్యాలయంగా సామాజిక స్థితిగతులను పాఠాలుగా వాస్తవ పరిస్థితుల అధ్యయనమే ప్రయోగశాలగా జీవిత సత్యాన్ని లోకానికి చూపించిన మనోవిజ్ఞాన శాస్త్రవేత్త, దిగ్గంతులైన సాహితీవేత్త.

తెలుగు సాహితీ ప్రపంచంలో ఒక కాంతిపుంజంగా విలసిల్లిన రావూరి అవిభక్త హైదరాబాద్ సంస్థానానికి చెందిన పరిటాల జాగీర్, ఇప్పటి కృష్ణాజిల్లాలోని మొగులూరు గ్రామంలో 1927 జూలై 5వ తేదీన జన్మించారు. తండ్రి పేరు రావూరి కోటయ్య, తల్లి పేరు రావూరి మల్లికాంబ. పెరిగింది గుంటూరు జిల్లాలోని తాడికొండ గ్రామంలో. బాల్యం నుండే బాధలను భరించడం అలవాటుగా చేసుకున్నవారు. నిరుపేద కుటుంబంలో జన్మించిన కారణంగా చిన్నతనంలోనే కుటుంబ భారాన్ని మోయవలసి వచ్చింది. వ్యవసాయ కూలీగా, పశువుల కాపరిగా, రంపంలాగే వాడిగా, తిత్తులు ఊదేవాడిగా, పేపర్ బాయ్‌గా అన్నిరకాల పనులు పనిచేశారు. ఒక కార్మికుడిగా కర్షకుడిగా శ్రామికుడిగా పొందిన అనుభవాలే ఈ వ్యథార్థ జీవుని యథార్థ జీవితం.

అనుభవాల ఉలితో తనను తాను ఓర్పుగా తీర్చిదిద్దుకున్న నేర్పరియైన శిల్పి తాను. చదివింది తక్కువే. ఆత్మాభిమానాన్ని చంపుకొని బతకడం సాధ్యం కాలేదు వారికి. ఎనిమిదవ తరగతిలో ఉన్నప్పుడు వారి ఆర్థిక పరిస్థితి బాగోలేక చినిగిన చొక్కాను ధరించినందుకు గురువుగారు మందలించారని బడి మానేసిన ఆత్మాభిమానం వారిది. తరువాత ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొంటూ జీవన సమరం సాగించినవారు. ఒకానొక సందర్భంలో వారి నాన్నగారు మందలిస్తే ఊరి గుడిలో కాలం గడిపి, ఊరి చెరువు నీళ్లు తాగి ఆకలి మంటలు చల్లార్చుకున్నవారు. తెలిసినవారు పిలిచి ఒక ముద్ద పెడితే కృతజ్ఞతా భావం చూపినవారు.ఎన్నో అవమానాలను చీదరింపులను ఎదుర్కొన్న జీవన పయనం వారిది. అడుగడుగునా పిడికెడి మెతుకుల కోసం అల్లాడిపోతూ అనుక్షణం అభద్రతాభావంతో బతుకు బండి లాగినవారు. ఎటువంటి ప్రతికూల పరిస్థితులున్నా నిజాయితీగా తన జీవన సమరాన్ని సాగించారు. తన జన్మకు ఒక సార్థకత చేకూరాలని బలమైన సంకల్పంతో పాటు గొప్ప ఆత్మస్థైర్యం ఆయన విజయానికి కారణం.

యుక్త వయసులో తెనాలి చేరి అక్కడ పొట్టకూటి కోసం ఒక ప్రెస్ లో పనిచేయడం ప్రారంభించారు. తర్వాత 1946లో **'జమీన్ రైతు'** వారపత్రికలో సంపాదకీయ విభాగంలో చేరారు. అప్పటికే ఆత్రేయ ఆ విభాగంలో పనిచేస్తున్నారు. తెనాలి జీవితం ఆయన సారస్వత వ్యక్తిత్వాన్ని మార్చివేసింది. అంచెలంచెలుగా ఎదుగుతూ 1948లో **'దీనబంధు'** వారపత్రికకు సంపాదకుడిగా బాధ్యతలు నిర్వర్తించారు. ఆలపాటి రవీంద్రనాథ్ గారి వల్ల జ్యోతి, రేరాణి, అభిసారిక, చిత్రసీమ, సమీక్ష, సినిమా, యువ వంటి పిరియాడికల్స్ లో ప్రయోగాత్మక అనుభవాన్ని తనదైన శైలిని అభివృద్ధి పరచుకో గలిగాడు. 'జమీన్ రైతు' ఆయన్ని జర్నలిజం రంగంలోనికి రావడానికి మార్గం సుగమం చేసిందని చెప్పొచ్చు. ఈ క్రమంలో సుప్రసిద్ధులైన ఆలూరి భుజంగరావు, గుడిపాటి వెంకటాచలం, త్రిపురనేని గోపీచంద్ తో పాటు సమకాలీన రచయితలతో రావూరికి పరిచయం ఏర్పడింది.

పాతిక రూపాయల ఉద్యోగంతోనే బ్రతుకుబండి నడిపారు రావూరి. కొన్నాళ్ల తర్వాత ఆలపాటి రవీంద్రనాథ్ గారితో మాట పట్టింపు వచ్చి ఉద్యోగం మానేశారు. కథలు రాసుకుంటూ వచ్చే డబ్బుతో కొంతకాలం గడిపారు. తరువాత 1955 డిసెంబర్ మాసంలో బ్రతుకుతెరువుని వెతుక్కుంటూ మద్రాస్ చేరుకున్నారు. తెలిసిన వాళ్ల ప్రోత్సాహంతో ఆయా పత్రికలకు కథలు రాస్తూ బతకడం నేర్చుకున్నారు. ఈ క్రమంలోనే మద్రాస్ మహానగరం వీరికి అనేక పాఠాలు నేర్పింది. అనేకమంది రచయితలతో పత్రికా సిబ్బందితో పాటు సినిమా వాళ్ళతో పరిచయాలు ఏర్పడ్డాయి.

పాకుడురాళ్ళు నవలకే కాదు ఆయన రాసిన చాలా రచనలకు భూమిక మద్రాస్ నగర జీవనవిధానమే. చక్రపాణి గారు యువ మాసపత్రికను భాగ్యనగరంలో ప్రారంభించారు. భరద్వాజ గారి ప్రతిభాపాటవాలు తెలిసిన లక్ష్మీనారాయణ గారి వల్ల 1959 ఏప్రిల్ లో మద్రాస్ నుండి భాగ్యనగరానికి రాగలిగారు. తొలిసారిగా ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం నుండి **"నా పుస్తకాల బీరువా"** అన్న ప్రసంగం చేశారు . పాఠశాలలో చదివింది పూర్తి చేసింది ఏడు తరగతులే కానీ అవమానాలు ఆకలి పేదరికంలోని బాధలు కన్నీళ్లు కష్టాలు ఈసడింపులు లాంటి ఒక్కొక్క అంశంలో ఒక్కో స్నాతకోత్తర పట్టభద్రుడు రావూరి భరద్వాజ. గోపీచంద్ గారి ప్రోత్సాహం ప్రోద్బలం వల్ల 1959లో ఆల్ ఇండియా రేడియోలో ప్రవేశించ గలిగారు. ఆ రోజుల్లో ప్రభుత్వోద్యోగానికి కావలసిన కనీస అర్హత పదవ తరగతి ఉత్తీర్ణత . రావూరి గారి వయస్సు చదువు అందుకు ప్రతిబంధకాలుగా ఉన్నాయి. రేడియోతో ఆయనకంతకు ముందున్న పరిచయం తక్కువే. 1950– 52 మధ్యలో ఆయన రాసిన **'నికషం'** అనే నాటిక ఆకాశవాణి విజయవాడ కేంద్రం నుంచి ప్రసారమైంది. తర్వాత 1956లో మద్రాస్ ఆకాశవాణి కేంద్రం నుండి ప్రసారమైన ఒక నాటికలో తొలిసారి పాత్రధారిగా వీరు పాల్గొన్నారు.

180 రూపాయల నెల జీతంతో ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం గ్రామస్తుల కార్యక్రమ విభాగంలో స్క్రిప్ట్ రైటర్ గా 1959 నవంబర్ 25వ తేదీన భరద్వాజ ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రంలో అడుగు పెట్టారు. ఇక్కడే 28 సంవత్సరాల తన సుదీర్ఘ ప్రయాణంలో అనేక అద్భుతాలు సృష్టించారు. ఎన్నో ఉత్థాన పతనాలను ఎదుర్కొన్నారు. మనుషుల్లో ఎలాంటి మహోన్నతమైన వ్యక్తిత్వం గలవారు ఉంటారో అంతే అధమాధములు ఉంటారని గ్రహించారు. అయితేనేం రేడియో కోసం వైవిధ్యమైన రచనలతో శ్రోతలను ఆకట్టుకునే ప్రజ్ఞాపాటవాలు ఆయనలో బహుముఖంగా దర్శనమిచ్చాయి. రేడియో ప్రసంగాలు రూపకాల నిర్మాణాలు ఆయన్ను లబ్ధప్రతిష్ఠులుగా నిలబెట్టాయి. ఎందరో దేశీయ జాతీయ ప్రముఖులను రేడియోకి పరిచయం చేశారు వీరు. ప్రతిబంధకంగా నిలిచిన తన విద్యార్హతలు తనని మూగవానిగా నిలబెట్టినా తాను నిర్వహించిన ప్రతి కార్యక్రమం కళాత్మకంగా చిత్రించే ప్రతిభాశక్తి కళాఖండంగా మార్చిన యుక్తి ప్రతి హృదయాన్ని ప్రతిస్పందింపజేసే నేర్పు ఆయన సొంతం. అందుకు ఆయన నిర్వహించిన రేడియో కార్యక్రమాలే సజీవ సాక్ష్యాలుగా నిలబడతాయి.

భరద్వాజలోని మానవీయ దృక్పథాన్ని విశ్వ మానవతావాదాన్ని కూడా పరిగణలోకి తీసుకొని 1975 మే నెలలో ఆకాశవాణి హైదరాబాదు కేంద్రం ప్రసంగ కార్యక్రమాల ప్రయోక్తగా నియమించింది. తన పదవీ విరమణ వరకు 12 ఏళ్లు నిరంతరాయంగా కార్యక్రమాల రూపకల్పనలో నిమగ్నమై ఉన్నారు వారు. రేడియో కార్యక్రమాల స్క్రిప్ట్ రచయితగా నాటక రచయితగా ఫీచర్ రచయితగా ప్రసంగ కార్యక్రమాల ప్రయోక్తగా బహుముఖంగా తన ప్రజ్ఞను ప్రదర్శించి ఆకాశవాణి కేంద్రంలో తనదైన ముద్రను వేయగలిగారు. హైదరాబాద్ ఆకాశవాణి కేంద్రంలోని మహామహుల్లో ఒకరుగా చిరస్థాయిగా గుర్తుండిపోయే విలక్షణమైన వ్యక్తిత్వం రావూరి భరద్వాజ గారిది. కృష్ణశాస్త్రి ,ముని మాణిక్యం, నాయని సుబ్బారావు, గొల్లపూడి మారుతిరావు, దాశరథి , వేలూరి సహజానంద, వాడ్రేవు పురుషోత్తం, మంచాల జగన్నాథరావు లాంటి పుంభావ సరస్వతుల సాన్నిహిత్యం సహచర్యం ఆకాశవాణిలో లభించింది.

"యథార్థాన్ని ఉన్నదున్నట్లుగా చిత్రించే పని కెమెరాది. రచయితకు అంతకన్నా ఎక్కువ బాధ్యతలు ఉన్నాయి" అని నమ్మినవారు భరద్వాజ. యథార్థతకు కాల్పానికితను జోడించి అందంగా సమన్వయించి చెప్పడంలో ఆయనది అందెవేచిన చేయి. సూక్ష్మ వివేచన, లోతైన విశ్లేషణ, స్పష్టమైన వివరణ ఆయన రచనల్లో కనబడుతుంది. సాహిత్య కీర్తిపతాకను దశదిశలా చాటిన రావూరి **'ఆకలి నా రచనలకు ప్రేరణ'** అని చెప్పుకున్నారు. తన తండ్రి రావూరి కోటయ్య, అమ్మమ్మ మొగులూరు సుబ్బమ్మ గార్ల కథలు చెప్పే సామర్థ్యం ఆకట్టుకునే కథనిర్మాణం భరద్వాజకు ఈ రంగంలో ఆసక్తిని కలిగించాయి. వీరు 17వ ఏట నుండి రచనలు చేయడం ప్రారంభించారు. తొలి కథ **విమల** ఇది 1946 ఆగస్టు ఆఖరి వారంలో గూడవల్లి రామబ్రహ్మం గారు ఎడిటర్ గా ప్రజామిత్ర వారపత్రికలో అచ్చయ్యింది. 1950లో **రాగిణి** కథా సంపుటిని శారవల్లి గారు అచ్చు వేసినారు ఈ కథా సంపుటికి చలం పరిచయ వాక్యం రాశారు. ఇది సార్వజనీన మానవ గాథల కథా సంపుటి. రావూరి గారి **'దైవ రాజకీయాలు'** కథకు స్వర్ణ కంకణం అందుకున్నారు. మొదట్లో పొట్ట నింపుకోవడం కోసం కలం కార్మికుడిగా సాహిత్యంలోకి ప్రవేశించారు. తరువాత కాలంలో సమాజంలో మార్పును చైతన్యాన్ని ఆశించి మానవాళి మనుగడకు మానవత్వానికి మార్గదర్శకంగా రచనలు చేశారు. వీరు తన కలానికున్న బలాన్ని తెలిసినవారు. తాను నివసిస్తున్న వ్యవస్థ పట్ల బాధ్యత, గౌరవంతో పాటు గొప్ప అవగాహన గల రావూరి తన సాహిత్య పటిమతో బడుగు వర్గాల నిజజీవిత కష్టాలను స్వానుభవంతో అర్థం చేసుకొని వాటిని తన రచనలలో ప్రతిబింబించారు. తెలుగు రచనా ప్రపంచంలో వినూత్న పద్ధతుల్లో కథాకథనాలకు శ్రీకారం చుట్టినవారు. సామాన్యుల భాష, యాస, ఆవేశాలు, ఆలోచనలు, కోపాలు, తాపాలు వాటి తాలుకు అనుభవాలను తన రచనల్లో ప్రదర్శించారు.

భరద్వాజ సుమారు 180 పైగా పుస్తకాలు, 500కు పైగా కథలు, 17 నవలలు, 10 నాటకాలు, 11 సాహిత్య గ్రంథాలు, 43 బాలల కథలు, 33 సైన్స్ కథలు, మూడు వ్యాస ఆత్మకథ సంపుటాలు, పంచ స్మృతి కావ్యాలు రాశారు. ఒక మానవ మాత్రుడు ఎంత శ్రమిస్తే

ఇంతగా రాయగలడు? జీవిత సారాన్ని అర్థవంతంగా మార్చుకొని సార్ధకతను సాధించిన వారే మహా పురుషులు అవుతారు. అటువంటి వారే రావూరి భరద్వాజ గారు.

భారతావని స్వాతంత్ర్యసంబరాలు జరుపుకుంటున్న ఆగస్టు 15 రోజున ఆకలితో అలమటించి తినడానికి పిడికెడు అన్నం దొరకక రెండు దోసిల్ల నీళ్లు తాగి కడుపు నింపుకున్న ఓ అభాగ్యుడు తెలుగు సాహిత్య సామ్రాజ్యానికి కిరీటం లేని రారాజుగా ఎదుగుతాడని ఎవ్వరూ ఊహించి ఉండరు. ఆయనే అరిషడ్వర్గాలను జయించిన నిరాడంబర మూర్తి రావూరి భరద్వాజ. విద్యాసంపద గాని, ఆర్థిక సంపద గాని, భూ సంపద గాని పెద్దగా లేని కుటుంబ నేపథ్యంలో పుట్టడం వల్ల అందులో ఉండే ఇబ్బందులన్నీ తన చిన్నతనంలో అనుభవించానని చెప్పుకున్నారు. ఇలా వారి అంతరంగానికి ఎన్నో కోణాలు. భయంకర దరిద్రం తనకెన్నో పాఠాలు నేర్పిందని ఆ నేర్చిన పాఠాలనే తన రచనలలో కూర్చానని అలానే తీవ్రమైన కుల, మత, ఆర్థిక వివక్షతను కూడా ఎదుర్కొన్నానని చెబుతారు. అవాంఛనీయ శక్తుల విషంకక్కే స్వభావాన్ని కంఠంలో దాచుకున్న పరమ శివుడాయన. అవమానం, అవిద్య, హేళన, దూషణ ,పేదరికం, ఆకలి, ఆవేదన, వంచన, ఈర్ష్యాద్వేషాలు అడుగడుగున అనుభవించిన దశావతార మూర్తిగా దర్శనమిస్తారు భరద్వాజగారు. అపారమైన జీవితానుభవం వీరి సొంతం. వారి సునిశిత పరిజ్ఞానంతో కూడిన వివేచన, విశ్లేషణ తెలుగు సాహిత్య లోకంలో అజరామరమైన కీర్తిని పొందడానికి దోహదం చేశాయి.

భరద్వాజ విస్తృతానుభవాల భూమికగా సాగిన సాహితీ సేద్యం అనన్య సామాన్యమైన సాహిత్య సృజనకు కారణభూతమై భాసిల్లింది. విచిత్రమైన మానవ భావోద్వేగాలే ప్రధాన అంశాలుగా పాత్ర చిత్రీకరణలో నేర్పు సన్నివేశాల కల్పన కూర్పు వీరి సాహిత్యం ఉత్కృష్ట స్థాయికి చేరడానికి దోహదమయ్యాయి. వీరిని తెలుగు సాహిత్య లోకంలో సగర్వంగా నిలబెట్టిన రచనలు అనేకం ఉన్నాయి. వారు రాసిన కథ సంకలనాలు కొన్ని ఉదాహరణంగా చెప్పవచ్చు. అందులో ప్రధానంగా **అర్ధాంగి, గాలిపటం, జాలి గుండె, దైవ రాజకీయాలు, రాగిణి, జయంతి, దావానలము, కథాసాగరము, అపరిచితులు, అపశ్రుతి, ఆహుతి, శ్రీరస్తు, సిరికింజెప్పడు, సౌదామణి, మచ్చుకో చచ్చు కథా, మొనలేని శిఖరం, మూఢనిద్ర, నిన్నుగురించిన నిజం, మళ్లీ తెలవారింది, మానవుడు దానవుడు, మానవుడు మరణిస్తున్నాడు, నర(క)లోకం కోసం, పాలపుంత, అన్యథా శరణం నాస్తి, పుత్రకామేష్టి, కొత్త చిగుళ్ళు, కల్పన, మనోరథం, మేనక, స్వయంవరం, విచిత్ర ప్రపంచం, వసుంధర, వసు చరిత్ర, విజయ విలాసం, వినదగు** లాంటి 37 కథా సంపుటల్లో 500కు పైగా కథలు ఇందులో దర్శనమిస్తాయి.



అట్లాగే వీరు 17 నవలల్ని తెలుగు సాహిత్య లోకానికి అందించారు. వాటిలో ప్రధానంగా **కాదంబరి, కరి మింగిన వెలగపండు, చంద్రముఖి, చిత్రగ్రహం, ఒక రాత్రి ఒక పగలు, జీవన సమరం, పాకుడు రాళ్లు, రాజపుత్ర రహస్యం, సాహస విక్రమార్క, శిథిల సంధ్య, తోడుదొంగలు, వీరగాథ, ఆ కళ్ళు, జల ప్రళయం, నామేధ నాకే జాలిగా వుంది, ఇదం జగత్ మరియు తెలుసుకుంటూ ..తెలుసుకుంటూ...**

రావూరి భరద్వాజ గారు పిల్లల కోసం కూడా కొన్ని నవలలు రాశారు అందులో ప్రధానంగా **ఉడత ఉపదేశం, కీలుగుఱ్ఱం, మనీ మందిరం, చిలుకతీర్పు, పరకాయ ప్రవేశం, మాయాలోకం.**

భరద్వాజ గారి సాహిత్య వ్యాసాలు తెలుగు సాహిత్య లోకంలో చెప్పుకోదగ్గవిగా గుర్తింపబడ్డాయి. వాటిలో ప్రధానంగా **ఇనుప తెర వెనుక, కంచికి వెళ్ళిన కథ, నేనెందుకు రాస్తున్నాను, మహతి, మొగ్గ తొడిగిన ఎర్ర గులాబీ, శూన్యం నుండి సృష్టి.**

అట్లాగే వీరు స్మృతి కావ్యాలు కూడా రాశారు. అందులో **అంతరంగిని, అయినా ఒక ఏకాంతం, ఐతరేయం, నాలోని నీవు, ఒకింత వేకువకోసం...** వీటితో పాటు వీరు విజ్ఞాన సాహిత్యగ్రంథాలు కూడా రాశారు. అందులో ప్రధానంగా **చెత్త నుండి విత్తనం, నిప్పుకథ, అవని ఆకాశం, వ్యర్థం నుండి అర్థం** వంటివి సైన్స్ భూమికగా వచ్చిన సాహిత్య పుస్తకాలు. వీరి సాహిత్య కృషికి గాను 1980లో ఆంధ్ర విశ్వవిద్యాలయం, 1987లో జవహర్లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం, నాగార్జున విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్లు ప్రదానం చేసి గౌరవించాయి.

రావూరి భరద్వాజ గారిని వరించిన పురస్కారాలు :

1980లో కళా ప్రపూర్ణ ఆంధ్ర విశ్వవిద్యాలయం వారు ఇచ్చారు.

1983 కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం,

ISSN 2457-0796



1985 సోవియట్ భూమి నెహ్రూ పురస్కారం, (ఇనుప తెరవెనుకకు లభించింది.)

1987 రాజ్యలక్ష్మి ఫౌండేషన్ అవార్డు

1987 తెలుగు కళా సమితి కేవీరావు జ్యోతిరావు అవార్డు

1997లో తెలుగు విశ్వవిద్యాలయం నుండి సాహిత్యంలో విశిష్ట పురస్కారం

2007లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ కళారత్న అవార్డు

2008లో లోక్‌నాయక్ ఫౌండేషన్ పురస్కారం

2011లో కేంద్ర సాహిత్య అకాడమీ వంగూరి ఫౌండేషన్ గోపీచంద్ జాతీయ సాహిత్య పురస్కారాలు

2012లో జ్ఞానపీఠ అవార్డు తెలుగు సాహిత్యానికి ఆయన చేసిన బహుముఖమైన కృషికి దక్కింది.

ద్వైదీ భావాల మేళవింపును సమన్వయం చేసుకుంటూ వారి జీవన పథం సాగింది. జీవితం సుఖదుఃఖాల, యథార్థాల, కాల్పనికాల, చీకటి వెలుగుల సమన్వయంలా ఆయన జీవితమంతా కొనసాగింది. మే 28, 1948లో కాంతం గారితో వివాహం వారి జీవిత పుస్తకంలో అపురూపమైన ఆనందదాయకమైన అధ్యాయం. కాంతమ్మ గారు ఉన్నత కుటుంబంలో నుంచి వచ్చినా ఎప్పుడు ఎక్కడ ఆ ఛాయల ప్రభావం కనిపించనీయలేదు. వీరికి ఐదుగురు సంతానం నలుగురు అబ్బాయిలు రవీంద్రనాథ్, గోపీచంద్, బాలాజీ, కోటేశ్వరరావు, ఒక అమ్మాయి పద్మావతి. భరద్వాజకు మనోధైర్యాన్ని మనశ్శాంతిని ప్రసాదించిన ఉదాత్తమైన భావాలు నిండిన ఇల్లాలుగా కాంతమ్మ గురించి చెప్తూ అమాయకుడైన బిడ్డను తెలివైన తల్లి ఎలా ప్రేమగా చూసుకుంటుందో అలా తన భార్య కాంతం చూసుకున్నదని ఆమె ఒక బంగారు తల్లి అని అందుకే ఆమెను కాంతమ్మ అని అనేవాణ్ణి అని ఆర్ద్రత నిండిన హృదయంలో కాంతమ్మ గారి గురించి చెప్తారాయన. చివరివరకూ ఆమే తన సర్వస్వంగా జీవించాడు. 1986లో అక్టోబర్ 18న కాంతమ్మ గారు తిరిగిరాని లోకాలకు తరలి వెళ్లారు. ఈ వియోగాన్ని భరించని భరద్వాజ వేదననంతా తనలోనే ఇముడ్చుకొని, తన ప్రేమను కవిత్వీకరిస్తూ ఆమె ఆరాధనలో చరమజీవితాన్ని గడిపారు. 1956 నుండి ఆమె కోసం తన డైరీలో రాసుకున్న మధురస్మృతులన్నీ త్రిపురనేని సుబ్బారావు గారి సూచన మేరకు స్మృతి సాహిత్యంగా ఐదు పుస్తకాలుగా ఆవిష్కరించారు. అంతరంగిని, అయినా ఒక ఏకాంతం, ఒకింత వేకువ కోసం, ఐతరేయం, నాలోని నీవు రచనలు కాంతమ్మ గారిపై అవ్యాజమైన ప్రేమకు నిదర్శనాలుగా నిలబడతాయి. అద్భుతమైన స్మృతి పంచ కావ్యాలుగా సాహిత్య లోకంలో ప్రశాంశలు అందుకున్నాయి.

"సాహిత్య క్యాన్వాసుమీద వర్ణరంజిత జీవిత చిత్రాలను అత్యద్భుతంగా చిత్రించిన అక్షర చిత్రకారుడుగా" కొనియాడబడిన రావూరి భరద్వాజ తెలుగు సాహిత్యలోకం గర్వించదగ్గ రచయిత. భారతదేశంలోని అత్యున్నతమైన సాహితీ పురస్కారం జ్ఞానపీఠం. భరద్వాజ గారి సాహితీ సృజనకందిన గొప్ప బహుమానం. వీరి నిరంతర సాహితీ తపస్సుకు నిదర్శనం ఈ జ్ఞానపీఠం. సమున్నతమైన ఆ జ్ఞానపీఠంపై ఆయన్ను సగర్వంగా నిలబెట్టిన నవల పాకుడురాళ్ళు. మాయ జలతారు పేరుతో కృష్ణపత్రికలో ధారావాహికంగా వచ్చిన ఈ రచన మల్లంపల్లి సోమశేఖర శర్మ సూచన మేరకు పాకుడురాళ్ళు నవలగా అవతరించింది. శీలా వీర్రాజు గారి సలహామేరకు ఈ మాయ జలతారు పేరును పాకుడురాళ్లుగా మార్చారు భరద్వాజ. ఇది తెలుగు సాహిత్యానికి మూడో జ్ఞానపీఠాన్ని తెచ్చి సాహితీ వినీలాకాశంలో ధ్రువతారగా నిలిచి పోయింది.

ఊహకు వాస్తవానికి, భావనకి బతుక్కి మధ్య కొద్ది తేడాలు ఉ ఒడటం వేరు అపారమైన భేదాలు ఉండడం వేరు.. అని భావించిన భరద్వాజ సినీరంగం నేపథ్యంగా రాసిన నవలే పాకుడురాళ్లు. సినిమా ఒక రంగుల ప్రపంచం. సినిమా రంగానికి సంబంధించిన అనేక వాస్తవాంశాలను క్రోడీకరించి అద్భుత కల్పనా చాతుర్యంతో నడిచిన నవల యిది. ఇందులోని పాత్రలు యథార్థ జీవితానికి ప్రతిబింబాలు. పల్లెటూరి అమ్మాయి మంగమ్మ సినిమా అగ్రతార మంజరిగా ఎదిగిన సంఘటనలే సమాహారమే పాకుడురాళ్లు. ఉత్థాన పతనాలను ఎదుర్కొంటూ సాగిన మంజరి పాత్ర ఈ నవలలో ప్రధానకనిపిస్తుంది. పాత్ర ఆమెతోపాటు కళ్యాణి, చలపతి, రాజమణి, వసంతశర్మ, తాయారు లాంటి పాత్రలతో అల్లుకున్న నవల యిది. సినిమా అన్నది ఒక కళాత్మకమైన వేదిక. ఇప్పుడది కళ గా కాకుండా విలువలను ఆదర్శాలను, బాధ్యతను మరిచి వ్యాపార ధోరణిలో కూరుకుపోయింది. సామాన్య స్థితి నుండి అసామాన్య పయనం సాగించిన మంజరి వంటి సినీతారల తెరవెనుక జీవితం ఆసక్తికరంగా చిత్రించారు రావూరి. వీరు కొన్నాళ్లు సినిమా పత్రికల్లో పని చేయడం వల్ల సినిమా

రంగంలో ఉన్న ఒడిదుడుకులను, రాజకీయాలను, ఎత్తుపల్లాలను దగ్గరుండి గమనించారు. సినిమా వాళ్ళ చితికిన బ్రతుకులు చీకటి కోణాలు అడిగి తెలుసుకున్నారు. ఆ విషయాలనే ఇతివృత్తంగా నవలా రూపంలో అక్షరబద్ధం చేశారు. అగ్రతారగా ఎదగడం ఒక ప్రస్థానం దాన్ని నిలబెట్టుకోవడం మరో ప్రస్థానం. విభిన్న మనస్తత్వాల మధ్య కుదిరిన భిన్నత్వంలో ఏకత్వం చెదిరిన ఏకత్వంలో భిన్నత్వాన్ని చూసిన అనుభవం తనది. మంజరి మనసు శరీరం వేరువేరుగా పయనించిన తీరు పాకుడురాళ్ళలో కనిపిస్తుంది. మనసుకు తగిలిన గాయాల్ని శరీరం పొంది అనుభవాన్ని మూసుకుంటూ ఆకాశమంత ఎత్తుకు ఎదిగిన మహానటి మంజరి **"జీవితమే పాకుడురాళ్లు. జీవితంలో విషాదం డబ్బు లేకపోవడం కాదు, మనల్ని ప్రేమించే వాళ్ళు లేకపోవడం మనం ప్రేమించడానికి ఎవ్వరూ దొరక్క పోవడం"** అంటాడు భరద్వాజ.

భరద్వాజ గారి కథల్లో సామాజిక జీవన నేపథ్యం కనిపిస్తుంది. వారి రాసిన కొన్ని కథల్ని పరిశీలిస్తే సమసమాజ నిర్మాణానికి వారి సంకల్ప తీవ్రత తెలుస్తుంది సమాజాన్ని పూర్తిగా అర్థం చేసుకున్న వారు మన చాతుర్వర్ణ వ్యవస్థలో ఉత్పత్తి కులాల ఆర్థిక స్థితిగతులను జీవనోపాధి కొరకు పడుతున్న ఇబ్బందులను తన కథలలో కథల ద్వారా ప్రపంచానికి చాటి చెప్పారు. అన్ని కులాల వారిని, అన్ని వృత్తుల వారిని తనవారిగా భావించిన నిష్కామయోగి వీరు. తను రాసిన కథల్లో సమాజపు దుఃఖాన్ని అంతా తనలో నింపుకొని యథార్థ జీవితాన్ని చిత్రించే ప్రయత్నం వుంటుంది. ఆయా జీవితాల్లో వారికి తగిన గాయాలు, కన్నీళ్లు వీరి కథల్లో కనిపిస్తాయి. భరద్వాజ గారి కథల్లో చాల కులవృత్తుల ప్రస్తావన కనిపిస్తుంది. జీవితంలో పలు విధాలుగా అనేక ఒడిదుడుకులను ఎదుర్కోవడం వల్ల భరద్వాజ గారు అన్ని కులవృత్తుల్లో ఉన్న కష్టనష్టాల్ని కథలుగా నిర్మించారు.

'కుడి ఎడమల దగాధగా' అనే కథలో కమ్మరి కులవృత్తుల వారి జీవన విధానం వారికున్న నైపుణ్యాన్ని తెలియజేశాడు. **'రెక్కాడితే కానీ డొక్కాడదు'** కథ ద్వారా వడ్రంగి కులస్తుల గురించి **'కాదేదీ శిల్పికి అనర్హం'** కథలో శిల్పివృత్తి సంబంధిత విషయాలను వివరించారు. అట్లాగే **'గుడ్డు చాకిరి గుడ్డకు కరువు'** కథలో పద్మశాలీల జీవితం వారు ఎదుర్కొంటున్న సమస్యల్ని రామస్వామి పాత్ర ద్వారా వివరించారు. **'సారె సారెకున్'** కథలో గురువయ్య పాత్ర ద్వారా కుమ్మరి వృత్తి గురించి, **'కేశోపనిషత్తు'** కథ మంగలి వృత్తి చరిత్రతో పాటు వారి దీనస్థితిని వివరించారు. **'మనిషి కన్నా మృగన్నయం'** కథలో రామస్వామి ఎలుగుబంటిని ఆడిస్తూ తన కడుపు నింపు కోవడం ఎలుగుబంటితో మనిషికున్న అనుబంధం ఈ కథలో కనిపిస్తుంది. **'లింగతో పోచ అటుపోదు ఇటు రాదు'** కథ ద్వారా బెస్త వృత్తి గురించి బ్రతుకుతెరువు కోసం వారు చేసే సాహసం గురించి తెలిపాడు. **'తలకుండు విషము ఫణికిని'** కథలో పాములు



పట్టే వారి గురించి, **'పది వేళ్ళు పనిచేస్తాయి'** కథలో ప్లాస్టిక్ వైర్ కుర్చీల అల్లకం గురించి **'తాజ్ మహల్ నిర్మాణానికి'** కథలో మేస్త్రీ పని గురించి **'చేదు విషం –జీవన ఫలం'** కథలో సైకిల్ పంచర్లు వేసే వారి జీవితం ఇతివృత్తంగా సాగిన కథ ఇది. ఇందులో మస్తాన్ పాత్ర నిర్మాణం ఆనాటి సైకిల్ పంచలు వేసే వ్యక్తుల జీవితానికి నిలువుటద్దం. **'ఛత్రపాణి'** కథలో రోడ్డుపైన గొడుగులు తయారు వాటి మరమ్మత్తులు చేసే శంకరయ్య పాత్ర ద్వారా వారి దుర్భర జీవితాన్ని చిత్రించారు. **'బూజు బతుకును చూడు'** కథలో బాల కార్మికుడి బ్రతుకు పోరాటం కనిపిస్తుంది. ఊరు తిరుగుతూ పాత వస్తువులు పగిలిన సీసాలు ఏరుకొస్తే బాల కార్మికుడు ముత్యాలు తల్లి వాటిని అమ్మే కుటుంబం నడిపిస్తుంది.

'బతుకు పూలబాట కాదు' కథలో నాగరాజుకు సినిమా పిచ్చి. అందుకు చేసిన ప్రయత్నం విఫలమై పూల అమ్ముకొని జీవిస్తాడు. **'ముందుగతి కానవే చిలుక'** కథ ద్వారా చిలక జోస్యం గురించి ప్రజల నమ్మకాల గురించి చెప్పారు. **'బోడి పెత్తనం బొమ్మలాట'** కథ ద్వారా పాత బట్టలకు స్టీలు సామాను ఇచ్చే వారి జీవన విధానం తెలుస్తుంది. **'ఇంతేలే పేదల బతుకులు'** కథలో ఇటుకలు తయారు చేసే వారి శ్రమ గురించి వివరించాడు. **'చచ్చులుపుచ్చులు'** కథలో కూరగాయలు అమ్ముకునే వారి జీవనస్థితిగతులని వివరించాడు. **'వెలుగు జడి విరిసేదెప్పుడు'** కథలో సైకిల్ మీద తిరుగుతూ గుడ్డను అమ్ముకునే వీరస్వామి బ్రతుకు చిత్రన ఉంటుంది. **'మాయతివాచి'** కథలో చదువు ఆపేసి పెయింటింగ్ పనులు స్థిరపడ్డ సత్తయ్య గురించి ఇలా యథార్థ సంఘటన ఆధారంగా సృజనాత్మకతను జోడించి సమస్త వృత్తుల అధినాయకుడిగా సమస్త జనుల జీవన పోరాట సాక్షిగా భరద్వాజ గారు రాసిన కథలు తెలుగు సాహిత్య లోకంలో అజరామరమై నిలబడతాయి.

❖ ❖ ❖ ❖ ❖

స్పందన ...

పి. లలితారాణి
ఫోన్ : 9347256804

జూన్ నెల మూసీ పత్రికలో వెంకటరావుగారు శ్రీవల్లీ రాధిక గారి విమర్శనావ్యాసం చదివి ఇది రాస్తున్నాను అంటూ ఒక స్పందన రాశారు.

కానీ ఆ స్పందన చదివితే అసలు వారు శ్రీవల్లీ రాధిక గారి వ్యాసం నిజంగా చదివారా అని సందేహం కలుగుతుంది. ఎందుకంటే మొదటి పేరాలోనే 'ఈ వ్యాసంలో ఆమె ప్రధానంగా చెప్పింది' అంటూ వారి రాసినది అసలు ఆ వ్యాసంలో ప్రధాన విషయం కానే కాదు. ఆ వ్యాసం ప్రధానంగా విషవృక్షంలోని వైరుధ్యాలను చర్చించింది. శీర్షిక కూడా 'వైషమ్యంలో వైరుధ్యాలు' అంటూ ఆ విషయాన్నే తెలియజేస్తుంది.

ఇక రెండవ పేరాలో భరతుడు ఊర్లో లేని సమయంలో హడావుడిగా రాముడికి పట్టాభిషేకం ఎందుకు నిర్ణయించవలసి వచ్చింది? అని మళ్ళీ పాత ప్రశ్నే వెంకటరావుగారు మరొకసారి వేశారు. హడావుడిగా పట్టాభిషేకం ఎందుకు చేయాలనుకున్నాడో రామాయణంలో దశరథుడు రాముడితో స్పష్టంగా చెప్పడాన్ని గురించీ, ఆ విషయాన్ని రంగనాయకమ్మగారు తనకు అనుకూలం కాదు కాబట్టి తన కథలో ఎగరగొట్టడాన్ని గురించి కూడా శ్రీవల్లీ రాధికగారు తన వ్యాసంలో చెప్పారు. అది వెంకటరావుగారు చదివినట్లు లేదు.

ఇక మూడవ పేరా నుంచి 'శ్రీవల్లి గారు అన్నట్లు' అని ఆయన రాసినదంతా శ్రీవల్లీ రాధికగారు అన్నది కాదు.

ఉపోద్ఘాంతో శ్రీవల్లిగారు ఈ విషయాన్ని దోషంగా చూడని కోట్లాదిమంది ఇతర పాఠకులు దీనిని ఎలా అర్థం చేసుకుంటున్నారు. వారు దీనిని ఎలా సమన్వయించుకుంటున్నారు అన్న విషయాన్ని చెప్తూ రాసిన మాటలు అవి. ఆ మాటలని 'శ్రీవల్లి గారి మాటలు' అని రాయడాన్ని బట్టి వెంకటరావుగారు వ్యాసాన్ని సరిగా చదవలేదని అర్థమవుతోంది.

ఉపోద్ఘాతంలో శ్రీవల్లిగారు ఇరుపక్షాల అవగాహనా చెప్పారు. దోషంగా చూడని కోట్లాది పాఠకుల అవగాహనా దోషంగా భావించిన రంగనాయకమ్మ గారి అవగాహనా రెండూ చెప్పారు. రంగనాయకమ్మగారికి తప్పుగా తోచిన విషయాన్ని ఇతరులు ఎందుకు తప్పుగా అనుకోలేదో, వారు దానిని ఎలా సమన్వయించుకున్నారో చెప్పి, ఆ తర్వాత "కొందరు పాఠకులు తీసుకున్న ఈ అర్థాన్ని అందరూ ఒప్పుకోకపోవచ్చు. అందరికీ ఈ సమన్వయం అంత బలంగా కనిపించకపోవచ్చు" అని కూడా ఆవిడ రాశారు.

అయితే ఈ అవగాహన సరయినదా కాదా, ఈ విషయాన్ని ఇలా సమన్వయించుకోవడం సబబా కాదా అన్న ప్రశ్న అలా ఉంచితే, దీనిని ఒప్పుకుంటే ఈ విషయానికి సంబంధించినంత వరకూ మరింకే కొత్త ప్రశ్నా రాదన్నది మాత్రం నిజం. కానీ రంగనాయకమ్మగారు చెప్పిన అవగాహన అటువంటిది కాదు. ఆవిడ చెప్పిన అర్థాన్నీ, అవగాహననీ తీసుకుంటే మరెన్నో సమాధానం దొరకని ప్రశ్నలు వస్తాయి". – ఇది శ్రీవల్లిగారు ఈ వ్యాసంలో ప్రధానంగా చెప్పిన విషయం. ఉపోద్ఘాతంలో ఈ మాట చెప్పాక ఇక వ్యాసం అంతా రంగనాయకమ్మ గారి కథను అనుసరిస్తే కనిపించే అనేకమైన వైరుధ్యాలను శ్రీవల్లిగారు వివరించారు.

అయితే వ్యాసంలో ఆ వైరుధ్యాలన్నిటి గురించీ ఒక్కమాట మాట్లాడకుండా, ఉపోద్ఘాతంలోని విషయాన్ని మాత్రం తీసుకుని, ఆది కూడా శ్రీవల్లి గారివి కాని మాటలని ఆవిడ మాటలుగా చెప్తూ వెంకటరావుగారు రాసిన స్పందన చదివితే శ్రీవల్లిగారి వ్యాసం చదవని వారు ఆవిడ వ్యాసంలోని విషయం వెంకటరావు గారు చెప్పినదే అని పొరబడే ప్రమాదం ఉంది.

అందుకని నేను వెంటనే ఈ స్పందన మీకు పంపుతున్నాను.

❖ ❖ ❖ ❖ ❖

'అరచేతిలో బువ్వ పువ్వు' కావ్యంలో కర్షక జీవితం

✍ ఆచార్య ఎన్. ఈశ్వర రెడ్డి, తెలుగుశాఖ, యోగి వేమన విశ్వవిద్యాలయం, కడప. ఫోన్ : 832 829 6952

పరిచయం :

"ఎన్ని సంపదలు ఉన్నా, నాలుగు మెతుకులు లేకుంటే ప్రాణాలు సున్న. ఆ మెతుకులు పండాలంటే రైతు చెమట పొలాలపై కురవాల్సిందే. ప్రపంచాన్ని బతికించడం కోసం తన బతుకును ఛిద్రం చేసుకునే రైతు, రైతే రాజుగా ఉత్తుత్తి కీర్తినందుకుంటాడు. వాస్తవంగా రైతు నేలకు బానిస, పనికి బానిస, పంటకు బానిస. నేలకు – రైతు కాళ్లకు అదృశ్య సంకెళ్లు బిగించినట్లు, తన జీవిత కాలాన్ని సేద్యానికి రాసిచ్చినట్టు, తన శరీరాన్ని పైరు బిడ్డలకు దారాదత్తం చేసినట్టు ఎప్పుడూ మట్టితోనే మమేకమై కనిపించే రైతు వాస్తవ జీవితంలో నరకయాతన అనుభవిస్తున్నాడు. జీవించి ఉండే ప్రతి మనిషికీ రైతు శ్రమ అన్నమై అందుతోంది. మనల్ని బతికించడానికి శ్రమిస్తున్న రైతుకు మన సాయం అందడం లేదు. "దేశానికి రైతే వెన్నుముక", "మనది వ్యవసాయ ఆధారిత దేశం" వంటి వాక్యాలు రైతు ప్రాధాన్యతను తెలియజేస్తున్నప్పటికీ, రైతు గౌరవంగా బతకడానికి అవసరమైన చట్టాలు గాని, సహాయం కానీ చేయలేకపోవడం మన దౌర్భల్యం." (డా.ఎన్.ఈశ్వర రెడ్డి, ముందుమాట, నాగేటి తడి కావ్యం)

'కష్టజీవికి ఇరువైపులా ఉన్నవాడు కవి' 'అగ్గిపుల్ల సబ్బు బిళ్ళ కుక్క పిల్ల కాదేది కవితకనర్హం' అని శ్రీశ్రీ అంటే **"దుక్కి, దుమ్ము, ఉడుపు, మునుంపాట, కలుపుతీత, కోత, చేనుమోత కవిత్వం కాని దేముంది?"** అని సంకల్పించుకున్న వ్యక్తి, మట్టిని – పైరును మానవీకరించి కవిత్వం రాస్తున్న కవి చింతా అప్పలనాయుడు. శ్రమ సౌందర్యాన్ని అనుభవించిన వాడు రైతు జీవితంలోని ఎత్తు పల్లాలను ఎక్కి దిగినవాడు అయిన శ్రీకాకుళాంధ్ర సజీవ భాషలో కవిత్వం రాస్తున్నాడు చింతా అప్పలనాయుడు. మాండలిక భాషకు పట్టం కడుతూనే కవిత్వ రచనలో రసార్ద్రత నింపుతున్నాడు. వ్యవసాయ శ్రమతో అనుబంధం ఉన్న పాఠకులైతే ఈయన చిత్రించిన భావుక వాక్యాల సాళ్లలో ఇరుక్కుపోతారు. **'మా అయ్యకు శ్రమే కవిత్వం నాకు కవిత్వమంటే శ్రమ అని ఇప్పుడు బోధపడింది, కవిని నేను కాదు మా అయ్యని'** చెప్పిన రైతు కవి చింతా అప్పల నాయుడు. 'అరచేతిలో బువ్వ పువ్వు' కవితా సంపుటిలోని రైతు కవిత్వాన్ని పరిశీలించడమే ఈ వ్యాస ఉద్దేశం.

వ్యవసాయ జీవన సౌందర్యం:

వ్యవసాయాన్ని ప్రేమించే వాడికి వ్యవసాయ క్షేత్రం ఒక అందమైన బృందావనంలా కనిపిస్తుంది. నిరంతరం కష్టపడుతూ ఉన్నా, ఆ కష్టంలోనే సుఖాన్ని ఏరుకుంటాడు రైతు. నిజమైన రైతుకు వ్యవసాయ

క్షేత్రంలో జరిగే ప్రతి క్రియా ఒక అనుభూతి కావ్యమే. పొలం పచ్చగా ఉన్నంతకాలం తన జీవితం పదిలంగా ఉంటుందని భావించేవాడు రైతు. అందుకే తన శ్రామిక క్షేత్రంతో అందమైన అనుబంధాన్ని పేనుకుంటాడు. **'శ్రమే సౌందర్యం అని, పనే దైవమని'** భావించే వారికి వ్యవసాయం ఒక అందమైన ప్రబంధంలా కనిపిస్తుంది. అరచేతిలో బువ్వ పువ్వు కావ్య రచయిత చింతా అప్పలనాయుడు కూడా వ్యవసాయ ప్రబంధ రచయితగా దర్శనమిస్తాడు.

దుక్కి దున్ని, నారు పోసి, కలుపు తీసి, పంట కోసి ఇంటికి తెచ్చేదాకా ప్రతి పనిని ప్రేమిస్తే గాని తనను తాను భూమికి అంకితం చేసుకోలేడు రైతు. విత్తనం మొలకెత్తే దృశ్యాన్ని, నాట్లకు సిద్ధమైన నారుమళ్ళ చిత్రాలు, అక్కడ జరిగే పనికి సంబంధించిన విశేషాలను స్వయంగా చూసిన రైతు కాబట్టే...

"మన్నులో కన్ను తెరిచిన విత్తనం
ప్రాణమున్న పిట్టలా రెక్కలాడిస్తే
దుక్కినొప్పులన్నీ దూరమైపోతాయి.
నారు మడిలోంచి ఉడుపు మడిలోకి
ఆకు కట్టలు విసురుతుంటే
సిలక పిట్టలు సిందులేసినట్టే ఉంటాది.
గాలి వుయ్యాల్లో నాట్లు బోసి నవ్వులు నవ్వుతుంటే
పొలం పచ్చి పురటాలై బురద పిప్పళ్ళు తిని
పురిటి నొప్పులు మరిసి మురిసిపోతాది" (రైతు భారతంలో... పుట.42) అనగలిగాడు. సేద్యాన్ని ఎంతో మమకారంతో చేసేవాడికి కనిపించే అందమైన దృశ్యాలు ఇవి.

వరి నాట్లు జరిగేటప్పుడు మడిచేలు స్త్రీమూర్తులతో కళకళలాడి పోతాయి. చీరలను మోకాళ్ళపై దాకా ఎగ్గొట్టి, కొంగును నడుము చుట్టుకుని పాటలు పాడుకుంటూ, వంగివంగి నాట్లు వేస్తుంటే మేమంతా చెవులప్పగించి మూగవాళ్ళం అయిపోయే వాళ్ళం. అటువంటి ఒక అద్భుత దృశ్యాన్ని మన ముందు ఉంచుతూ.... అమ్మ చెవుల్లో అమృతధారలా మునుంపాట!

'ఇంద్రధనస్సుల్ని వొంటికి చుట్టుకుని దేవతామూర్తులెవరో దిగివచ్చి మడిలో వొంగి మునుంగడతారు. నవమాసాలు మోసి, కాసిన తల్లిలా పంటనిచ్చానని భూమితల్లి పరవశించిపోతుందని' ఊహించ గలిగాడు.

పైరు నాటడం పూర్తయ్యాక అది ఎలా ఉంటుందంటే 'చాకిరేవులో ఆరేసిన తెల్లకోకలా మెరిసే దమ్ముమడి చిలకల బొమ్మల సిలుకు చీరైపోతుంది. మాటలతోటి, పాటలతోటి ఊసులతోటి, ఊళలతోటి ఇంత ఎండా వెన్నెలగా మారి ప్రతీ ఉడుపు మడీ పాటకచేరి అవుతుంది. పాటల్లో పని కరిగి పిల్లాడిచేతిలో గోళీకాయలా పొద్దు పడమటికి దొర్లిపోగా, చెమటతానాలు చేసీచేసీ శ్రామికదేవతలు వచ్చినోళ్ళు వొచ్చినట్టే ఆ సాయంకాలానికి అదృశ్యమైపోతారు! అంతవరకూ అక్కడ శ్రమ సౌందర్య రసాధి దేవతలెవరో సంచరించిన గుర్తుగా ప్రతి పొలమూ పచ్చపచ్చగా' మెరిసిపోతుం దంటాడు. మడి నాటడం పనిలో ఉన్న సౌందర్యాన్ని చిత్రించిన విధానం కవి ఆలోచన శక్తికి,అనుభవ రక్తికి,శ్రామిక దృక్పథానికి అర్థం పడుతుంది.

కష్టపడే రైతుకు పంటే సర్వస్వం. ప్రతి సంతోషాన్ని పొలంలోని వెతుక్కుంటాడు రైతు. **'వెన్నుల బరుతో వొంగిన వరిమడి పీటలమీద తలొంచి కూర్చున్న పెళ్ళికూతురే అనిపిస్తాది'** రైతుకు. రైతు కలకు రంగులేస్తే ఎలా ఉంటుందో చింతా అప్పలనాయుడు వ్యవసాయ సౌందర్య వర్ణన అలా ఉంటుంది.

వాన సంబరం :

వర్షాలపై ఆధారపడి వ్యవసాయం చేసే రైతులకు వానే ప్రాణం. వాన లేకపోతే బతుకులు గడవవు. ఉత్తరాంధ్రలో కొన్ని ప్రాంతాలు, రాయలసీమ వంటి భూభాగాలు ఆకాశం వైపు నిత్యం మోరెత్తి చూస్తుంటాయి. ఇలాంటి చోట వర్షం పడితే ఎలా ఉంటుందంటే **'ఆకాశం పాడిన వానపాటకి, పోయిన ప్రాణాలు తిరిగొచ్చి బొందిలో దూరినట్టుంటుంది భూదేవతకి'** వానతో భూమి ఊపిరి పోసుకోవడం ఎలా ఉంటుందో అప్పలనాయుడు రాసిన పై వాక్యాన్ని చూస్తే అర్థం చేసుకోవచ్చు.

వాన కురిస్తే పల్లెల్లో వాతావరణం ఎంతో సందడిగా మారిపోతుంది. **"వీధులన్నీ కడిగి, శ్రమజీవుల పాదముద్రల ముగ్గులేయించిన వాన, వెండి జలతారు కోకగట్టి పుట్టెడు ఆశలతో పుట్టింటికి తిరిగొచ్చిన వాన, ఆకుమళ్ళకు పచ్చటి సోకులద్దిన వాన, చీడపీడల వొంటిమీద చురకలేసిన వాన , పుట్టింటి ఆడపడుచుల మనసు లోగిళ్ళలో మసలాడిన వాన, అసిరమ్మ ఘటాలు లోలోన తిరుగుతున్న వాన, కాళ్ళకు తగులుకున్న సంకెళ్ళను కరిగించిన వాన"** (వాన, పుట.70) పల్లెకు కొత్త జీవం పోస్తుంది. **'ఒక్క వానజల్లు పడేసరికి ఏడుపు రాగమెత్తుకుని ఎక్కడికి పారిపోయిందో ఎండ, తొలకరి మా పొలాన తొలిపాదం మోపింది'** అని సంబరపడతాడు కవి.

వానలు సకాలంలో పడకపోవడం వల్ల పంటలు దెబ్బతింటాయి. అప్పులు చేసి విత్తనాలు, పురుగుమందులు, ఎరువులు కొని వ్యవసాయం చేసి నష్టపోయే రైతులు ఎన్నో సమస్యల్లో ఇరుక్కు పోతారు. వర్షం కోసం దీనంగా ఎదురుచూస్తున్న సమయంలో వర్షం పడితే ఎలా ఉంటుందో చెప్తూ **"ఇలాంటలాంటి వానా! దిగులు మసిబారిన అమ్మ మొగాన దివ్వె వెలిగించిన వాన, సిగ్గుకు సిమిడిపోయి వీధిలోకి అడుగెయ్యడానికి మొరాయించిన అయ్య పాదాలను ఈటీవోడి గుర్రంలా పొలానికి పరుగెత్తించిన వాన, ఇన్నాళ్ళు ఎక్కడ ఉండిపోయిందో, ఏ మబ్బుల మందలో దాగి, ఆకాశం మెరకమీద ఆటలసందడిలో పడిందో, ఆమాసకి కబురంపితే పున్నానికి వచ్చిన ఆడపిల్లలా సేన్నాళ్ళకొచ్చింది వాన"** (వాన, పుటలు.70,71) అంటాడు. సగటు వ్యవసాయాధారిత ప్రాంతంలో ఉండే రైతు మనసులో మెదిలే భావోద్వేగాలు సిరాగా మారి అక్షరాలుగా మారినట్టు కనిపిస్తాయి.

"పడాలేగాని వాన, పడిన్నాడే మాకు పండగ. మన్ను మాణిక్యమే అనిపిస్తాది. బురద బువ్వలాగే కనిపిస్తాది. ఊరత్తల సెరువు సెరువులా కనబడదు. ఊరందరి ఆకలిమంటలారిపే ఊరిబిండి సట్టిలా కనబడతాది" (వానజల్లు, పుట.124)అంటూ పల్లె జీవితంలో వాన ప్రాధాన్యత ఎంతో స్పష్టపరుస్తాడు. ఊరవతల ఉండే చెరువు వాన వచ్చి, నీళ్లతో నిండినప్పుడు ఊరిబిండి సట్టిలా మారడం కవి ఊహకు పరాకాష్టగా కనిపిస్తుంది. అదే సమయంలో పల్లె మనస్థితికి అద్దం పడుతుంది.

కరువు ప్రాంతాల పైన అప్పుడప్పుడూ వాన కోపగించుకుంటూ ఉంటుంది. అనావృష్టితో కొన్నిసార్లు అతివృష్టితో మరికొన్నిసార్లు ఇబ్బంది పెడుతూ ఉంటుంది. ఈ సందర్భాలను అప్పలనాయుడు తనదైన అనుభవంతో చిత్రించాడు.

అతివృష్టితో ఇబ్బంది పెట్టే వాన ఎలా ఉంటుందో చూపిస్తూ **"పాలు తాగి ఇల్లల్లా చంటి పిల్లల్లా నవ్వవలసిన నాట్లు, నీట మునిగి చావడం, కడుపుకోత పిల్ల దక్కక పోగా, పాల బాధతో ఏడుస్తున్న పచ్చి బాలింతల్లా, మడిసెక్కలు, సన్నగా ప్రాణధార కావలసిన నీటిపాయ, ఒక్కసారి పామై బుసలు కొట్టి, నాట్లు మీద కాటేయడమే నేటి విషాదం"** (శ్రుతి తప్పిన వాన పాట, పుట.149) అంటాడు. అప్పుడే నాటిన పైర్లు నీట మునిగి కుళ్ళిపోవడం ఒకటైతే, కోతకు సిద్ధంగా ఉన్న చేలు కొట్టుకుపోవడం ఇంకా పెద్ద విషాదం. అతివృష్టితో ముడిపడ్డ అనేక అంశాలను చింతా తన కవిత్వంలో చూపించాడు.

రైతుల వ్యథలు, తిరుగుబాటు :

ప్రపంచానికి అన్నం పెట్టే రైతు ఎప్పుడు స్వార్థంతో తిరుగుబాటు చేయలేదు. పని గంటలతో సంబంధం లేకుండా రాత్రింబవళ్లు కష్టపడినా తిండికి సరిపోని పరిస్థితి చాలా చోట్ల ఉంది. సమాజంలో

గౌరవంగా బతకడానికి అవసరమైన ఆదాయం లభించడం లేదు. నకిలీ విత్తనాలు, నకిలీ పురుగుమందులు, దళారుల మార్కెట్ మాయ, ప్రభుత్వ చిన్నచూపు, ప్రకృతి విపత్తులు నిరంతరం రైతులు వెంటాడుతూనే ఉన్నాయి. ఇలాంటి సందర్భాలు ఎదురైనప్పుడు రైతు కునారిల్లి వెళ్ళిపోతున్నాడు.

పండించిన పంటను మార్కెట్ దాకా తీసుకెళ్తే అక్కడ రైతు కష్టానికి వెలగట్టే వ్యాపారి చెప్పిందే శాసనంగా నడుస్తుంది. అక్కడ రైతు కష్టనష్టాలకు ఎలాంటి విలువ ఉండదు. మరికొన్ని సందర్భాలలో ప్రభుత్వం పంట విరామం ప్రకటిస్తుంది.

"కోతకొచ్చిన పంటచేను/అత్తారింటికి అనుపుతున్న ఆడపిల్లే / కట్నంచాలదని అలిగిన అల్లుడూ /కాసిన పిల్లయినా/కోసిన పంటయినా/కన్నీరికి మిగిలింది కడుపుమంటే అయినపుడు/పంట విరామంటే/అదొక అజ్ఞాతవాసమే గదా! / అల్లుడి ఆప్యాయతలూ

ఏలినవారందించే పరిహారాలూ/శివుడి ముందున్న నంది/ కోడి మూతికి రాసిన అంటిపండు సందాయమేగదా.../రైతు భారతంలో పొలమే ఒక కురుక్షేత్రం/మేడిపట్టిన ప్రతివాదూ/అర్జునుడైనా కావాల!/ అభిమన్యుడైనా కావాల" (రైతు భారతంలో... పుటలు. 41,43) అంటాడు. వ్యవసాయ క్షేత్రం కురుక్షేత్రంగా కనిపించడంలో అతిశయోక్తి లేదు. ఎందుకంటే అది చావు బతుకుల పోరాటంగా మారిపోయింది కాబట్టి.

దళారుల ఆగడాలు, బ్యాంకుల విధానాలు రైతులను ఎన్ని ఇబ్బందులకు గురిచేస్తున్నాయో చెప్పనక్కరలేదు. **"లారీల మీద ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తరలిపోతుంటే షావుకారు ముఖం చాటేసుకున్నాడు. ఏ ముఖం పెట్టుకొని అప్పుకి వస్తావని దండకం చదువుతున్నాడు. బ్యాంకు ఖాతాలో జమ అయిన డబ్బులు ఋణమాఫీకి జమ కాగా"** (ఏడాదిపాటు, పుట. 83) రైతు మళ్లీ కొత్త అప్పుల కోసం అదుక్కోవలసిన పరిస్థితి అక్కడే ఎదురవుతుంది.

"ఏడాదిపాటు కష్టపడి అప్పుకి చేయిచాపడం ఏ దేవుడి శాపంరా నాయనా అని గుండెనిండా దిగులు మేఘం కమ్ముకుంటుంది. ఏడాది పొడవునా ఎండదెబ్బలు, కప్పుకున్న మంచుదుప్పట్లు మూడుకాణీల వ్రతం కాదు కదా వ్యవసాయమంటే" (ఏడాది పాటు, పుట. 84) అంటూ వ్యథా భరితుడౌతాడు.

ఇక ప్రభుత్వం అప్పుడప్పుడు ఇచ్చే కంటి తుడుపు తాయిలాలు రైతును ఏ కోశానా ఆదుకోవడం లేదని, ఇచ్చేవి కూడా అయినవారికే నని ఆవేదన వ్యక్తపరుస్తాడు.

'సంక్రాంతి సంబరాలు సన్నాయిమేళాలు ఏలినవారికేనని తేటతెల్లమైపోయాక, పందుగొంటిపూట పట్నంలో నడిరోడ్డు మీద ఏటీయం ముందు పడిగాపులు పడుతున్నాను' అంటాడు. సంబరాల పేరుతో, తోఫాల పేరుతో ప్రభుత్వాలు తమ గొప్పతనాన్ని ప్రకటించుకోవడాన్ని నిరసిస్తాడు.

కేంద్ర ప్రభుత్వం మద్దతు ధరకు సంబంధించి తీసుకొచ్చిన కొత్త చట్టాలను నిరసిస్తూ దేశంలోని రైతులందరూ రోడ్డుపైకి వచ్చారు. ముఖ్యంగా ఢిల్లీ, పంజాబ్, హర్యానా రాష్ట్రాలలోని రైతులు పెద్ద ఎత్తున ఉద్యమించారు. నాయకులు ఓట్ల కోసం వచ్చినప్పుడు తాము గెలవగానే అందరి సమస్యలు తీర్చేస్తామని చెప్తారు. తమ పని పూర్తయ్యాక ఎవరి గురించి పట్టించుకోరు. రైతులు తమ న్యాయమైన

'కదంబం'

(తెలుగు సాహిత్య ప్రక్రియలు - రూపాలు)

మూసీ మాసపత్రిక ప్రచురించిన ప్రత్యేక గ్రంథం

ప్రాచీన, అధునాతన, జానపద ప్రక్రియలన్నింటిపై ప్రత్యేక వ్యాసాలు

(పురాణం, ఇతిహాసం, కావ్యం మొదలైన ప్రక్రియలు మొదలు నానీలు, హైకూల వరకు 82 సాహిత్య ప్రక్రియలపై ప్రముఖ సాహితీవేత్తల కలాల నుండి జాలువారిన ప్రత్యేకాంశాల సమాహారం. పోటీ పరీక్షలకు, కళాశాలలకు, వ్యక్తిగతంగా అందరికీ వినియోగపడే

ఉత్తమ గ్రంథం 'కదంబం'.

440 పేజీలతో వెలువడిన ఈ గ్రంథం వెల రూ. 350/-

ఆలోకనం

(తెలంగాణ 31 జిల్లాల చరిత్ర సాహిత్య సాంస్కృతిక సమాచారం)

ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా మూసీ మాసపత్రిక ప్రత్యేకంగా సంకలనం చేసిన గ్రంథం ఆలోకనం.

తెలంగాణ 31 జిల్లాలకు సంబంధించిన విలువైన సమాచార సూచిక ఇది.

330 పేజీల ఈ గ్రంథం విలువైన రంగు చిత్రాలతో కూడుకుని ఉన్న విశేష గ్రంథం.

అన్ని రకాల కాంపిటీషన్ పరీక్షలకు కూడా వినియోగపడే సమగ్ర సమాచార దర్పణం.

మూసీ కార్యాలయంలో దీనిని పొందదలచిన వారికి కేవలం 300/- (అసలు 500/-) కు మాత్రమే అందిస్తున్నాం. సంప్రదించండి.

ISSN 2457-0796

డిమాండ్లను నెరవేర్చలేదని పెద్ద ఎత్తున ఉద్యమం చేశారు. నాయకుల మాటలు నమ్మి ఓట్లు వేసిన రైతులు తీవ్ర మనోవేదనకు గురైన విషయాన్ని కవిత్వీకరించాడు.

"మంచోడివని పలకరించి పదవి మంచమేసినందుకు
మంచు సాలువాలతో సన్మానించు తన్నావు
సలిలో మేము సావగూకుంటే
చెర్చలమంట బెట్టి సలిగాగుతన్నావు
వానలో మేము నానిపోతుంటే
వాలుకుర్చీ మీద తేలిపోతన్నావు
కూకుందువుగాని కుర్చీ మీద" (కూకుందువు గాని కుర్చీ మీద, పుట. 100) అంటూ నిరసన వ్యక్తం చేస్తాడు కవి. అంతేగాక **'తిరగల్లో గింజల్లా మీము గింజుకొని, కలోగెంజోతాగి నిరసన గీతాలమైతే,** దున్నపోతు మీద వాన కురిసినట్టే ఉంది అంటూ అధిక్షేపిస్తాడు.

ప్రజాస్వామ్య దేశంలో ప్రతి ఐదేళ్లకోసారి ఎన్నికలు తప్పకుండా వస్తాయి. ప్రభుత్వం చేస్తున్న చట్టాలను, అనుసరిస్తున్న విధానాలను నచ్చని వారు నాయకులకు బుద్ధి చెప్తారు. అదేవిధంగా రైతులు కూడా తగిన సమాధానం చెప్తారంటాడు.

"దున్నడం మాకు బాగా తెలుసు, కలుపు మొక్కలను ఏరడం మాకు కొత్తగాదు. దారిపొడువునా పేరుకుపోయిన ముళ్ళుముట్రా ఏరిపారేయడం, యవసాయంలో భాగమే. తెలిసిపోనాయి నీ తేనీటి మాటల గారడీలు, తేటతెల్లమయిపోనాయి నీ దేశ దిరుగుల పగటి యాసాలు" (కూకుందువు గాని కుర్చీ మీద, పుట. 101) అంటూ రైతుల శక్తి ఎలాంటిదో తెలియ చెప్తాడు.

చింతా గారి కవిత్వంలో **'ఎర్రటి ఎండ కారంలా దేహం మీద కారుతున్నా, ఎండా, బూట్లు ఏకమై కాళ్ళను పట్టి కరుస్తున్నా, ఖాకీ దుస్తులు గాలిని వొంటి మీద వాలకుండా వొద్దు పొమ్మంటున్నా, తల మీద టోపీలు ముళ్ళ కిరీటాల్లా బెదిరిస్తున్నా, నడి రోడ్డు నట్టిల్లు చేసుకోవాల్సిందే'** నని భీష్మించుకొని కూర్చున్న పట్టుదల గలిగిన రైతులు కనిపిస్తారు.

'నల్ల చట్టాలను నట్టేటిలో కలిపి, పొలాన నువ్వు కనిపించితే పాటకచ్చేరీలు పెట్టుకోవాలని ఎదురుసూపులతో ఏగిపోతన్నామని' ప్రకటిస్తాడు. **'జరుగుతున్న సంకుల సమరంలో శత్రువుపై విజయం సాధించి, పొలాల్లో పంటలు జెండాలై ఎగరాలని, బతుకును పండించుకోవాలని'** ఆరాట పడతాడు.

ముగింపు :

వ్యవసాయం చేసే రైతులు ఆర్థికంగా, శారీరకంగా, మానసికంగా కృంగి పోతున్నారు. ఏడాది పొడవునా పనిచేసిన సరైన పోషకాహారం సమకూరక రోగాల బారిన పడుతున్నారు. కనీస అవసరాలను తీర్చుకోగలిగినంత సంపాదన లేకపోవడంతో కొంత మంది రైతులు కూలీలుగా మారి ఉపాధి పనులకు పోతున్నారు. మరి కొంత మంది నగరాలకు వలస పోతున్నారు. వ్యవసాయం మీద స్థిరమైన ఆదాయం మాట అటుంచి, కనీస ఆదాయం కూడా పొందలేకపోతున్నారు. దీనివల్ల ఆర్థికంగా నిలబడలేకపోతున్నారు. ఆర్థికంగా వెనకబడిన రైతులు సరైన గౌరవానికి నోచుకోలేక మానసికంగా కృంగి పోతున్నారు. రైతే రాజు అని డప్పాలుగొట్టే వ్యవస్థ రైతును కూలీగా, వాచ్మెన్ గా, వలస బాధితుడిగా, భిక్షగాడిగా మార్చేసింది. ఈ స్థితి మారకపోతే దేశం ఆహార సమస్యతో అల్లాడవలసిన రోజులు దగ్గరపడతాయి. ఇలాంటి దశ మారాలి. వ్యవసాయం మళ్లీ పండగ కావాలి. అందుకు తగిన నీటి వనరులను, ఆర్థిక వనరులను, మార్కెట్ సౌకర్యాన్ని, కనీస మద్దతు ధరలను అందించి రైతులకు ప్రభుత్వాలు అండగా నిలవాలి. నాణ్యమైన విత్తనాలను అందించడం నుండి పండిన పంటకు గిట్టుబాటు ధర కల్పించి ప్రభుత్వమే కొనుగోలు చేసే పరిస్థితి ఏర్పడాలి. రైతుల సాధక బాధకాలను సూక్ష్మ దృష్టితో హృదయానికి హత్తుకున్న ఈ కవి వాస్తవ పరిస్థితులను అక్షరాలుగా మార్చాడు. రైతుల జీవితంలో ఎదురుపడే ఎన్నో కఠిన పరిస్థితులకు అద్దం పడుతూ చింతా అప్పలనాయుడు రాసిన కవిత్వం రైతుల పక్షాన నిలబడింది.

ఆధార గ్రంథాలు :

1. అరచేతిలో బువ్వ పువ్వు : చింతా అప్పల నాయుడు (2022) వైఎంకే కాలనీ పార్వతీపురం, మన్యం జిల్లా.

2. కవిత – మానవీయత: డా.ఎన్.ఈశ్వర రెడ్డి (2016) ప్రసారాంగ, ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం.

3. సమగ్రాంధ్ర సాహిత్యం : ఆరుద్ర(1989), ప్రజాశక్తి, విజయవాడ.

4. సాహిత్యంలో సమాజం : డా.ఎన్. ఈశ్వర రెడ్డి, (2023) అరసం ప్రచురణలు కడప.

❖ ❖ ❖ ❖ ❖

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 9 (47) హైదరాబాద్ జులై : 2025

కథా సాగర్ కథలు – స్త్రీల సమస్యలు – పరిశీలన

✍ **ముష్కేమేఘమాల,** పరిశోధక విద్యార్థి, తెలుగు శాఖ, ఉస్మానియా విశ్వవిద్యాలయం. ఫోన్ : 9441041322

1. ఉపోద్ఘాతం : సాహిత్యంలో విశిష్ట సేవలు అందించడానికి ఎం.ఏ సుభాన్ సంపాదకత్వంలో ఆవిర్భవించిన సంస్థ 'కళాసాగర్'. ఈ సంస్థ 25 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా లబ్ద ప్రతిష్టులైన రచయితలు, రచయిత్రులు వ్రాసిన వేలాది కథల నుంచి మేలిమి బంగారం లాంటి 87 కథలను ఎంపిక చేసి 'కథాసాగర్' (తెలుగు జనజీవన ప్రతిబింబాల కథానిధి) పేరుతో కథల సంకలనంగా 1997 సంవత్సరం ప్రచురించారు. ఈ సంకలనంలో కొన్ని కథలు స్త్రీలు ఎదుర్కొంటున్న కష్టాలు, వారి అస్తిత్వాన్ని కోల్పోవడానికి ఉన్న కారణాలు చక్కగా తెలియజేయబడ్డాయి. ఈ వ్యాసం ప్రధానంగా స్త్రీల సమస్యలను విశ్లేషించి, ఆ సమస్యల వెనుక దాగిన కారణాలను చెప్పడమే లక్ష్యంగా తీసుకుంది.

భారతీయ సమాజంలో స్త్రీకి ఎంతో గౌరవ స్థానం ఉంది. "యత్ర నార్యస్తు పూజ్యంతే రమంతే తత్ర దేవతాః" అనే ఆర్యోక్తి ద్వారా ఇది స్పష్టమవుతుంది. ఏ సమాజంలో అయితే స్త్రీ గౌరవింపబడి పూజింపబడుతుందో అక్కడ దేవతలు ఉంటారని అర్థం. కుటుంబ జీవన విధానంలో స్త్రీ ప్రధాన పాత్ర పోషిస్తుంది. మన భారతీయ కుటుంబ వ్యవస్థకు మూలం స్త్రీలు. ఇప్పటివరకు స్త్రీ తన హక్కుల కోసం అనేక పోరాటాలు చేసింది. ఆ పోరాటాల ఫలితంగా సమాజంలో తగిన స్థానం సంపాదించింది. **"స్త్రీ, ఆమె ప్రకృతికి ప్రతిరూపం. ఆకాశంలో సగం స్త్రీ, సమాజంలో సగం స్త్రీ"** అని పలువురు పండితులు పేర్కొన్నారు. స్త్రీ లేని కుటుంబాన్ని, స్త్రీ లేని సమాజాన్ని ఊహించలేం. సమాజ నిర్మాణంలో స్త్రీలు మూల స్తంభాలుగా నిలుస్తారు. పురాతన కాలంలో స్త్రీని దేవతగా భావించారు కానీ ఆమెకు స్వేచ్ఛ మాత్రం ఇవ్వలేదు. మధ్య యుగాల్లో స్త్రీల స్థితి మరింత దిగజారింది. అయితే ఆధునిక యుగంలో స్త్రీలు చదువుల్లో, ఉద్యోగాల్లో పురుషులతో సమానంగా నిలిచారు. అయినప్పటికీ వారి జీవితంలో ప్రధానంగా రెండు కోణాలు కనిపిస్తాయి. ఒకటి సమస్యలు, రెండవది చైతన్యం, అంటే అస్తిత్వ పరిరక్షణ.

2. కథాసాగర్ కథలలో స్త్రీల సమస్యలు : సమాజంలో స్త్రీలు ఎదుర్కొనే ప్రధాన సమస్యలు లింగ వివక్ష, ఆర్థిక స్వాతంత్రం లేకపోవడం, చదువు, ఉద్యోగం, ఉపాధి లాంటివి కొన్ని మాత్రమే. కథాసాగర్ కథల సంకలనంలో రచయితలు, రచయిత్రులు స్త్రీల జీవనాన్ని గమనించి, వారి సమస్యలను కథల ద్వారా వ్యక్తీకరించారు. కొందరు రచయితలు సమస్యలకు పరోక్షంగా పరిష్కార మార్గాలు సూచించగా, మరికొందరు రచయిత్రులు స్త్రీలను చైతన్యపరిచే విధంగా వారి అస్తిత్వ పరిరక్షణకు బలమైన కథలు రాశారు. ఈ వ్యాసం ద్వారా అటువంటి కథలను పరిశీలన చేయటం ముఖ్య ఉద్దేశ్యం.

3. స్వేచ్ఛ లేని స్త్రీ జీవితం :

తన మార్గం : ఈ కథను అబ్బూరి ఛాయాదేవి రాశారు. కథలో వర్ధనమ్మ తన కొడుకులైన రాఘవ, కేశవతో ఉన్న బంధాలు ప్రధానంగా ఉన్నాయి. వర్ధనమ్మ తన భర్త భరణానంతరం కొడుకులచే నిర్లక్ష్యం చేయబడుతుంది. ఒకప్పుడు అనుభవించిన కుటుంబ ఆనందాన్ని గుర్తు చేసుకుంటూ, ఇప్పటి ఒంటరితనాన్ని తట్టుకుని, తన ఆత్మగౌరవాన్ని కాపాడుకోవాలని కృషి చేస్తుంది. **"పనులు పెరిగిపోయి వ్యవధి లేక డబ్బు పంపించలేకపోయానమ్మా, నీకేమైనా ఇబ్బందైందేమో.... కేశవ ఏమన్నా ఇస్తున్నాడా"** అన్నాడు ఎంతో ఆదుర్దా పడుతున్నట్లు.



"వాడికీ ఏవో ఇబ్బందులుంటాయిగా" అంది వర్ధనమ్మ ఎంతో మామూలుగా. **"అయ్యో, మరెలా గడుస్తోంది. పోనీ, ఉత్తరమైనా రాయకపోయావా." (కథాసాగర్, 3)**

కొడుకులిద్దరూ తండ్రి మరణం, తల్లిని చూడటంలో నిర్లక్ష్యం చేస్తారు. వారి బాధ్యతారాహిత్యం తల్లి గుండెల్లో వేదనను

కలిగిస్తుంది. వర్ధనమ్మ తన అస్తిత్వాన్ని, తన ఆత్మగౌరవాన్ని అర్థం కాపాడుకుంటూ, తన పనులు తాను చేసుకుంటూ స్వతంత్రంగా జీవించాలి అనే పట్టుదలతో ఉంటుంది. ఒక విధంగా తమ జీవితాలను కుటుంబం కోసం త్యాగం చేసే స్త్రీలు, వృద్ధాప్యంలో ఆదరణ కోల్పోయే దుస్థితిని చిత్రిస్తుంది. ఇది వృద్ధాప్యంలో ప్రతి స్త్రీ ఎదుర్కొనే సామాజిక సమస్య. వర్ధనమ్మకు పెళ్లికాకముందు తండ్రి నిర్ణయాల ప్రకారం, పెళ్లయాక భర్త నిర్ణయాల ప్రకారం జీవితమంతా గడిపి, ఆఖరి దశలో పిల్లల నిర్ణయాల ప్రకారం జీవితం కొనసాగించడం సుతారము ఇష్టం ఉండదు. భర్త బ్రతికున్నంత కాలం భర్త చాటున వర్ధనమ్మ తన జీవనాన్ని పూర్తిగా కుటుంబ అవసరాలు తీర్చడానికే అంకితం చేసింది. ఒంటరిగా జీవించాలి అని తాను తీసుకున్న నిర్ణయం కఠినమైనదని తెలిసినా భవిష్యత్తులో రాబోయే కష్టాలు ఎదుర్కోవడానికి సిద్ధపడుతుంది. ఈ నిర్ణయం సమాజంలో ఉన్న ఎంతోమంది వృద్ధాప్యంలో ఉన్నవారికి ఆదర్శంగా వర్ధనమ్మ నిలుస్తుంది.

'అదెక్కడ?' : కథను కె.రామలక్ష్మి రాసారు. పద్మావతి ఒక సాధారణ గృహిణిగా, తల్లి, భార్య, నానమ్మగా కుటుంబ బాధ్యతలను నిబద్ధతతో నిర్వర్తిస్తుంది. కానీ ఆమెను కుటుంబ సభ్యులు కేవలం పని చేసే యంత్రంలా చూస్తారు. భర్త కూడా గౌరవం ఇవ్వకుండా 'అది' అని పిలవడం. కొడుకు కుటుంబానికి చేసిన సేవకు గుర్తింపు లేకపోవడం, ఆమెను మానసికంగా కలత చెందేలా చేస్తుంది. మనవళ్లు చేసిన అల్లరికి కూడా పద్మావతినే తప్పు బట్టే పరిస్థితి కనిపిస్తుంది. ఇంటి పనుల్లో విశ్రాంతి లేకుండా శ్రమిస్తుండగా, తన సేవను ఎవరు గుర్తించరని ఆమె బాధపడుతుంది. 'ఇది', 'అది' అని పిలవడంలో తాను ఒక స్త్రీగా ఆ ఇంట్లో గుర్తింపు కోల్పోటాన్ని తట్టుకోలేక పోతుంది. పురుషాధిక్య సమాజంలో ఎంతోమంది స్త్రీలు ఎదుర్కొంటున్న ఒక సామాజిక రుగ్మతగా ఇది నిలుస్తుంది. చివరికి ఆమెలో చైతన్యం వస్తుంది. జీవచ్ఛవంలా బ్రతికే బదులు స్వతంత్రంగా బతకాలని నిర్ణయించుకుంటుంది. ఇంటిని వదిలి ఒంటరిగా బయటకు వస్తుంది. తనలాంటి బాధిత స్త్రీలను కలుసుకుంటుంది. వారి మధ్య స్వేచ్ఛా జీవితం ప్రారంభిస్తుంది. తన విలువను గుర్తించే స్థలానికి చేరుతుంది. అక్కడ ఆమెను ఎవరు 'అది' అనరు. ఆమె ధైర్యంగా తన స్వేచ్ఛా జీవన మార్గాన్ని ఎంచుకుంటుంది. ఆమె స్వయం నిర్ణయంతో సాగిన మార్గం స్త్రీల వ్యక్తిత్వ పరిరక్షణకు, స్వాతంత్ర్యం మరియు మహిళా సాధికారతకు మార్గదర్శిగా నిలుస్తుంది.

4. స్త్రీల స్వేచ్ఛను హరించే పురుషాధిక్య సంస్కృతి :

కావేరీ సేతురామన్ : కథను ఘండికోట బ్రహ్మాజీరావు రాశారు. ఈ కథ ప్రేమ, సంగీతం, మహిళల స్వేచ్ఛ మరియు పురుషాధిక సమాజంలో మహిళలు ఏ విధంగా మోసగించబడుతున్నారో సమాజానికి తెలియజేసేదిగా ఉంది. ఈ కథలో రాజశేఖరం మరియు మల్లిక మధ్య ఏర్పడే అనుబంధం ప్రేమగా మారుతుంది. కానీ అది ఒక అసంపూర్ణ ప్రేమగా మిగిలిపోతుంది. తేనె పూసిన కత్తిలా మాటలు చెప్పిన కమలనాథన్ అనే వ్యక్తి ఆమెను వ్యభిచార కూపంలోకి బలవంతంగా తోసినప్పుడు, ఆమె జీవితం మరింత నరకంగా మారుతుంది. ఆమె సంగీత ప్రతిభను తన స్వార్థ ప్రయోజనాల కోసం వాడుకోవడం, సమాజంలో పురుషాధిక్యత ఎంతగా ఆధిపత్యం చెలాయిస్తుందో స్పష్టంగా చూపుతుంది. రాజశేఖర్ మిత్రుడైన విజిలెన్స్ అధికారి సేతురామన్ ఆమెను రక్షించి, స్వార్థంతో ఆమెను పెళ్లి చేసుకున్నాడు. కానీ అతను ఆమెకు ఎంతో ఇష్టమైన సంగీతాన్ని ఆమె నుంచి దూరం చేస్తూ, ఆమెపై నియంత్రణ విధించే స్వభావం ఉండడం వల్ల మల్లికకు నిజమైన విముక్తి లభించదు.

'కావేరి సీతారామన్' ఒక కథ మాత్రమే కాదు అది సమాజాన్ని ప్రశ్నించే అద్దం. ఇందులోని పాత్రలు మన చుట్టూ కనిపించే వ్యక్తులే. మహిళల హక్కులు, గౌరవం, స్వేచ్ఛ లేని పరిస్థితులు సమాజాన్ని ఆలోచింప చేసేదిగా ఉంది. పురుషాధిక్య సమాజంలో స్త్రీలు తరతరాలుగా అణచివేతకు గురవుతూ, తమ హక్కులను కోల్పోతూ వస్తున్నారు. కుటుంబంలో, ఉద్యోగాల్లో, సమాజంలోనూ వారు ఎదుర్కొంటున్న వివక్ష మౌనంగా కొనసాగుతున్నది అనేది నూటికి నూరుపాళ్ళు వాస్తవం. తరాలు మారినా, పురుషుల చేతిలో స్త్రీలు వంచనకు గురవుతున్న దుస్థితి సమసిపోలేదు. ఇప్పటికీ స్త్రీలు ఎదుర్కొంటున్న లింగ వివక్ష, గృహహింస వంటి సమస్యలను ఈ కథ బలంగా ఎత్తి చూపుతుంది.

మూడో పేజీ : ఈ కథను ఇంద్రగంటి జానకీ బాల రాశారు. కథలో కథానాయక కస్తూరి ఉన్నత చదువులు చదివి ఉద్యోగం చేస్తున్న యువతి. రాంప్రసాద్ స్థిరంగా, పొదుపుగా తన జీతం డబ్బులు లెక్కలు వేసుకుంటూ బతికే తత్వం గల వ్యక్తి. వీరిద్దరి వివాహం పెద్దల ఒప్పందంతో జరుగుతుంది. రాంప్రసాదుకు కస్తూరి లాంటి హుషారైన అమ్మాయి కావాలని ఉండటం వల్లే ఆమెను భార్యగా ఎంచుకుంటాడు. కానీ పెళ్లి అయిన తర్వాత ఆమె వ్యక్తిత్వాన్ని అర్థం చేసుకోకుండా, జీతం మొత్తం అతనే తీసుకుంటాడు. ఆమె యొక్క కనీస అవసరాలు కూడా గుర్తించడు. **"చేతినిండా జీతం వస్తున్నప్పటికీ, అదంతా పరాయి ధనంలా అనిపించేది కస్తూరికి. తనెవరికో అప్పున్నట్టూ, అది జాగ్రత్తగా తీసుకెళ్లి వాళ్ల చేతుల్లో పోయాలన్నట్టూ అనిపించసాగింది." "ఎప్పుడైనా ప్రాణం విసిగి, కాస్త ఎదురు చెప్తే ఆ రోజు పెద్ద రాద్ధాంతమే ఇంట్లో అందరి ముందూ దోషిగా నిలవాల్సిందే." (కథాసాగర్, 227)**

పితృస్వామ్య వ్యవస్థలో స్త్రీలు సంపాదిస్తున్నా కూడా తమ సంపాదనపై తమకు ఆధిపత్యం లేని పరిస్థితులను తెలియజేస్తుంది. కస్తూరి తన పని, జీతం, వ్యక్తిగత అభిప్రాయాల్లో స్వాతంత్ర్యం కోరుకుంటుంది. కానీ రాంప్రసాద్ మాత్రం తన లెక్కలు, ఖర్చులు, నియమాల మధ్య ఆమెను ఇరుక్కుపోయేలా చేస్తాడు. ఆమె కనీస

అవసరాలకు చేసే ఖర్చులపై కూడా నియంత్రణ చూపుతాడు. కనీసం ఆమెను ప్రేమగా కూడా చూడకుండా, కస్తూరిని శారీరక బంధానికే పరిమితం చేస్తాడు. ఈ అన్యాయం, అవమానం, భర్త ఆమెపై పురుషాధిక్యత ప్రదర్శించడం వల్ల కస్తూరిలో ఉత్సాహం నశిస్తుంది. చివరికి ఓ రోజు ఆమె తట్టుకోలేక తన పుట్టింటికి వచ్చేస్తుంది. అప్పటికే ఆమె గర్భవతిగా ఉంటుంది. ఏడాది లోపే ఆమె విడాకులు పొందుతుంది. పాప జన్మిస్తుంది. తల్లిదండ్రుల సహాయంతో జీవితం కొనసాగిస్తుంది. ఆర్థిక స్వాతంత్ర్యం వల్ల లభించే ధీమా కంటే పితృస్వామిక సంస్కృతి ఆమె జీవితాన్ని నియంత్రించటం కనిపిస్తుంది.

నిరాశతో ఉన్న కస్తూరికి రవి పరిచయం అవుతాడు. ఆ పరిచయం అతడిని నమ్మి అతనితో సహజీవనం చేసేదాకా దారితీస్తుంది. కానీ తర్వాత రవి జల్సా జీవితం, విచ్చలవిడి ఖర్చులకు విసుగు చెందుతుంది. భర్త చేతిలో ఎన్నో బాధలు పడినా కనీసం రెండోసారి అయినా జీవితం బాగుంటుంది అని ఆశ పడుతుంది. కానీ పెనం మీద నుంచి పొయ్యిలో పడ్డ చందంగా కస్తూరి బ్రతుకు నరకప్రాయంగా మారుతుంది. రవితో విడిపోయి ఒంటరి జీవితాన్ని ప్రారంభిస్తుంది. ఆర్థికంగా స్వతంత్రంగా ఉన్నా, స్త్రీలు తమ సంపాదనపై పూర్తి అధికారం లేకుండా ఉండటం. పురుషాధిక్య సమాజంలో స్త్రీలకు ఆర్థిక స్వాతంత్రం లేని పరిస్థితులను ప్రతిబింబించే విధంగా ఈ కథ ఉంది. ఇందులో స్త్రీలు సమస్యలు ఎదురైనప్పుడు మానసికంగా కృంగిపోకుండా, తమ గౌరవాన్ని నిలుపుకుంటూ తప్పు జరిగినా నిలదొక్కుకుని, కొత్త జీవితం వైపు ప్రయాణించాలనే సందేశం ఇవ్వబడింది.

5. ఉన్నత కుటుంబాల్లో స్త్రీల ప్రేమ – పరిణామాలు :

అలరాస పుట్టిళ్లు : ఈ కథ కళ్యాణి సుందరీ జగన్నాథ్ రాసింది. సంప్రదాయానికీ, సామాజిక నీతి నియమాలకీ బలి అయిపోయిన యువతి కథ 'అలరాస పుట్టిళ్ళు'. భర్త అంటే ఇష్టం లేకపోయినా కాపురం చేసి తీరాలనే సంప్రదాయాన్ని పాటించే రోజుల్లో తను ప్రేమించిన వాణ్ణి మరిచిపోలేక, కట్టుకున్న భర్త నచ్చక, అత్తింటి నుంచి పారిపోయి వచ్చేసిన పిల్ల పట్ల పుట్టింట్లో పెద్దవాళ్లు ఎంత నిర్దయగా ప్రవర్తించారో, చివరికి ఆమె జీవితాన్ని ఎలా అంతం చేశారో తెలియజేసేదిగా ఈ కథ ఉంది.

కథానాయిక సత్యవతి, కథానాయకుడు చెంగల్వరాయుడు. సత్యవతి అన్న సుబ్బారాయుడు ఊరి మునసబు. అతడు పరువు కోసం ఎంతకైనా తెగించే స్వభావం కలవాడు. చెంగల్వరాయుడు మునసబు ఇంట్లో పనిచేస్తూ, సత్యవతితో బాల్యంలో నుండే అనుబంధం పెంచుకుంటాడు. వారిద్దరి స్నేహం ప్రేమగా మారుతుంది. కానీ, ఆర్థిక, సామాజిక అంతరాల వలన పరువు సమస్యల వల్ల ఈ ప్రేమ పెద్ద సమస్యగా మారుతుంది. సత్యవతికి వేరొకరితో పెళ్లి చేస్తారు. **"నిన్న సాయంత్రం నన్ను బలవంతంగా ముస్తాబు చేశారు,**



పడకటింటి వేపు తొంగిచూడనైనా చూడకుండా నేను పారిపోయి వచ్చేశాను." అత్తవారి ఇంట్లో **"అసలు ఆడదానికి ఇష్టమూ, అయిష్టమూ ఏంటి?"** అంది సవితి తల్లి. **"పరువు ప్రతిష్టలు గల కొంప బయటి కీడ్చుకు తల్లీ"** అన్నారు. మునసబుగారు, నిమ్మళంగా దగ్గుతూ. **"తిరిగి వచ్చావా, గడప కడ్డంగా నరికేస్తాను"** అన్నాడు కోపంగా సుబ్బారాయుడు." **(కథా సాగర్, 307).**

సత్యవతి మాత్రం ప్రేమించిన చెంగల్వరాయుడిని మరవలేక, మనసు చంపుకొని భర్తతో కాపురం చేయటం ఇష్టం లేక, వివాహమైన తరువాత మనసు చంపుకోలేక తిరిగి పుట్టింటికి వస్తుంది. ఇది చూసిన సుబ్బారాయుడు, పరువు కోసం తన చెల్లెల్ని గోసలేరు నదిలో నెట్టివేస్తాడు. కానీ ఈ ఘటనతో తన చెల్లెలిని తలుచుకుంటూ అనారోగ్యం పాలవుతాడు. చివరికి తన పాపాన్ని ఒప్పుకుంటూ మరణిస్తాడు.

ఈ కథ, పితృస్వామ్య వ్యవస్థ కలిగిన ఉన్నత కుటుంబాలలో పరువు, ప్రతిష్ఠ పేరుతో స్త్రీ ప్రేమకు విలువ ఇవ్వని పరిస్థితులను తెలియజేస్తుంది. ప్రస్తుత సమాజంలో స్త్రీల ప్రేమను అంగీకరించని కుటుంబ వ్యవస్థ, స్త్రీల స్వేచ్ఛను హరిస్తూ, నేటి సమాజంలో ఇప్పటికీ చాలా కుటుంబాల్లో 'పరువు' పేరుతో ఇంటర్ కాస్ట్, ఇంటర్ రిలిజియన్ పెళ్లిలను నిరాకరించడం, స్త్రీలలో సహజంగా ఏర్పడే ప్రేమకు కూడా హద్దులు ఏర్పరచటం, కొన్నిచోట్ల పరువు హత్యలకు కూడా వెనకాడని పరిస్థితులను మనం నిత్యం పేపర్లలో చూస్తూనే ఉన్నాం.

6. పేదరికంలో స్త్రీల జీవితం

కాళీ సీసాలు : ఈ కథను స్మైల్ రాశారు. ఈ కథ ఇద్దరు పేదరికపు మహిళల జీవితాల దారిద్ర్యపు దుర్భర పరిస్థితిని తెలియజేస్తుంది. చేతిలో చిల్లి గవ్వలేక, పని చేద్దామన్న పని దొరకక, తినడానికి తిండి లేక, కట్టుకోవడానికి బట్ట కూడా సరిగా లేక, పసి పిల్లలకు పాలు కూడా కొనలేని పరిస్థితులను చిత్రించేదిగా ఉంది. పైడితల్లి, నూకాలమ్మ అనే ఇద్దరు మహిళల మధ్య బ్రతుకుతెరువు కోసం ఏర్పాటు చేసుకున్న వ్యాపారంలో తలెత్తిన విభేదాలను, తద్వారా జరిగిన పరిణామాలను చిత్రించారు. కింగ్ జార్జ్ ఆసుపత్రిలో మందుల కోసం ఖాళీ సీసాల అవసరం, వాటిని అమ్ముకునే ప్రయత్నంలో

ఏర్పడే ఘర్షణ ఈ కథకు కేంద్ర బిందువు. పైడితల్లి తన బిడ్డల ఆకలి తీర్చటం కోసం కనీస ధరకైనా సీసాలు అమ్మడానికి సిద్ధమవుతుంది. అదే సమయంలో నూకాలమ్మ అంతకంటే తక్కువ ధరకే అమ్మడంతో ఆ విషయంలో వారి మధ్య గొడవ జరుగుతుంది. తమ ఆర్థిక అవసరాల కోసం పేదలు తమ ఆత్మగౌరవాన్ని కోల్పోయే స్థితికి ఎలా దిగజారుతున్నారో మనం చూడగలుగుతాం. వారిద్దరి మధ్య గొడవ పెద్దదై వీధిలోని జనాలు చూస్తుండగానే నూకాలమ్మ పైడితల్లి చీర లాగుతుంది. ఆమెను మురుగు కాలువలో పడేస్తుంది.

వివస్త్ర అయిన పైడితల్లి తన రెండు చేతులతో తన శరీరాన్ని కప్పుకుంటూ నిలబడుతుంది. సీసాలు అమ్మటం అనేది చాలా చిన్న వ్యాపారం. ఇది వారికి కనీస అవసరాలు తీర్చడానికి కూడా సరిపోదు. కానీ ఆ ఇద్దరి మహిళల పేదరికమే వారి మధ్య ఘర్షణకు కారణం. ఒంటిమీద నూలు పోగైనా లేని పైడితల్లి తన రెండు చేతులతోనూ శరీరాన్ని దాచాలని ప్రయత్నం చేస్తుంది. మానం పోయిన బాధతో అంతటి అవమానం భరించలేని పైడితల్లి చివరికి వేగంగా వచ్చే బస్సు క్రిందపడి ఆత్మహత్య చేసుకుంటుంది. ఆమె మరణం ద్వారా రచయిత పేదల జీవన సంఘర్షణను, మనుషుల మధ్య దిగజారిన మానవతా విలువలను, అక్కడ ఉన్న ప్రజలు వారి మధ్య గొడవను ఒక వినోదంగా మాత్రమే భావిస్తారు. కనీసం కాపాడదామన్న జాలి, దయ కూడా సభ్య సమాజం వారి మీద చూపించలేకపోయింది. ఖాళీ సీసాలను పేదల జీవితాలతో పోలుస్తూ, వాళ్ల జీవితాలు ఎంత దుర్భరంగా ఉన్నాయో ఈ కథ మనముందు ఉంచుతుంది. ప్రజలందరి ముందు వారిద్దరి మధ్య గొడవ జరుగుతుంది. కానీ అక్కడ ఉన్న వారు ఎవరూ దానిని ఆపకుండా ఉండటం దిగజారుతున్న మానవీయ విలువలకు అద్దం పడుతుంది. ఈ పరిస్థితి మన సమాజంలోని అసమానతలను, దిగజారుతున్న మానవత్వాన్ని ఎత్తిచూపేదిగా ఉంది. ఈ కథ పేదవారి కష్టాలను మన కళ్ళకు కట్టినట్టు చూపిస్తుంది. ఖాళీ సీసాల్లా వాళ్ల జీవితం కూడా వెలితితో, నిరాశతో నిండి ఉంది. కేవలం కొద్దిపాటి డబ్బు అది కూడా పొట్టకూటి కోసం వాళ్లు తమ ఆత్మగౌరవాన్ని కూడా ప్రక్కన పెట్టి, జీవన పోరాటం చేయాల్సిన పరిస్థితులు తెలియజేస్తుంది. ఇది సమాజంలోని మానవతా విలువలు ఎలా తగ్గిపోయాయో తెలియజేస్తూ, పేదవారి ఆకలి బాధలు ఎవరికీ వినిపించని మౌన రోధనలాగా సమాజాన్ని ప్రశ్నిస్తుంది. సమాజంలో ఉన్న ప్రతి ఒక్కరూ పేదవారికి ఆపన్న హస్తాన్ని అందించాలనే నగ్న సత్యాన్ని గుర్తుచేస్తుంది.

7. ముగింపు :

స్త్రీలను దేవతలుగా గౌరవించిన భారతదేశంలో నేటి స్త్రీ సుస్థిరమైన స్వేచ్ఛను అనుభవించలేక నలుగుతున్నది. అనేక సామాజిక, ఆర్థిక, మానసిక సమస్యలతో స్త్రీ రోజూ పోరాడుతూ ఉన్నది. సృష్టికి మూలమైన స్త్రీకి ఆదికాలం నుంచి నేటివరకు అనేక అవమానాలు, నిందలు, పరాభవాలు వెంటాడుతున్నాయి. వేదాలు, పురాణాలు స్త్రీని గొప్పగా చెప్పినా, సమాజం మాత్రం ఆమెను పదే పదే కట్టుబాట్లలోకి నెట్టేసింది. "నస్త్రీ స్వాతంత్రమర్హతి" అన్న మనుధర్మ శాస్త్రంలోని వాక్యం ద్వారా ఆమెకు స్వేచ్ఛ లేని స్థితి స్పష్టమవుతుంది. సీత, ద్రౌపది, చంద్రమతి వంటి పురాణ స్త్రీలు ఎదుర్కొన్న కష్టాలు చూస్తే, సామాన్య స్త్రీల పరిస్థితి ఎంత దుర్భరంగా ఉంటుందో ఊహించవచ్చు. ఈ నిత్యకథనాన్ని ఆధునిక సాహిత్యం స్పష్టంగా దర్శింపజేస్తోంది. స్త్రీ హృదయంలో ఉన్న భావాలు, కలలు, బాధలు ఆధునిక రచయితలు అద్భుతంగా తీర్చిదిద్దారు. ప్రాచీన కవిత్వం ఆమె శరీరాన్ని వర్ణిస్తే, ఆధునిక సాహిత్యం ఆమె మనస్సు లోతుల్లోకి దిగి పరిశీలించింది. స్త్రీల అస్తిత్వాన్ని తెలిపే రచనలలో కథా సాహిత్యం ఒక ముఖ్యమైన మార్గం. ఈ కథల ద్వారా స్త్రీలు ఎదుర్కొనే సమస్యలు, దాని ద్వారా వారు పడే ఆవేదన హృద్యంగా వెలుగులోకి వచ్చాయి. ఈ విధంగా కథాసాగర్ సంకలనంలో స్త్రీలు సమాజంలో ఎదుర్కొంటున్న సమస్యలను స్పష్టంగా చిత్రించారు.

8. ఉపయుక్త గ్రంథాలు :

1. కథాసాగర్, ఎం.ఏ సుభాన్ సంపాదకత్వం, కళాసాగర్ కల్చరల్ ట్రస్ట్, చెన్నై.

2. దక్షిణామూర్తి పోరంకి, కథానిక స్వరూప స్వభావాలు. స్వీయ ప్రచురణ.

3. నారాయణ సింగమనేని – తెలుగు కథకులు కథన రీతులు– 3, విశాలాంధ్ర పబ్లికేషన్ హౌస్, హైదరాబాద్.

4. వల్లంపాటి వెంకటసుబ్బయ్య. కథా శిల్పం, విశాలాంధ్ర పబ్లికేషన్ హౌస్, హైదరాబాద్.

5. కాత్యాయనీ విద్మహే, తెలుగులో స్త్రీల సాహిత్యం, కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్.



ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 9 (51) హైదరాబాద్ జూలై : 2025

నీతి శాస్త్రము – తాళపత్ర గ్రంథము

డా. గంద్ర లక్ష్మణ రావు, విశ్రాంతాచార్యులు ఫోన్ : 98493 28036

(గత సంచిక తరువాయి)

దానఖ్యాతికరం రిపుక్షయకరం పుంసస్య భూషాకరం
విష్ణు ప్రీతికరం మనశ్శుచికరం పుత్రాది సంపత్కరం
ఆయుర్వృద్ధికరం పరత్వ నియమాన్స్వర్గాది భోగావహం
తత్త్వం ప్రాహురనైక వైభవకర దానప్రభావం బుధా ॥ –117

పద్యానువాదం :

సీ. సత్కీర్తి గలిగించు శత్రువుల హరియించు
పురుషునకగు మంచి భూషణమ్ము
మాధవుడును మెచ్చు మనసుశుద్ధంబగు
పుత్రపౌత్రులకెల్ల పుణ్యమగును
ఆయుష్యమును పెంచు నమరభోగములిచ్చు
శ్రీవికుంఠమునకు జేర్చగలుగు
ఎన్నొపురాణముల్ విన్నఫలితమిచ్చు
బహుమాన్యుడను కీర్తి బడయగలుగు
తే.గీ ఇహము పరమునసౌఖ్యము లెన్నొ కలుగు
సకల వైభవములతోడ సాగు బ్రతుకు
దాన మెరిగిన వాడు సుజ్ఞానియౌను
దానమునుజేయు నుత్తమ మానవుండు

అర్థం : దానము వలననే శత్రు జయము. పురుషులు సమస్త భూషణలు గలవారు. విష్ణువుకుదానమే ప్రీతి సదా. పుత్ర పౌత్రుల సంపద దీర్ఘాయువు, వైకుంఠ ప్రాప్తి , స్వర్గ భోగాలు అనుభవించును. అనేక పురాణాలు విన్నవారు అనేక వైభవం దానమనే గుణాలకు యిన్ని విధాల భోగమనుభవింతురనిన రీతి. (గత సంచికలో అనువాద పద్యం పొరపాటు పడింది)

పర్ణాగ్రం పర్ణపుష్టంచ చూర్ణపర్ణం ద్విపర్ణకం
భూమౌ నిపతిత పర్ణం శక్రస్యాపి శ్రియం హరేత్ – 118

పద్యానువాదం :

ఆకు కొసనుగాని వెనుక నార గాని
తీసివేయక సున్నము వేసి తినిన
పరుల కివ్వంగ నేలపై పడిన తమల
పాకు తిన్నను యింద్రసంపదయు తొలగు

అర్థం : ఆకుల కొన తుంచి ,ఆకు తొడిమె వెనుక నారదీసి వేయక సున్నం బెట్టిన ఆకు తిన్నా, రెండాకుల తాంబూలం తిన్నాను, యివ్వంగ కిందపడినది వేసుకున్నాను యీ లక్షణ తాంబూలం దిన్న యింద్రుని భాగ్యమైన తరుగుననినరీతి ...



వివాహో విద్య నాశాయ అర్థనాశాయ కుంజరః
శాలికో గృహనాశాయ సర్వం నాశాయ మాతులః !! 119

పద్యానువాదం :

పెండ్లి యైనచో విద్యపై ప్రేమ తొలగు
ప్రభుత లేకకరిని పెంచ భాగ్యమడగు
పందికొక్కులు గల యిల్లు పాడుబడును
మేనమామల గారాబు మేలుకాదు

అర్థం : వివాహమైతే విద్యమీద ప్రేమ తొలగును, ప్రపంచం లేనిది ఇంటిముందు యేనుగును పెడితే ద్రవ్యం తొలగును.పందికొక్కులు దలిగిన యిల్లు చెడిపోవును, మేనమామల ఆజ్ఞలో తిరిగిన వాడు చెడు ననినరీతి.

అనృతం సాహసం మయా మూర్ఖత్వ మతి లుబ్ధతా
నిషిద్ధయో సాధ్వి నీచస్త్రీణాం దోషంచ అనంత్ణ !! 120

పద్యానువాదం :

కల్లలాడుట సాహసకార్యములును
మాయ చేష్టలు, తనపని మానివేయ
మంచి విననట్టి మూర్ఖత,మించు లోభ
గుణము,ఎదురాడుట తగని పనులు చేయ
సహజ గుణములు నీచపు సతుల కెపుడు

అర్థం : కల్లలాడుట, శాయరాని సాహసాలు జేసుటము, తెలియని మాయలు జేసుట, వొప్పజెప్పిన మాట వినక మూర్ఖతనం జేసుట, లోభగుణాలు గల్గుట,శాయరాని పనులు జేసుట మర్లబడి తక్కువ మాటలనుట, ఈ గుణాలు నీచ స్త్రీలకు స్వభావమనిన రీతి.

మేధావి వాక్పటు ప్రాజ్ఞ పరచిత్తో సారక్షర్ణ
ధీరో యథార్థవాదీచ యేష దూతో విధీయతే ! 121
(చాణక్య నీతి లో ఉన్నది)

పద్యానువాదం :

మంచి మేధావి తగినట్టి మాటకారి
ఎదుటి వారిమనస్సు గ్రహించు నేర్పు
ప్రజ్ఞ యును ధైర్యము నిజము పలుకుటయును
యిట్టి గుణవంతు దూతగా నెన్న తగును

అర్థరా బుద్ధిమంతుడు,వాక్పటుత్వం గలవాడు,ప్రజ్ఞగల్గి, యెదిరి చిత్తము నెరిగి, ధైర్యం గలిగి నిజము పల్కిన వాడు రాజుకు దూతగా తగుననిన రీతి.

స్వభార్యా గృహదక్షనంనారీచ పతివ్రతా
తం నారీ ప్రియబుధ్వాచ సం నారీవ మనో తథా ! 122

పద్యానువాదం :

భర్త మెచ్చెడి దైనట్టి భార్య యగుచు
యిల్లు చక్కదిద్దెడినేర్పు నెంతొ గనుచు
పతిననుసరించెడు నడవడిక తోడ
హితవు కోరెడు నామెయే యింతి యనగ

అర్థరా తనభర్తకు మనోహరముగా నచ్చినా, యింటికి దక్షురాలు, పతివ్రతయును, భర్తకు ప్రియము చెప్పనేర్చును. యిట్లని నిశ్చయం చేసేదనిన రీతి.

యస్యపుత్ర వశోభద్ర భార్యా బంధానువర్తినీ
విభవో యతి సంతోషం స్వర్గస్తస్య స్వయమేవహా ! 123
(యస్య పుత్రో వశీభూతో భార్య ఛందానుగామినీ
విభవే యశ్చ సంతుష్ట తస్య స్వర్గ ఇహైవ హి) (చాణక్య నీతి లో ఉన్నది)

పద్యానువాదం :

తనదు వశములోనున్నట్టి తనయులుండ
బంధమును బట్టి వర్తించు భార్య యున్న
ఉన్న దానిలో సంతృప్తి నొందెనేని
అంత కంటెను వేరు స్వర్గమ్ములేదు.

అర్థం : యెవని కొడుకు తండ్రికి వశమై యుండునో, యెవ్వని పెండ్లాము వశవర్తియై యుండునో, యెవ్వనికి విభవము కల్గి సంతోషము కలిగి యుండునో వానికి యీ లోకం స్వర్గభోగమనిన రీతి.

తస్మిన్ దేశేన సన్మానం నపుత్రేణ చ బాంధవః
నచ విద్యామగచ్ఛైవ న సత్రాదిక సంభవత్ ! 124
(యస్మిన్ దేశే న సన్మానో న వృత్తిర్నచ బాంధవాః
న చ విద్యా2గమః కశ్చిత్ తం దేశం పరవర్జయేత్ –చాణక్య నీతి లో ఉన్నది)

పద్యానువాదం :

ఎట్టి దేశానగౌరవమింత లేదొ
బంధువులు గౌరవించక బ్రతుకు లేదొ
తనదు విద్యకు తగినయాదరము లేదొ
అట్టి దేశము విడుచుట యగును మేలు

అర్థం : యేదేశము తనకు సన్మానం లేకయుండునో, యేబంధువులు సన్మానం లేకయుండునో, యెచ్చోట తన విద్య ప్రయోజనం లేకయుండునో,ఆ దేశం ఆ బాంధవులు ఆ స్థలములు విడిచి వొక దేశమున నుండవలె ననినరీతి.

పార్థివస్యచ భృత్యాచ తత్స్వామి గుణ లక్షణం
తథాభిజ్ఞో మహీపాలా సద్భృత్యా న పరీక్షయేత్ ! 125

పద్యానువాదం :

ఎవడు యజమాని గుణముల నెంచిచూసి
మంచి గుణములతోడను మసలు చుండి
యెట్టి కార్యమ్ము తగజేయు దిట్ట యెవడొ
అతడె మంచిసేవకుడగు నధిపులకును

అర్థం : రాజునకు బంటువేయున్ను, అదెట్లన్నను అన్ని లక్షణములు తెలిసి, దయయు క్షమయు కలిగి ఆ యేలిన దొర యావత్కార్యము జేసిన బంటు మేలనిన రీతి ...

కుల్యార్థం కులువ సామార్థం యాజ్ఞియవసాయన్న
అర్థరాజ్య హతం భృత్యా న హన్యం న మాన్యతే ! 126

పద్యానువాదం :

రాజ్యమును సంపదనుబట్టి రాజు తనకు
తగిన బంటును నియమింప ధర్మమగును
బంటు చతురంగ బలములు భాగ్యమున్న
అతనిచెంతనే రాజుసర్వమ్ము చెడును

అర్థరా రాజులకు గల అర్థమున్ను , రాజ్యమున్ను , ఉద్యోగానకు తగిన బల్మిగల బంటును రాజెరుగ వలెను, చతురంగ బలము గల బంటును చేరుకపాయెనా , వాని చెంతనే రాజు చెడుననిన రీతి.

ఉదితాపేక్షణాధ్యక్ష స్వామభక్తిశ్చ నిశ్చలం
లుబ్ధాసత్య వదాం ధీర ధాన్యధ్యక్ష విధీయతే ! 127

పద్యానువాదం :

రాజు కోపింప తగుమాట లాడ నేర్చి
ధైర్యమును సత్య ధనములు దానమిచ్చి
నిదురనున్నట్టి వానికి నీతి నేర్ప
అతడు వ్యవహార దక్షుడై యవతరించు

అర్థం : రాజు అల్గినంత తగిన మాటలు చెప్పనేర్చి స్వామిభక్తి గలిగి లుబ్ధుడై సత్యవంతున్ని, ధీరత గల్గి నిద్రలేనివాణ్ణి ధనధాన్యములు ఇచ్చి వ్యవహారానకు దక్షుడనినరీతి.

ప్రదితాపేక్షణాధ్యక్ష స్వామభక్తిశ్చ నిశ్చలం
లుబ్ధాసత్య వదాం ధీర ధాన్యధ్యక్ష విధీయతే ! 127

పద్యానువాదం :

రాజు కోపింప తగుమాట లాడ నేర్చి
ధైర్యమును సత్య ధనములు దానమిచ్చి
నిదురనున్నట్టి వానికి నీతి నేర్ప
అతడు వ్యవహార దక్షుడై యవతరించు

అర్థం : రాజు అల్గినంత తగిన మాటలు చెప్పనేర్చి స్వామిభక్తి గలిగి లుబ్ధుడై సత్యవంతున్ని, ధీరత గల్గి నిద్రలేనివాణ్ణి ధనధాన్యములు ఇచ్చి వ్యవహారానకు దక్షుడనినరీతి.

సూతో2శ్వాని తపశ్చేత కృతశ్వాయవాకృత్ణ్ణె
మద్యపానేషు స్త్రీ సక్తం రాజానిశ్చిత సర్వత్ణ ! 128

పద్యానువాదం :

ప్రసవమొందిన శ్వానము వలెకదలక
వట్టి తపసి వోలిక యెట్టి పనియు లేక
తగిన ధనధాన్యముల కూర్చు తలపులేక
మద్య పానము చేయుచు మగువలందు
పరవశుండగు రాజుతప్పకను చెడును.

అర్థం : యే రాజు యీనినకుక్క వలె లోపలనే యుండునో, వూరికే తపశివలె నుండునో, అధిక ధన ధాన్య వ్యాప్తి చేయక వుండునో, స్త్రీలతో ముగ్ధుడై మద్యపాన పరవశుడౌనో ఆరాజు చెడుననిన రీతి.

అనుమానం (కంద విన్యాసం)

వల్లభాపురం జనార్దన
ఫోన్ : 9440163687

అనుమానము నీ మిత్రుడు
అనుమానపు ప్రశ్న నిన్ను అభివృద్ధి పథం
బున నడిపించును ముందుకు
అనుమానములోని చిక్కు నదిలించినచో

అనుమానము నీ శత్రువు
అనుభవమును సాగనీక నడుగుకు తొక్కున్
మనసునకు పిరికి తనమును
అనువుగ జొరగొట్టి నిన్ను నాటాడించున్

అనుమానము నీ నడతను
పెనవేసుకు పిండునట్టి పితలాటకమే
అనువుగను దాని కుతికను
దనుమాడిన తెలివి రవియె దురమున గెల్చున్

అనుమానము జిజ్ఞాసకు
గొనబుతనము నేర్పి గురుతు కొలువును చూపున్
అనునిముసము దాని నుడిని
మునిగినచో ముందడుగు ముప్పే ముప్పే

అనుమానము ప్రతి దానికి
మునుకొని రానీక ప్రతిభ ముద్రిక తోడన్
ఒనరుగనే తరిమి నపుడె
అనుమానము తీరి ప్రగతి అందలమెక్కున్

అనుమానము దూరిన మది
ననలపు మాటలు దహించు నారవు క్షణమున్
కనికరముండదు దానికి
పెను నలజడి తలపులందు పెంచును వరదై

అనుమానము మెదిలినచో
కునుకే కంటిని దూరదు కుములుటె మిగులున్
మునుమయి భయమే జొరబడు
అనుకూలతలన్ని మాయమయి బెదిరించున్

అనుమానము పెనుభూతము
అనుమానము వెంటపడిన ఆగును పథమే
అనుమానపు వల బిగిసిన
అనుమానము లేదు గెలుపు అందని పండే

అనుమానము పుట్టినచో
వెనువెంటనె శోధనమ్ము పెంచగవలెనూ
కనుగొనవలెను సమస్యకు
అనువైన జవాబు వెతికి యాలోచనతో

అనుమానము అడుగడుగున
కనిపించును శత్రువు వలె కత నడుపుటకై
అనుభవమున మిత్రుడగుచు
నిను ముందుకు కడిపించెదు నేర్పును నేర్పున్

అనుమానమనుచు వెరువకు
మనసున యోచనను పెంచి మథనము చేస్తే
అనుమానము మాయమగును
నినువడి రచియింపదగిన నీతిని నేర్పున్

అనుమానము వెంటపడిన
వెనుకడుగును వేయకుండ బెదురును వదిలీ
అనువగు పరిశోధనతో
పెనుపున నిజమును గ్రహించు విధము నెరుగుమా

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 9 హైదరాబాద్ జులై : 2025

అనుమానము బీడు పొలము
అనుమానము నది కాదనుకొని ఆశవదలకన్
అనువగు తెలివి హలముతొ
కనుగొనవలె సాగురీతి కల నిజమవగా

అనుమానము ప్రశ్న యగుచు
నిను విడువని చెలి ఆసరగుచు నీకనుపాపై
మునుకొని ముందుకు నడుపును
అనుమానమె నీకు విజయమందించునురా

అనుమానమొక యగాధము
మనసున జొరబడి నిలిచిన మతికగు షాకే
అనుభవ చైతన్యముతో
ననువగ దాటుట తెలుసుక నడుగేయవలెన్

అనుమానము హిమ శిఖరము
తన శిరసందుకొనుమని తప్పెట గొట్టున్
కనమోచన నిచ్చెనతో
ఘన శిఖరము నెక్కి మెప్పుగనవలె భువిలో

అనుమానము సహచరుడే
చనుబాటను నడువ నేర్పు సాధన గురువే
వినుకలిని నమ్మి శోధన
మును వదలి పెడితె కలుగును ముప్పే తప్పే

అనుమానము వెనుకంజకు
మునుమయి మనసునకు ముప్పు ముడివేయును రా
అనువైన వివేచనతో
అనుమానమనెడి బెదురదియందతమగునురా

నవనవ ఆవిష్కరణకు
నవిరళ మనుమాన మొసగు నద్భుత ధృతినే
సవరణ వివరణ తోడుత
జవమగు భావము నిలబడి జాగృతపరచున్

అనుమానము రుజువగుటకు
అనువగు నిదర్శనములను అందుకొనినచో
నిను పరిశోధకుడను పే
రునకు సిఫారసును చేసి రూఢిగ నిలుపున్

విషయము సవిస్తరముగ
కృషితో విజయమను రీతి క్రీడించినచో
మృషయగు ననుమానమనెడు
విషము దరిజేరదు మతికి విజయము దక్కున్

నిలిచిన నీరు కదలికయు
తెలివికి విద్యుత్తగుచును తెరతీయునురా
అలికిడి కదలికల నడుమ
అలువక ననుమానమదియె నధ్యాపకుడౌ

అనుమానము పరిశోధన
కన సహచరుడౌ రిపువగు కత చెప్పుటలో
అనువును తెలుసుక నడచిన
అనుమానమె నిన్ను గెలుపుటంచుకు చేర్చున్

అనుమానము వెనుకంజకు
మునుమయి మనసునకు ముప్పు ముడివేయు సదా
అనువైన వివేచనతో
అనుమానమనెడి కుటిలము అంతమగునురా

నవనవ ఆవిష్కరణకు
నవిరళమనుమానమొసగు నద్భుత ధృతినే
సవరణ వివరణ తోడుత
జవమగు భావము నిలబడి జాగృత పరచున్

అనుమానము ఋజువగుటకు
అనువగు నిదర్శనములను అందుకొనినచో
నిను పరిశోధకుడను పే
రునకు సిఫారసును చేసి రూఢిగ నిలుపున్

విషయమును సవిస్తరముగా
కృషితో విజయమను రీతి క్రీడించినచో
మృషయగు ననుమానమనెడు
విషము దరిజేరదు మతికి విజయము దక్కున్

మతికి రుజను కలిగించును
వ్యతిరేక ధృతికి కృతక భాష్యము చెప్పున్
హితవనుకొనకనుమానము
చ్యుతి పథముకు నడుచునట్లు సూక్తులు చెప్పున్

అనుమానము హితవరియయి
నిను యోచన భాస్కరునిగ నిలబెట్టునురా
మునుపటి ఆవిష్కరణకు
అనువగు జోడింపు చేయునభిరతి పెంచున్

అనుమానమనుచు వదలకు
అనుమానము బుద్ధిమత్తు వదలించును దా
గిన గుట్టుల రూపములను
కనిపించునటు లొనరించు కలుగగ జవముల్

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 9 హైదరాబాద్ జూలై : 2025

నీరాజనం (బిరుదురాజు రామరాజు శతజయంత్యుత్సవ స్మారక సంచిక)

ఘట్టమరాజు, బెంగుళూరు. ఫోన్ : 9954082076



నీరాజనం (బిరుదురాజు రామరాజు శతజయంత్యుత్సవ స్మారక సంచిక)
సంపా: టి. ఉదయవర్లు, తిరునగరి దేవకీదేవి
వెల : 400
ప్రతులకు:
శ్రీకృష్ణదేవరాయ తెలుగు భాషా నిలయం
4-4-8, సుల్తాన్‌బజార్,
హైదరాబాద్- 500001
ఫోన్: 9885686415

తెలుగు జానపద సాహిత్య సంస్కృతుల వివేచన, ప్రాచీన తెలుగు కావ్యాల, సంస్కృత కావ్యనాటకాల పాఠపరిష్కరణ, తెలంగాణ విస్మృత కవిపండితుల గవేషణ, రచనల అధ్యయనం, తెలుగు యోగుల తత్త్వచింతనల పరిశీలనల ముప్పిరి గొన్న మూర్తిమత్త్వం ఆచార్య బిరుదురాజు రామరాజు గారిది. హైదరాబాద్ లోని శ్రీకృష్ణ దేవరాయ తెలుగు భాషానిలయం సంస్థ గౌరవ కార్యదర్శిగా, ఉపాధ్యక్షులుగా సేవలందించిన డా.రామరాజు గారి శతజయంత్యుత్సవ స్మారక సంచిక 2025 ఏప్రిలు 14వ తేదీన సంస్థ సభాంగణంలో ఘనంగా ఆవిష్కరింపబడింది. ప్రసిద్ధ పాత్రికేయులు టి.ఉదయవర్లు, విదుషి తిరునగరి దేవకీదేవి 'నీరాజనం' సంపాదక బాధ్యత నిర్వహించారు. ఆచార్య బిరుదురాజు రామరాజు గారి బహుముఖీన ప్రతిభను కొనియాడే వ్యాసాల, జ్ఞాపకాల, కవితల-55 రచనల సమాహారం ఈ నీరాజనం'. సంపాదకులు టి. ఉదయవర్లు **"తక్కువ సమయంలో ఎక్కువ మంది ప్రముఖ రచయితలతో వ్యాసాలు వ్రాయించి, వాటి ప్రూఫులు వేగంగా చూపి సమయానికి గ్రంథాన్ని"** వెలువరించామన్నారు. (పరిశోధన పరమేశ్వరుడు పేజి: IX - X) సంపాదకుల ఈ వేగిరపాటు ఈ స్మారక సంచిక వైశిష్ట్యం పై దెబ్బ తీసిందనే చెప్పవచ్చు.

'నీరాజనం' స్మారక సంచికలోని కొన్ని గుణాల్ని ప్రస్తావించడం సబబు. డా.శ్రీరంగాచార్యులు ఆచార్య రామరాజుగారి తెలుగు గ్రంథాల పరిష్కరణలో ప్రసన్నరాఘవ నాట్య ప్రబంధం, శివరాత్రి మాహాత్మ్యం, పద్మపురాణం, శుకసప్తతి మొదలైన కావ్యాల పరిష్కరణలో డా. రామరాజు గారి కూలంకష అధ్యయనాన్ని, పాఠాంతరాల సూచనా సామర్థ్యాన్ని, పాఠశైథిల్యాల సముచిత పూరణల్ని చక్కగా పేర్కొన్నారు. ఆచార్య సంగనభట్ల నరసయ్య 'బి.రా.రా.గారి గ్రంథ సంస్కరణలు' వ్యాసంలో కాళహస్తి కవి అనువదించిన 'సంస్కృత వసుచరిత్ర' కౌశలాన్ని ఉగ్గడించారు. సంస్కృత నాటక ప్రకారాల్లో ఒకటైన 'శృంగారశేఖర భాణమ్' ను రచించిన అభినవ కాళిదాసు వెల్లాల ఉమామహేశ్వరుడని నిరూపిస్తూ రామరాజు గారు రాసిన విస్తృత, పాండిత్యపూర్ణమైన పీఠికను ప్రశంసించారు.

డా. సిహెచ్. లక్ష్మణ చక్రవర్తి ఆచార్య రామరాజుగారు తెలంగాణ విస్మృతకవులు 16 మందిని పరిచయం చేస్తూ వాళ్లకు తెలుగు సాహిత్య చరిత్రలో యోగ్యస్థానం లభించాలని 'చరిత్రకెక్కని చరితార్థుడు' లో చక్కగా ప్రతిపాదించిన వైనాన్ని' 'చరిత్రకెక్కిన చరితార్థుడు బిరుదురాజు రామరాజులో" ప్రస్తావించారు. డా.టి శ్రీరంగస్వామిగారి వ్యాసం 'మరుగుపడిన మాణిక్యాలు' పై వ్యాసానికి కొంతవరకు పూరకమే.

ఆచార్య బిరుదురాజు రామరాజు తెలుగు జానపద సాహిత్య సంస్కృతులకు చేసిన సేవ అత్యంత అమూల్యమైనది. కాని ఆయన వివిధ, విశిష్ట రచనల గురించి తగిన వివేచన ఈ 'నీరాజనం'లో కనపడక పోవడం విచారకరం. డా. రామరాజుగారు, తెలుగు జానపద సాహిత్యానికి సంబంధించిన ఆరు పుస్తకాల్ని ఆంగ్లంలో రాసి వుంటే, ఏ ఒక్క పుస్తకం పరిచయమైనా మనకు కలగక పోవడం పెద్ద కొరత. ఐతే ఆచార్యుల వారు ఇంగ్లీషులో రాసిన 'Contribution of Andhra to Sanskrit Literature (2002) గురించి డా.అమ్మంగి వేణుగోపాల్ రాసిన పరిచయాత్మక వ్యాసం ఉల్లేఖనీయం. ఈ సందర్భంగా గుణగ్రహణ పారీణులైన విమర్శకులు డా.ఆరుద్ర ఆచార్య రామరాజు గారు తెలుగు జానపదగేయ సాహిత్యానికి చేసిన మహత్తర సేవను 'పల్లె పాటల బిరుదురాజు' కవితలో ఈ విధంగా స్తుతించిన వైఖరి గమనార్హం.

"పెద్ద చదువుల పెద్దగుళ్ళో
పాటకేమో పీట వేస్తివి
నాటి నాడిని పట్టు కొంటివి
మేటి చేతలు చేస్తుంటివి". (పేజి: 355)

ఆచార్య రామరాజు గారి తెలుగు జానపద గేయ సంకలనాల గురించి విద్వాంసులు, విదుషీమణులు రాసిన వ్యాసాలు మరీ స్థూలంగా వున్నాయి, కాని కొల్లాపురం విమల గారి వ్యాసం 'పతి-చితి పేరంటాళ్ళ గాథల్లో సతీసహగమనం' (పేజీలు:303-321) లో డా.రామరాజుగారు పేరంటాళ్ళ కథల్ని కరుణరసాత్మక కథాగేయాలుగా పరిగణించారనీ, కాని వారు ఈ స్త్రీల దైన్యాన్నీ, అసహాయకతనూ గమనించక పోవడం ఆలోచించాల్సిన ముఖ్య విషయమని చెప్పారు. సతీసహగమనం "సామాజికమైన వ్యవస్థాగత

హింసకీ, సమిష్టి హింసాధోరణులకీ ప్రతి రూపమని (పేజి:319) కొల్లాపురం విమల గారి దృఢాభిప్రాయం.

డా.బిరుదురాజు రామరాజు గారు 'ఆంధ్రయోగులు' ఏడు సంపుటాలుగా వెలువరిస్తే ఈ స్మారక సంచికలో 1,5,6,7 సంపుటాలు మాత్రమే అనుశీలింపబడ్డాయి. అవి కూడా వరుసక్రమంలో కాకుండా చెల్లాచెదరుగా ముద్రింపబడటం చింతాజనకం.

ఆచార్య రామరాజు గారి బహుముఖీన ప్రతిభాపాటవాల్ని, జీవిత విశేషాల్ని జీవిత సంక్షిప్త పరిచయం, జానపద సాహిత్యసేవ, తెలుగు, సంస్కృత కావ్యనాటక పాఠ పరిష్కరణ, విస్మృత తెలంగాణ కవిపండితుల రచనా వైశిష్ట్యం, ఆధ్యాత్మిక సాహిత్యకృషి, విశ్వహిందూ పరిషత్తు, సాహిత్య సాంస్కృతిక సంస్థల సేవ మొదలైన శీర్షికల కింద వింగడించి, వ్యాసాల్ని క్రమబద్ధంగా ప్రకటించి వుంటే 'నీరాజనం' కర్పూర నీరాజనంగా వర్ధిల్లి వుండేది. రామరాజుగారి జీవితవిశేషాలు కొన్ని వ్యాసాల్లో పునరావృత్తం కావడం కంటిలోని నలుసుగా బాధిస్తుంది.

'నీరాజనం' లో వ్యాసాలు రాసిన వాళ్లల్లో చాలామంది విశ్వవిద్యాలయ ఆచార్యులు కావడం మూలాన, వాళ్ల వ్యాసాల్లో దొర్లిన దోషాల్ని సవరించే సాహసానికి వొడిగట్టలేకపోయారు సంపాదకులు.

డా. కంచి విజయలక్ష్మిగారు ఆచార్యరామరాజు 5 మందికి యమ్.ఫిల్; యమ్. లిట్ లఘు పరిశోధన గ్రంథాలకు, 32 మంది పిహెచ్.డి.పరిశోధన కృతులకు మార్గదర్శకత్వం వహించారని (పేజి:67) అంటే ఆచార్య జయధీర్ తిరుమలరావు ఆచార్య రామరాజుగారి "మార్గదర్శనంలో వందలాది పిహెచ్.డి.లు, ఎం.ఫిల్ లు వచ్చాయి" (పేజి:146) అని అనడం ఆశ్చర్యకరం!

ఆచార్య రామరాజుగారి జీవితవిశేషాల్ని, తెలుగు, ఇంగ్లీషు రచనల్నీ, అనువాదకృతుల్నీ వివేచిస్తూ డా.రాపాక ఏకాంబరాచార్యులు రాసిన చక్కని వ్యాసం 'మూర్తీభవించిన జానపద విజ్ఞానం'. 'నీరాజనం' చిట్టచివరి రచనగా కాకుండా మొట్టమొదటి వ్యాసంగా ముద్రింపబడి వుంటే అది తిలకాయమానంగా రాజిల్లి వుండేది. 'తాలిమి గలవారికి తలపెల్లా నీదేరు' అని తాళ్ళపాక అన్నమయ్య వూరకే అన్నారా?

'నీరాజనం' స్మారక సంచిక చక్కని కాగితాల మీద అందమైన అక్షరాలతో శోభిల్లింది. డా.రామరాజుగారి రమణీయ చిత్రాలతో, అట్టమీదా, చివరా మంగళకరమైన ఫోటోలతో విరాజిల్లింది. వ్యాసాల చివర వున్న ఖాళీ స్థలాలు ఆచార్యులవారి వ్యక్తిత్వగరిమను చాటే ఉదంతాలతో కనువిందు కలిగించాయి. శతజయంతి సందర్భంగా శ్రీకృష్ణదేవరాయ తెలుగు భాషా నిలయం 12 రచనల సంకలనం **'డా. బిరుదురాజు రామరాజు సారస్వత వ్యాసములు'** ప్రచురించడం హర్షణీయమూ, అభినందనీయమూను.

నీరాజనం బిరుదురాజు రామరాజు శతజయంత్యుత్సవ స్మారక సంచిక, సంపాదకులు:

టి. ఉదయవర్లు తిరునగరి దేకీదేవి.

ప్రథమ ముద్రణ: 16 ఏప్రిల్, 2025;

పేజీలు: 400; వెల: రు 400/-

ప్రతులకు : శ్రీకృష్ణదేవరాయ తెలుగు భాషానిలయం,

4-4-8, సుల్తాన్ బజార్, హైదరాబాద్-500 001.

సెల్ : 9885686415

❖ ❖ ❖ ❖ ❖

శిలాక్షరం

(బి.ఎన్.శాస్త్రి సాహిత్యం - సమాలోచన)

ప్రముఖ శాసన, చారిత్రక పరిశోధకులు, మూసీ పత్రిక వ్యవస్థాపకులు కీ.శే. బి.ఎన్.శాస్త్రిగారి రచనలన్నింటిపైనా సాధికారికమైన విశ్లేషణా వ్యాసాల సమాహారం 'శిలాక్షరం'.

సంపాదకులు : డా. భిన్నూరి మనోహరి

సహ సంపాదకులు : అట్టెం దత్తయ్య

వెల : 300/-



సంప్రదించండి.
మూసీ మాసపత్రిక
ఫోన్ : 934 7971177

మూసీ

సాహిత్య సాంస్కృతిక చారిత్రక మాసపత్రిక
మూసీ మాస పత్రిక సభ్యులుగా చేరండి
వెంటనే శాశ్వత చందాదారులు కండి.
సాహిత్య రంగంలో వెలువడుతున్న ఒకే ఒక
పరిశోధనాత్మక వ్యాసాల మాస పత్రిక
యూజీసీ కేర్ లిస్ట్‌లో చేరిన తెలుగు పరిశోధనా పత్రిక
శాశ్వత సభ్యత్వం (10 సం॥లు)... **2500/-**

సంప్రదించండి. మూసీ మాసపత్రిక... ఫోన్ : 934 7971177

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 9 హైదరాబాద్ జులై : 2025

సోమరాజు ఇందుమతీ కవిత్వం – భావచిత్రాలు

✍ **డా. స్వప్న భువకర్,** అసిస్టెంట్ ప్రొఫెసర్, ఎం.వి.ఎస్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, ఫోన్ : 9133635714

కాల్పనిక యుగ చైతన్యంతో వెలువడిన కవితను భావకవిత్వమని పిలవడం తెలుగులో రూఢికెక్కింది. 1920 ప్రాంతంలో జమీందారీ కవిత్వాన్ని త్రోసిపుచ్చి భావకవిత్వం రంగప్రవేశం చేసింది. ప్రకృతి కవిత్వం, ప్రణయకవిత్వం, భక్తి కవిత్వం, దేశభక్తి కవిత్వం, సంఘసంస్కరణ కవిత్వం, స్మృతి కావ్యాలు ప్రధాన శాఖలుగా భావకవిత్వం వర్ధిల్లింది. వీటిలో ప్రణయ కవిత్వం గొప్పగా భాసిల్లింది. ఆనాటి సామాజిక పరిస్థితుల్లో **"ఆమె కన్నులలో అనంతాంబరపు నీలినీడలు కలవు"** అంటూ ప్రణయ కవిత్వం చెప్పడం కవులకు (పురుషులు) మాత్రమే చెల్లింది. స్త్రీలు చదువుకోవడమే గగనంగా ఉన్న రోజుల్లో ఒక స్త్రీ కవిత్వం రాయడం అందులోనూ ప్రణయ కవిత్వం రాయడం దాదాపుగా అసంభవంగా ఉన్న రోజుల్లో ఒక స్త్రీ ప్రణయ కవిత్వం రాయడం అది అచ్చు కావడం చాలా అరుదైన విషయం.

ఇది జరిగింది ఎక్కడో కాదు మన తెలంగాణ ప్రాంతంలోనే 1933 నాటికి తెలంగాణ నుంచి ఒక స్త్రీ ప్రణయ కవిత్వం రాయడం విశేషం. ఖమ్మం జిల్లా రుద్రాక్షపల్లికి చెందిన సోమరాజు ఇందుమతిదేవి కావ్యావళి పేరుతో ప్రణయ కవిత్వం రాశారు. ఈమె హైదరాబాదు రాజ్యంలో నివసిస్తూనే ఆంధ్రప్రాంతం వారితో తన పుస్తక విషయమై ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపారు. తన తండ్రి కాళ్లూరి జోగారావు ఆశీస్సులతో 1936 లో ఈ పుస్తకం ముద్రణ పొందింది. దీనికి విశ్వనాథ సత్యనారాయణ, చిలకమర్తి లక్ష్మీనరసింహం, చెల్లపిళ్ల వెంకటశాస్త్రి తదితరులు ముందుమాట రాయగా అడవి బాపిరాజు ముఖచిత్రం సమకూర్చారు. కృష్ణాజిల్లా కలువపాములకు చెందిన యువకవి సమితి తమ ద్వితీయ ముద్రణగా ఈ పుస్తకాన్ని అచ్చు వేసింది.

1910 –1915 మధ్యకాలంలో ఖమ్మం జిల్లా రుద్రాక్షపల్లెలో ఇందుమతీ దేవి జన్మించింది. పుట్టింటి వారు కాళ్లూరి వారు. ఈమె సోదరుడు గోపాలరావు కవి. ఈమె తండ్రి జోగారావు జమిందారు పైగా సాహిత్యాభిలాషి బహుశా అందుకే కాబోలు తన కుమార్తెను కవిత్వం వ్రాయమని ప్రోత్సహించాడు 'కావ్యావళి' పేరుతో ఇందుమతి తన భర్త మీద పద్యాలు రాసింది. ఆమె వివాహం అదే ప్రాంతానికి చెందిన సోమరాజు రంగారావుతో జరిగింది. ఈ పుస్తకంలో పతిభక్తి, గోపాల శతకం, రంగనాథ స్తుతి పేరిట వేరువేరు రచనలు ఉన్నాయి? ఈమె 'శాకుంతలాభ్యుదయము' పేరిట మరో రచన చేసినట్లుగా తెలుస్తున్నది. అది ప్రస్తుతం అలభ్యం.

కావ్యావళిలో పతిభక్తి పేరిట చేసిన రచనలో అద్భుతమైన



భావచిత్రాలు మనకు కనిపిస్తాయి? ఇందుమతి తన భర్త పై గల అనురాగాన్ని భావనా తరంగములుగా భావిస్తూ వాటికి ప్రథమోర్మి, ద్వితీయోర్మి, తృతీయోర్మి, చతుర్థోర్మి, పంచమోర్మి అని నామకరణం చేసింది. ఈ వ్యాసంలో సోమరాజు ఇందుమతిదేవి విరచిత కావ్యావళి కావ్యంలోని పతిభక్తి రచనలో ఉన్న అద్భుత భావచిత్రాలను కొన్నింటిని వివరించే ప్రయత్నం జరిగింది.

శ్రీ శుభాకార ఇందిరా చిత్త చోర
పరమమృదు భాష శ్రీరంగ భవ్యవేష
పాప వాక్పరిహార స్వరూప మార
తలచి ధ్యానింతు నిను సంతతమ్ము గతిగ

(కావ్యావళి – ప్రథమోర్మి– సోమరాజు ఇందుమతీ దేవి)

శ్రీరంగపతి (విష్ణువు) భర్త ఇందిరా (లక్ష్మి) భార్య. వీరిది అన్యోన్య దాంపత్యం. విష్ణుమూర్తి లక్ష్మీ దేవిల దాంపత్యంతో వీరి దాంపత్యాన్ని పోలుస్తూ చక్కని విశ్లేషణ పాటిస్తూ రాయడం ఈ పద్యపాదాల్లో చూడవచ్చు. తన భర్తను తన మనసుదోచిన చోరునిగా అభివర్ణించడం ఒక మంచి భావం.

పద్మసంకాశమైన మీ పాదయుగ
ఆత్మ బాయక ధ్యేయమై యలరు నాకు
జలధర శ్యామలమ్ము మీ ఛాయ
దృష్టి పదము నందున నెపుడు పాయకుండు

(కావ్యావళి – ప్రథమోర్మి– సోమరాజు ఇందుమతీ దేవి)

ఈ పాదాల్లో తన భర్తరూపాన్ని గురించి చెబుతూ అతని పాదాలను పద్మాలతో పోలుస్తూ వాటిని తన ఆత్మలో(మనసు) నిలుపుకుంటానని అంటుంది. ఇంకా అతని దేహ ఛాయను మేఘ వర్ణం తో పోలుస్తూ ఆ రంగు ఎంత గొప్పగా ఉందో చెప్పడానికి, కేవలం బాగుందని మాత్రమే చెప్పకుండా చూపు మరల్చలేక పోతున్నానడం ఒక అందమైన భావం.

మీదు ముఖ తామరసములో మెలగు మధువు
కొదమ కనుదుమ్మెదలు గ్రోలుకొనుచునుండు
నిముసమైన మీ మూర్తి కన్పింపదేని
ఆ నిముస మొక్కవత్సరం బగును నాకు
(కావ్యావళి – ప్రథమోర్మి– సోమరాజు ఇందుమతీ దేవి)

మామూలుగా ఆడవారి ముఖాల్ని తామరలతో పోల్చడం చూస్తుంటాం కానీ ఇక్కడ రచయిత్రి తన భర్త ముఖాన్ని ముఖతామరస మంటుంది. ఇది చక్కని రూపకాలంకార ప్రయోగం. ఇక ఆ ముఖతామరలో పుట్టే మధువును ఆమె కొదమకన్నులు గ్రోలుతున్నాయని చెప్పడం అద్భుత ప్రయోగం. **"కదగి భోగ్య పదార్థముల్ గుడుచుచున్న, రుచ్యములుగావు మీదగు రూపుకన్న"** అని కవయిత్రి తన భర్తను చూసినంతనే తినే పదార్థాలు కూడా రుచించవని చెప్పడంలో ఒకింత అతిశయోక్తి గోచరించినా మూర్తీభవించిన ప్రేమమూర్తిని చూసినంతనే ఆకలిదప్పులు ఉండవనే మాట నిజమనిపిస్తుంది.

స్త్రీకి వివాహం జీవితంలో ఒక గొప్ప మలుపు. దానిపైనే ఆమె భావి జీవితం ఆధారపడి ఉంటుందనేది వాస్తవం. ఇక్కడ రచయిత్రి భర్త తన ప్రేమతో తల్లిదండ్రుల్ని, సోదరీసోదరుల్ని మరచిపోయేలా చేశాడు. ఆ విషయాన్నే క్రింది పాదాల్లో ఈ విధంగా చెప్పింది.

తల్లి ప్రేముడి మరపించి తండ్రిగారి
గారవంబును విస్మృతి గలుగ జేసి
సోదరీ సోదరులు నన్నునాదరించు
కంటె నెక్కుడుగా మీరు గాంచుచుండ్రు
(కావ్యావళి – ప్రథమోర్మి– సోమరాజు ఇందుమతీ దేవి)

అందుకే అతడిపై ఎల్లప్పుడు ఆ హరి కృప ఉండాలంటూ **"భాగ్యమాయివు నిత్య మారోగ్య విభవ మిచ్చి గాచుత మిమ్ము నా లచ్చి మగడు"** (కావ్యావళి – ప్రథమోర్మి– సోమరాజు ఇందుమతి దేవి) అని కోరుకుంటుంది.

ప్రణయ కవిత్వంలో విరహం ముఖ్య పాత్ర పోషిస్తుంది తన భర్త కార్యార్థియై వేరే ఊరు వెళ్లినప్పుడు అతనికి దూరంగా ఉన్న పరిస్థితిని వివరిస్తూ చెప్పిన ఒక చక్కని భావ చిత్రం గమనిస్తే –

మనసాక్రాంతమైన యా మన్మథాగ్ని
సన్నసన్నగా రగిలి నా చారు తనువు
నరనరంబులలోన తీక్షణతను జూపి
మండుచున్నది వేసంగి ఎండవోలె
(కావ్యావళి – ద్వితీయోర్మి– సోమరాజు ఇందుమతీ దేవి)

మృదువైన తీగ ఎండతీవ్రతతో వడలి పోయినట్లుగా తన తీగ వంటి తనువు విరహాగ్నిలో కాలిపోయిందని చెప్పడం మరో చక్కని భావ చిత్రం. వారిరువురి మధ్య నున్న అన్యోన్యతను గురించి రచయిత్రి చెబుతూ –

తనువులన్ భేదమే కాని తలప మనకు
ప్రియ మనోహర కనరాదు భేద మెందు
ఈ శరీర భేదమును లేదేని నాథ
మన మొకరమన్న పరమార్థ మహిమ కలుగు
(కావ్యావళి – తృతీయోర్మి – సోమరాజు ఇందుమతీ దేవి)

దంపతులుభయులు ఎప్పుడూ రెండు దేహాలు ఒకే ప్రాణంగా ఉండాలి. ద్వైతంగా నున్న అద్వైత భావం కలగాలి. అపుడే వారి అనురాగం అజరామరమవుతుంది. సూక్ష్మంలో మోక్షంలా చెప్పబడిన గొప్ప భావ చిత్రమిది.

తనివి తీరదు మీ మోము తామరసము
సొబగు నహరహంబును నేను జూచుచున్న
వెర్రి ననుచు లోకమ్ము భావించు ననుచు
మమత కుంచింతు వీక్షణ మాలికలను
(కావ్యావళి – తృతీయోర్మి – సోమరాజు ఇందుమతీ దేవి)

తన భర్తను ఎంతసేపు చూచుకున్నా తనివి తీరదని కానీ తాను చేసే ఆ పనికి లోకం నిందిస్తుందని భయం కలగడం అనే ద్వైదీ భావాలతో సతమతమవుతూ చివరికి తన మనసులోని ప్రేమను చూపుల్లో కనిపించకుండా దాచుకుంటాననడం ఒక సున్నితమైన భావచిత్రం. మన భారతీయ సంస్కృతిలో వివాహానిది ఒక గొప్పస్థానం. గృహస్థాశ్రమ ధర్మ నిర్వహణకు అదే ఆధారం. అందుకే ఏడడుగుల ఈ అనుబంధం జన్మజన్మల బంధంగా భావిస్తారు. ఈ విషయాన్నే ఇందుమతీ తనదైన శైలిలో చెబుతూ

కరము వట్టిన దాదిగా మరువలేదు
గిట్టినంతకు మరువను కేవలమ్ము
ఎన్ని జన్మల నెత్తుదు నన్నిటన్ మ
రెప్పటినైన మీకింతినేనె నాథ
(కావ్యావళి –చతుర్థోర్మి– సోమరాజు ఇందుమతీ దేవి)

పాణిగ్రహణము అయినది మొదలు తన భర్తను వదలనని, చచ్చేంత వరకు చేసిన బాస మరువనని రచయిత్రి చెబుతుంది. అంతే కాదు చచ్చిపోయి మారు జన్మలు ఎత్తినా అన్ని జన్మలలోను మీ ఇంతిగా ఉంటానని చెప్పుకోవడంలో ఎంతో భావుకత కనిపిస్తుంది.

పాలు నీళ్ళలా కలిసిపోయిన తమ జంట ఎప్పుడు ఆనందంగా ఉండాలనీ దానికి ఆ శ్రీరాముని కృప ఉండాలని వెడుతూ

భరతశత్రుఘ్ను లంగదవాయుసుతులు
జాంబవంతుడు నీలుండు సరణిగొల్వ
రత్నసింహాసనంబెక్కి రమణితోడ
పుడమి నేలెడి రాముడు ప్రోచు మనల
(కావ్యావళి – పంచమోర్మి– సోమరాజు ఇందుమతీ దేవి))

అన్యోన్యంగా మెలిగే దంపతులను సీతారాములుగా పోల్చడం

పరిపాటి. ఆ పుణ్య దంపతుల ఆశీర్వాదాలు తమ జంటపై ప్రసరించాలని చెప్పిన పై భావచిత్రంలో శ్రీరామ పట్టాభిషేక సన్నివేశం కళ్ళ ముందు కదలాడుతుంది.

ఈ విధంగా సోమరాజు ఇందుమతి తన మదిలో మెదలిన భావాలను మృదుమధురమైన రీతిలో పాఠకులను ఆకట్టుకునేలా రచించింది. ఆంగ్ల సాహిత్య ప్రభావంతో వచ్చిన భావకవిత్వానికి ఒక పతివ్రతయైన తెలంగాణ స్త్రీ తన భావ పరిమళాలను జోడించి, తెలుగు సాహిత్యంలో భావ కవిత్వానికి పట్టంకట్టి, కావ్యావళిగా ముద్రణ వేయించిన తొలి కవయిత్రిగా చరిత్రలో నిలిచిపోయింది.

ఆధార గ్రంథాలు

1. సాహిత్య చరిత్రలో చర్చనీయాంశాలు : ఆచార్య జి. వి. సుబ్రహ్మణ్యం

2. ఆధునికాంధ్ర గేయ కవిత్వం : డా. జి. చెన్న కేశవరెడ్డి

3. కావ్యావళి: సోమరాజు ఇందుమతీ దేవి – సంపాదకులు డా. సంగిశెట్టి శ్రీనివాస్

❖ ❖ ❖ ❖ ❖

రహదారి దీపాలు

డా. ఎం. పురుషోత్తమాచార్య, రామగిరి, నల్లగొండ. ఫోన్ : **939 66 11 905**

మొహెంజోదారో, సింధు నాగరికతాపరిశోధనలో నత్తగుల్లల ఆభరణాలు లభించడం చూసి పరిశోధకులు ఆశ్చర్యపోయారు. వాటికి కాలపరీక్ష చేయిస్తే సుమారు క్రీ.పూ. 3300 సం.ల నాటివని తేలింది. ఆ ఆభరణాలు ధరించే సంస్కృతి కలిగిన జాతి కోసం అన్వేషణ చేయగా "గోర్‌బంజారాల" చరిత్ర బైటపడింది. గోర్‌బంజారాలనే లమానీలు, లంబానీలు, లంబాడీలు, సుగాలీలు, లభానులు, గవారియాలు, బలదియాలు, సుర్కిబాండ్లు అని కూడా పిలుస్తారు. వీరు ఆసియా, యూరప్ ఖండాలలో వ్యాపించి ఉన్నారు. వీరికి 'ఆదిమూలవాసులు' అనే ప్రసిద్ధి కూడా ఉంది.

అనాదిగా ఈ జాతివారు వస్తురవాణానే వృత్తిగా స్వీకరించారు. ఈ వృత్తిని వారి భాషలో 'లదిః' అని పిలుస్తారు. గుర్రాలు, ఎడ్లబండ్లు, గాడిదలు, ఒంటెలు మొదలైనవాటితో గోధుమ, బియ్యం, చిమ్మట, పప్పుధాన్యాలు, బఠానీలు, చక్కెర, మిశ్రీ, ఖాండ్, బాదం, సంభార్ ఉప్పు, దఖ్, కిస్మిస్, సోంత్, మిర్చి, కేసర్, లవంగ్, సుపారి మొదలైనవాటిని రవాణా చేసేవారు. వీటిని రవాణా చేస్తూ సుదూరతీరాలకు కూడా ప్రయాణించేవారు. అలా ప్రయాణాలు చేయగా చేయగా ఆ దారులు నిర్దిష్టమైన మార్గాలుగా ఏర్పడ్డాయి. నగరాలను, గ్రామాలను కలుపుతూ వెళ్ళిన ఈ మార్గాలనే రవాణా సౌకర్యాలు ఏర్పడ్డాక ప్రధానమార్గాలుగా మారాయి. బ్రిటిషువారి కాలంలో అవే మార్గాలు 'రహదారి' పద్ధతిని రూపొందించాయి. ఇప్పటికీ మనం అవే దారులను హైవే రోడ్లుగా, రైల్వే మార్గాలుగా ఉపయోగిస్తున్నాం. ఇట్లా మనకు రహదారులను చూపిన మార్గదర్శకులు 'గోర్ బంజారాలు'. కనుకనే వారు మానవజాతికి 'రహదారిదీపాలు'.

ఇలాంటి అపూర్వవిషయాలను, బంజారాల సమగ్రచరిత్రను సమాజానికి అందించే కృషిలో డా॥ధనంజయ నాయక్,



డా॥సూర్యాధనంజయ్ దంపతులు సంయుక్తంగా రచించిన ఒక అనర్ఘగ్రంథమే "బంజారా చరిత్ర". దీనిలో బంజారాల ఉనికి, చారిత్రక ఆధారాలు, ప్రాచీన, మధ్యయుగాలలోని బంజారాల జీవనశైలి, ఆ జాతిలో సాంస్కృతిక, ఆధ్యాత్మికవికాసాన్ని ప్రోది చేసిన గురువులు, యోధుల చరిత్ర, బ్రిటిషువారి పాలనలో బంజారాల అవస్థలు, జీవనపరిణామం, స్వాతంత్ర్యానంతరం వృత్తిని కోల్పోయిన వైనం, ఆధునికకాలంలో బంజారాలకు రిజర్వేషన్ ఉద్యమాలు, విజయాలు మొదలైన ఎన్నో విషయాలను ఈ గ్రంథంలో సవివరంగా ప్రామాణికంగా చర్చించారు. బంజారాలకు లిపి లేని కారణంగా పూర్తి ఆధారాలు లభించకున్నా శాసనాలు, ఆనాటి రచనలు, ఇతరగ్రంథాలలోని ప్రస్తావనలు మొదలైనవాటిని కూలంకషంగా పరిశీలించారు. రాష్ట్రాలవారీగా బంజారాల పేర్లను ఎలా వ్యవహరిస్తున్నారో పరిచయం చేశారు.

తిరుమల క్షేత్రచరిత్రలో ముఖ్యమైన భక్తునిగా ప్రసిద్ధి పొందిన 'బాలాజీ', బంజారా జాతికి చెందిన మహనీయుడనే విషయం దీని ద్వారా వెల్లడి అవుతున్నది. బంజారాల భాషను 'గోర్బోలీ' అని

పిలుస్తారు. ఆ భాషలో ఉన్న ఆణిముత్యాల్లాంటి కొన్ని సూక్తులను ఇందులో ప్రస్తావించారు. అంతేకాదు, 1857 నాటి సిపాయిల తిరుగుబాటులో, స్వాతంత్ర్యసమరంలో, తెలంగాణా రైతాంగ సాయుధ పోరాటంలో, ప్రత్యేకతెలంగాణా రాష్ట్ర ఉద్యమచరిత్రలో బంజారా యోధులు ఎలా పాల్గొని త్యాగాలు చేశారో చక్కగా వివరించారు. అంతటితో ఆగక మనకు రాజ్యాంగం ఏర్పడిన తరువాత ఎస్.టి. రిజర్వేషన్ విషయంలో ఏండ్లకొద్దీ పోరాడి హక్కులను సాధించుకున్న విధానాన్ని కూడా చక్కగా పొందుపరిచారు.

వస్తురవాణా వృత్తి 'లదిః' ని శతాబ్దాలుగా కొనసాగించిన ప్రాచీన సంచారజీవులుగా, వస్తురవాణా యోధులుగా గుర్తింపబడిన బంజారాల ప్రయాణానికి ప్రతీకలుగా, చారిత్రికసాక్ష్యాలుగా ఇప్పటికీ నిలచియున్న ఎన్నో నిర్మాణాలను గూర్చి చక్కని సమాచారాన్ని ఈ గ్రంథంలో మనం గమనింపవచ్చు.

ఇంత చరిత్ర ఉన్న బంజారాలకు 'లిపి' లేకపోవడం చాలా వెలితిగా అనిపిస్తున్నది. అదే కనుక ఉండిఉంటే, గోర్బోలీ భాషా సాహిత్యం ఇవాళ ప్రపంచంలో సూర్యునిలా వెలిగిపోయేది. ఎక్కడ నివసించే బంజారులు అక్కడి స్థానిక భాషాలిపిలో తమ రచనా విధానాన్ని మలుచుకున్నారే కాని ఎవరూ లిపి సృష్టి కోసం ప్రయత్నించినట్లు కనిపించదు. ఈ ప్రస్తావన గ్రంథంలోకి చేరలేదు. భాషాశాస్త్రవేత్తలందరూ గోర్బోలీభాష మాల్వా, నిమాడీ ప్రాంతంలో ఉద్భవించిందని చెబుతున్నారు కాని, ఆ ప్రాంత సంప్రదాయం ప్రకారంగా కూడా లిపిని తీర్చిదిద్దలేకపోయారు. దీనికి సామాజిక, రాజకీయ కారణాలేవో ఆటంకం కలిగించి ఉండవచ్చు.

అయితే, ఒక గిరిజనభాషకు క్రొత్తగా లిపిని నిర్మించడం ఆధునిక కాలంలో కష్టమయితే కావచ్చు. కాని, అసాధ్యమేమీ కాదుగదా! శబర (సవర) భాషకు లిపిని రూపొందించి, వ్యాకరణం కూడా వ్రాసిన గిడుగు రామమూర్తిగారి ఆదర్శం మనకుండనే ఉందిగదా!

మూసీ

సాహిత్య సాంస్కృతిక చారిత్రక మాసపత్రిక

మూసీ మాస పత్రిక సభ్యులుగా చేరండి

వెంటనే శాశ్వత చందాదారులు కండి.

సాహిత్య రంగంలో వెలువడుతున్న ఒకే ఒక

పరిశోధనాత్మక వ్యాసాల మాస పత్రిక

యూజీసీ కేర్ లిస్ట్‌లో చేరిన తెలుగు పరిశోధనా పత్రిక

శాశ్వత సభ్యత్వం (10 సం॥లు)... 2500/-

సంప్రదించండి. మూసీ మాసపత్రిక... ఫోన్ : 934 7971177

మనం రూపొందించలేమా? బంజారాలలో భాషావేత్తలున్నారు, పండితులున్నారు, మేధావులున్నారు. అందరూ కూర్చుని 'లిపి' ని ఏర్పరచాలనుకుంటే ఒక చారిత్రక ఘట్టం సాకారమవుతుందనడంలో సందేహం ఏమాత్రం లేదు. ఇందుకు ముందుగా పూనుకోవలసిన వారు ధనంజయనాయక్ దంపతులే కావాలి. మాల్వా, నిమాడీ ప్రాంత భాషాసంప్రదాయాలను అధ్యయనం చేసి, బంజారా పండిత పరిషత్తును ఏర్పాటు చేసి, గిరిజనేతర భాషావేత్తలను కూడా కలుపుకుని బంజారాలకు 'లిపి' ని రూపొందించే మహత్తరకృషి ఉద్యమస్ఫూర్తితో నిర్వహించాల్సిన అవసరం ఉంది. "లిపి లేదు, లిపి లేదు" అని పదేపదే బాధపడేదాని కన్న ఈ ప్రయత్నచలనం ఎంతో మేలు చేస్తుంది. ఇప్పటికైనా లిపి రూపొందించకపోతే ముందు తరాల వారికి చెప్పడానికి మన దగ్గర సమాధానం ఉండదు. వారికెంతో నష్టం చేసినవాళ్ళమవుతామని కూడా ఆలోచించాలి.

తెలుగులో ఉపయోగించే "జో, జోల" అనే పదాలు తెలుగు పదాలు కావు. బంజారాల నుంచి వచ్చినవే. 'జో' ను దంత్యంగా ఉపయోగిస్తే 'నిదుర పో' (హిందీలో 'సోజా') అని అర్థం. 'జో' ను తాలవ్యంగా ఉపయోగిస్తే (జావో) 'వెళ్ళు' అని అర్థం అంటూ కొందరు పండితులు వ్యాఖ్యానించారు. కనుక 'జోలపాటలు' అనే పదబంధం బంజారాలు సృష్టించినదే అని మరికొందరి అభిప్రాయం.

లిపిని రూపొందించుకోవడం భాషా, సాహిత్య, చారిత్రికవికాసం కోసమే కాని అపచారమేమీ కాదు, కాబోదు. ఒకప్పుడు లేకపోయినంత మాత్రాన ఇప్పుడు కూడా సృష్టించడం మానేసి ఇదొక సంప్రదాయమని సరిపెట్టుకోవడం సమంజసమనిపించుకోదు. లిపిని రూపొందించాక భారతదేశంలోని గోర్బంజారాలతో ఒక మహాసభను ఏర్పాటు చేసి, 'లిపి' ని అందరికీ చేరవేయవచ్చు. పాఠ్యపుస్తకాలుగా, హ్యాండ్‌బుక్స్‌గా ముద్రించి అందరికీ అందించవచ్చు. అవసరమైతే బంజారాల జనాభా సంఖ్యను బట్టి ఏదో ఒక రాష్ట్రంలో వారికి ప్రత్యేకమైన 'జిల్లా' గా కూడా ఏర్పాటు చేసుకోవచ్చు.

ఎంతో శ్రమకోర్చి ఈ పుస్తకాన్ని వ్రాయడంలో తగిన భక్తిశ్రద్ధలు చూపిన ధనంజయ నాయక్ దంపతుల కృషిని అందరూ అభినందించవలసినదే. అయితే, రచనాపథకం విషయంలో, రచనాశైలిలో మరికొన్ని జాగ్రత్తలు తీసుకోవలసి ఉన్నదేమో అని అనిపిస్తున్నది. ఈ పుస్తకం వల్ల తెలుగువారందరికీ బంజారాల గురించిన అనేకవిషయాలలో సదవగాహన ఏర్పడుతుందని ఖచ్చితంగా చెప్పవచ్చు.

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 9 హైదరాబాద్ జులై : 2025

స్వకృతి



చిరునామా

మూసీ రచయితలకు, చందాదారులకు విజ్ఞప్తి.

చందాలు, రచనలు పంపాల్సిన చిరునామా
సంపాదకుడు, మూసీ మాసపత్రిక,
ఇం.నెం. 2-2-1109/బికె-ఎల్.ఐ.జి.10,
బతుకమ్మకుంట, బాగ్అంబర్‌పేట,
హైదరాబాద్-500013.
చందాలకు ఆన్‌లైన్ అకౌంట్
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, నల్లకుంట, హైదరాబాద్.
అకౌంట్ నెం. 52019740642
IFS Code : SBIN0020083
editormusi@gmail.com



జ్యోతిర్మయమ్ - సీతాచరితమ్ (శ్రీరామాయణ పద్యకావ్యం)
నాగజ్యోతి రమణ సుసర్ల
వెల : 300
ప్రతులకు: రచయిత్రి కేరాఫ్ ఎస్. వెంకటరమణ, 26, శ్రీమాత, 5వ క్రాస్, 8వ మెయిన్, అక్షయనగర వెస్ట్, యెల్లనహల్లి, బెగూర్, బెంగుళూరు -560068



మాయల చిప్ప (ఇంకొన్ని అక్కడిక్కడి కతలు)
డా. పత్తిపాక మోహన్
వెల : 40
ప్రతులకు: గరిపెల్లి అశోక్, 404, విఎల్ఆర్ రెసిడెన్సీ, శ్రీనివాస నగర్, సిద్ధిపేట - 502 103.
ఫోన్ : 98496 49101



తెలుగు భాషా శతకము
డా. నలవోలు నరసింహారెడ్డి
వెల : 50
ప్రతులకు :
రచయిత
ఫోన్ : 9848898515



శ్రీ విష్ణు సహస్ర నామ స్తోత్రము
డా. తిరుమల శ్రీనివాసాచార్య
వెల : 150
ప్రతులకు : రచయిత, ఎ 40, 201, సింగపూర్ క్లాస్ (సంస్కృతి) టౌన్‌షిప్, హైదరాబాద్ - 500 088)
ఫోన్: 99493 65930



ధూర్జటి లింగరాజ కవి ప్రణీత శ్రీకాళహస్తిస్థల మాహాత్మ్యము అను పెద్దకాళహస్తి మహత్త్వము
పరిష్కర్త : విద్వాన్ లగడపాటి భాస్కర్
వెల : 290
ప్రతులకు: విద్వాన్ అట్ల పురుషోత్తం గౌడ్ 5-120, ముత్యాలమ్మ గుడివీధి, శ్రీకాళహస్తి, తిరుపతి - 517644
ఫోన్: 9703062502



విమర్శనారామం (ఆచార్య ఎస్వీరామారావు సమగ్ర సాహిత్యం - సమాలోచన)
సం : ఆచార్య సాగి కమలాకర శర్మ
వెల : 250
ప్రతులకు : మూసీ మాసపత్రిక, హైదరాబాద్
ఫోన్ : 934 797 1177



రేపటి తరం కోసం (కవితా సంపుటి)
ఎజ్జు మల్లయ్య
వెల : 80
ప్రతులకు : రచయిత, నర్సాయిపల్లి, కోడేరు మండలం, నాగర్ కర్నూలు జిల్లా,
ఫోన్ : 9652871915



శ్రీ లక్ష్మీ నృసింహస్తోత్ర వైజయంతి
(గూటాల గ్రామ లక్ష్మీనరసింహ స్తోత్రాలతో)
రచయిత : మధురకవి ఆచార్య శ్రీవత్స
వెల : 342
ప్రతులకు: శ్రీమతి పి. రమాదేవి, 5-98, వేమమాను వీధి, తిరుచానూరు పోస్టు - 517503
ఫోన్ : 99890 33696

ISSN 2457-0796

కాగితం పేలిక

డా. ఎన్. గోపి

ఫోన్ : 939 102 8496

ఎక్కడి నుంచో
ఓ కాగితం పేలిక ఎగిరొచ్చి
మా వాకిట్లో వాలింది
దానిని శుభ్రపరిచి
భద్రంగా ఓ పుస్తకంలో పెట్టాను
ఎప్పటికైనా
ఓ కవితను పొదుగుతుందని

ఎగురుతున్నప్పుడది
తెల్లని సీతాకోక చిలుకలా ఉంది
కొన్నాళ్ళకది
రంగులతో బైట పడుతుందేమో చూద్దాం

రెండు వారాలు గడిచింది
పుస్తకం ఎక్కడో తప్పిపోయింది
నా మనసులో
రూపు దిద్దుకుంటున్న అక్షరాలు
కాగితం కోసం తపిస్తున్నాయి

మ్యాగీని తింటూ
మునుపటి అల్లికను తలుచుకుంటున్నాను
జ్వరం వచ్చినప్పుడల్లా
బత్తాయిపండు
ఆరోగ్య దేవతలా అనిపిస్తుంది
కవిత్వమంటే అదేనేమో!

హమ్మయ్య!
ఇవాళ పుస్తకం దొరికింది.
నిద్రపోయిన కాగితం
తాజా పరిమళాలను పంచుతుంది
దాని విస్తీర్ణమూ
పెరుగుతూ పోయింది
హృదయానికి కాగితానికీ
కుదిరిన అనుబంధం
ఈ కవిత పుట్టుకకు కారణమైంది.

ఫర్టీ 9 సంతాన సాఫల్యత కేంద్రం

మీ మాతృత్వపు స్పర్శకు దూరం అయ్యారా?

అందమైన చిన్ని చిన్ని అడుగులు..
బోసి బోసి నవ్వుల కేరింతలు...
ఒక పూజ్యమైన అలక, అలుపెరగని ఉల్లాసం..
మారం చేస్తూ, మైమరిపిస్తూ...
మీ ఆనందం అంబరాన్ని తాకాలా ?

సరోగసి, అసిస్టెడ్ హ్యాచింగ్,
ఎంబ్రియో &సెమెన్ ఫ్రీజింగ్,
స్త్రీలలో గర్భాశయ అండాశయ
లోపాల నివారణ-చికిత్స,
వెరికోసిల్, వీర్యకణాల లోపం,
ల్యాప్రోస్కోపిక్ విధానం ద్వారా
లోపాల నిర్ధారణ -సవరణ,
ఆధునిక వైద్యవిధానాలతో చికిత్స.

7416 106 106

www.ferty9.com

మీరు తీసుకునే
ప్రతి నిర్ణయానికి
మా ప్రేమ, సేవ
అంకిత భావం మీకు
తోడుగా ఉంటుంది.

IUI | **IVF** | **ICSI** | **IMSI** | **HSG**

ఫర్టీ 9 హాస్పిటల్ మరియు పరిశోధన కేంద్రం

మీ ఆశ, మీ స్వప్నం ఫలిస్తుంది ఫలప్రదంగా...

విజయ డయాగ్నస్టిక్స్ ఎదురుగా, సికింద్రాబాద్ మరియు నిజాంపేట్ క్రాస్ రోడ్, కూకట్‌పల్లి, హైదరాబాద్

Scanned with OKEN Scanner